గత వైసీపీ ప్రభుత్వ హయాంలో క్లాప్ పేరుతో పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం విడుదల చేసిన నిధులు దారిమళ్లాయి. అప్పటి ఒంగోలు నగర పాలక సంస్థ పాలకవర్గ సభ్యులతో కొందరు అధికారులు కుమ్మక్కయ్యారు. కాంట్రాక్టర్లతోనూ కలిసిపోయారు. పారిశుధ్య పనుల్లో చేతివాటం చూపించి అవినీతి కంపు కొట్టించారు. పక్కా ప్రణాళికతో ప్రజాధనాన్ని లూటీ చేశారు. పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు చేసుకొని బొక్కేశారు. పైపెచ్చు ఇష్టారీతిన వాహనాలను కొనుగోలు చేయడమే కాకుండా వాటి నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో అవి మూలనపడ్డాయి. ఆయా వాహనాలకు డీజిల్, మరమ్మతులు, డ్రైవర్ల జీతాల పేరుతో పక్కాగా దోచేయడం కొసమెరుపు.

బిల్లుల పేరుతో భారీ దోపిడీ


ఒంగోలు సంతపేటలోని ఓహెచ్‌టీ వద్ద నిరుపయోగంగా ఉన్న వాహనాలు



కార్పొరేషన్‌లో పనిచేయని వాహనాలకు డీజిల్, మరమ్మతులట

వైసీపీ హయాంలో పనులు చేయకుండానే స్వాహా..!

- రూ.కోటి విలువైన వాహనాలు మూలకు
- విధుల్లో లేని డ్రైవర్లకు నెలనెలా వేతనాలు
- గడిచిన ఐదేళ్లలో ఇష్టారాజ్యంగా లూటీ
- మొత్తం వ్యవహారంపై కమిషనర్ దృష్టి

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒంగోలు నగరపాలక సంస్థలో అధికారులు, వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అక్రమాలు, అవినీతి, అధికార పెత్తనంతో నగరాభివృద్ధిని విస్మరించారు. అనేక అవకతవకలకు పాల్పడి ప్రభుత్వ నిధులను పెద్దమొత్తంలో స్వాహా చేశారు. ఆ సమయంలోనే ఒంగోలు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు క్లాప్ నిధులను పక్కదారి పట్టించినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కమీషన్ల కోసం కక్కుర్తిపడి వారు తీసుకున్న నిర్ణయాలతో కొనుగోలు చేసిన పరికరాలు నిర్వహణ లోపంతో చెత్తపాలయ్యాయి. ఆయా వాహనాల మరమ్మతుల పేరుతో ఏటా రూ.50 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు చెబుతూ దోపిడీకి తెగబడ్డారు. పాడైపోయిన వాహనాల నంబర్లను చూపి డీజిల్ కొనుగోలు పేరుతో నెలకు రూ.9లక్షలు నిధులు దోచేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

వెలుగులోకి అక్రమాలు

గత వైసీపీ పాలనలో పనిచేసిన పలువురు ఇంజనీర్లు వాహనాల డీజిల్, మరమ్మతుల పేరుతో భారీగా బిల్లులు చేసుకొని బొక్కేసినట్లు తెలుస్తోంది. వాహనాలు మాత్రం మూలకు చేరాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం అధికారులు వాటిపై దృష్టి సారించారు. కొన్నింటిని బాగు చేయించి వినియోగంలోకి తీసుకు వచ్చి ఈ ఇరవై రోజుల్లోనే రూ.లక్షన్నర వరకు డీజిల్ ఖర్చులు తగ్గించేశారు. పాడైపోయిన వాహనాలను పూర్తిస్థాయిలో బాగు చేయించి, వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ప్రజారోగ్యం, పారిశుధ్యం మరింత మెరుగుపడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాగే గతంలో జరిగిన.. నిలిచిపోయిన వాహనాల మరమ్మతులు, డీజిల్ కొట్టించడం, ఇతరత్రా అవినీతిపై విజిలెన్స్ విచారణ చేస్తే వాస్తవాలు మరిన్ని వెలుగు చూసే అవకాశం ఉంది.

రూ.కోటి విలువ చేసే వాహనాలు నిరుపయోగం

నగర అబివృద్ధి కోసం ప్రజలు చెల్లించే ప్రతి పైసాను ప్రగతి కోసమే ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్న యంత్రాంగం ఆచరణలో మాత్రం గాడి తప్పింది. చెత్త సేకరణ కోసం లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన డంపర్ ప్లేజర్, ట్రాక్టర్ డోజర్, మినీ ఎక్స్‌కవేటర్ నిరుపయోగంగా మారాయి. రూ.కోటికిపైగా విలువ చేసే ఈ యంత్రాలకు రూ.10లక్షలు వెచ్చిస్తే వినియోగంలోకి వస్తాయని తెలిసినా పట్టీపట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. సుమారు

మిగతా 6వ పేజీలో

మహిమాన్విత క్షేత్రం.. నిర్మమహేశ్వర ఆలయం

- పంచెకోవెల, దక్షిణ కాశీగా విశేష గుర్తింపు
- 27న రథోత్సవం
- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు

7లో


నిర్మమహేశ్వరుడి ఉత్సవం నిర్వహించే రథం (ఫైల్)


ఫైనాన్స్ కంపెనీ వారు స్వాధీనం చేసుకున్న ఆటోలు

పారిశుధ్య పనులు పాతపద్ధతిలోనే..!

- చెత్తసేకరణ ఆటోలను స్వాధీనం చేసుకున్న ఫైనాన్స్ కంపెనీ
- ఇకపై పుష్‌కార్ట్‌లు.. ట్రాక్టర్లతోనే ఇంటింటి చెత్త సేకరణ

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అమలు చేసిన క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) అట్టర్ ఫ్లాప్ అయింది. ఇంటింటి చెత్త సేకరణ విధానం అభాసుపాలైంది. సొంత మనుషుల లబ్ధి కోసం నాటి ముఖ్యమంత్రి జగన్ పారిశుధ్యం పేరుతో ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణను అమలులోకి తెచ్చారు. అందులో భాగంగా ఏజెన్సీ లబ్ధి కోసం ప్రజల నుంచి చెత్తపన్ను వసూలు చేశారు. ప్రజల నుంచి వసూలైన సొమ్ము నెలకు రూ.36లక్షలు రెడ్డి ఏజెన్సీకి కట్టారు. అయితే

మిగతా 6వ పేజీలో

మర్చిపోయావా.. మార్చేస్తున్నావా?

- వైపాలెం ఎమ్మెల్యేపై జగన్ కామెంట్
- సొంత పార్టీలో విస్తృత చర్చ
- బాలినేనితో జతకడతారనే అనుమానం
- జిల్లా నేతల నుంచి జగన్‌కు ఫిర్యాదులు
- చంద్రశేఖర్ అనుయాయుల్లో నాయకత్వంపై అసంతృప్తి


(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎర్రగొండపాలెం శాసనసభ్యులు చంద్రశేఖర్ రాజకీయ నడకను వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అనుమానిస్తున్నారా.. లేక యథాప్రకారం అవమానించారా..? ఇది రాజకీయవర్గాల్లోనే కాక ఆ పార్టీలోనూ చర్చనీయాంశమైన అంశం. వైసీపీ శ్రేణుల్లో రకరకాల ఊహాగానాలు వెలువడుతుండగా తలపండిన రాజకీయ నాయకులు మాత్రం జగన్ అంతే.. మారడంతే అని వ్యాఖ్యానిస్తున్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో చంద్రశేఖర్‌ను ఉద్దేశించి జగన్ కామెంట్ చేశారు. తనతోపాటు వైసీపీ ఎమ్మెల్యేలంతా పార్టీ కండువాలతో జగన్‌ను అనుసరించారు. చంద్రశేఖర్ మాత్రం వేసుకోలేదు. అది చూసిన జగన్ నీ మెడలో పార్టీ కండువా ఏది అని అడగారు. వెంటనే చంద్రశేఖర్ హడావుడిగా వస్తూ మర్చిపోయానని సమాధానమిచ్చారు. వెనువెంటనే జగన్ మర్చిపోయావా.. మార్చేయాలనుకుంటున్నావా? అంటూ అందరి ముందే బహిరంగంగా వ్యాఖ్యానించారు. దీంతో చిన్నబోయిన చంద్రశేఖర్ నిశ్శబ్దంగా వెనక్కు వెళ్లిపోయారు. అయితే తనతోపాటు ఉన్న 11 మంది ఎమ్మెల్యేల్లో ఒకరిగా దళిత వర్గానికి చెందిన చంద్రశేఖర్‌ను అందరిలో జగన్ అలా కించపర్చటం రకరకాల విమర్శలకు తావిచ్చింది. తన వద్ద ఉన్న సమాచారం మేరకు చంద్రశేఖర్ భవిష్యత్తు రాజకీయ నడకపై అనుమానంతోనే ఆ వ్యాఖ్యానం చేశారని వైసీపీ శ్రేణుల్లో కొందరు భావిస్తున్నారు. తోటి నాయకులను ప్రత్యేకించి దళిత నాయకులను చిన్నచూపు చూడటం జగన్‌కు అలవాటేనని అదే ఇక్కడ ప్రతిబింబించిందని వారి అభిప్రాయం.

బాలినేని ప్రభావం..

వైసీపీకి ఇటీవల రాజీనామా చేసి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేనితో ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకొని తనకున్న సమాచారంతోనే జగన్ అలా వ్యాఖ్యానించి ఉంటారని ఎక్కువ మంది భావిస్తున్నారు. గత ఎన్నికల్లో ఎర్రగొండపాలెం వైసీపీ టిక్కెట్ చంద్రశేఖర్‌కు రావడంలో బాలినేని మద్దతే కీలకం. అయితే బాలినేని జనసేనలోకి వెళ్లగానే చంద్రశేఖర్ కూడా పార్టీ మారే అవకాశాలపై చర్చ జరిగింది. కానీ ఆయన తాను వైసీపీలోనే ఉంటానని ప్రకటించటంతోపాటు అప్పటి నుంచి నియోజకవర్గ, జిల్లాలోనూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇప్పటికీ వైసీపీ పిలుపిచ్చిన కార్యక్రమాల నిర్వహణలో ఆయన జిల్లాలో అందరికంటే ముందున్నారు. అయినా జగన్ అలా అనటంలో ఏదో సమాచారం ఉండే ఉంటుందని వైసీపీలో ఒక వర్గం భావిస్తోంది. అయితే చంద్రశేఖర్ అనుయాయులు, సాధారణ వైసీపీ శ్రేణులు మాత్రం జగన్ వ్యాఖ్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు జగన్‌కు కొందరు చంద్రశేఖర్‌పై ఫిర్యాదులు చేశారనే భావన కూడా వ్యక్తమవుతోంది. దళితవర్గానికి చెందిన చంద్రశేఖర్ ఇలానే ముందుకు సాగితే జగన్ మద్దతుతో జిల్లా పార్టీలో పెత్తనం చెలాయిస్తారన్న భావనతో ఇద్దరు నాయకులు జగన్‌కు చంద్రశేఖర్‌పై పదేపదే ఫిర్యాదులు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం బాలినేని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను మంగళగిరిలో కలవనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో చంద్రశేఖర్‌పై జగన్ చేసిన కామెంట్ వైసీపీలో దుమారం లేపే అవకాశం లేకపోలేదు.





గవర్నర్ ప్రసంగంలో వెలిగొండ

- త్వరలో పూర్తిచేస్తామని ప్రభుత్వం తరపున ప్రకటన
- 28న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేటాయింపులపై ఆశలు

ఒంగోలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుకు గవర్నర్ ప్రసంగంలో చోటు లభించింది. దాన్ని త్వరగా పూర్తిచేస్తామని ప్రభుత్వం తరపున గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రకటించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వ ప్రాధాన్యతలు, అమలు చేయనున్న పథకాలు, ఇతరత్రా కీలక అంశాలను ప్రభుత్వం గవర్నర్ ప్రసంగంలో చేర్చుతుంది. ఆ ఏడాదంతా ఇందులో పేర్కొన్న అంశాలపైనే

మిగతా 6వ పేజీలో

అలా ఎలా చేస్తారు?

- నిబంధనలకు విరుద్ధంగా పొగాకు సమాఖ్య పీఐసీ చైర్మన్ నియామకం
- బాధ్యులైన డీసీవో, డీఎల్‌సీవోపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన టీడీపీ నగర అధ్యక్షుడు కొఠారి


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నగర అధ్యక్షుడు కొఠారి, నాయకులు

ఒంగోలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య (పొగాకు సమితి) పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ) చైర్మన్ నియామకంలో డీసీవో శ్రీనివాసరెడ్డి, డీఎల్‌సీవో పోలిశెట్టి రాజశేఖర్‌లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని టీడీపీ ఒంగోలు నగర కమిటీ అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు ఆరోపించారు. ఆ నియామకాన్ని రద్దు చేయడంతోపాటు అందుకు బాధ్యులైన డీసీవో, డీఎల్‌సీవోలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఒంగోలు కేంద్రంగా ఉన్న పొగాకు సమాఖ్య పరిధిలో ఉమ్మడి జిల్లాలోని వేలాది మంది రైతులు ఉన్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అందులో దాదాపు 11వేల మంది టీడీపీ మద్దతుదారులైన రైతులను గత వైసీపీ ప్రభుత్వంలో సహకార శాఖ అధికారుల సహకారంతో వైసీపీ నేతలు తొలగించి వేసి పాలకవర్గాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఈనెల 12తో సదరు పాలకవర్గ పదవీ కాలం పూర్తి కాగా జిల్లా సహకార ఆడిట్ అధికారి కార్యాలయం నుంచి అసిస్టెంట్ రిజస్ట్రార్‌గా ఉన్న సూది శ్రీనివాసరావును డీసీఎల్‌వో రాజశేఖర్ నియమించారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సమాఖ్యకు పీఐసీ చైర్మన్‌గా డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయి లేదా అంతకన్నా ఎక్కువ కేడర్ ఉన్న అధికారిని నియమించాల్సి ఉందన్నారు. అయితే అందుకు విరుద్ధంగా అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఉన్న శ్రీనివాసరావును నియమించారన్నారు. అది కూడా డీఎల్‌సీవో పరిధిలో కాకుండా ఆడిట్ ఆఫీసులో ఉన్న ఉద్యోగిని నియమించడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇది చెల్లుబాటు కాదన్న విషయం తెలిసినా డీసీవో శ్రీనివాసరెడ్డి

మిగతా 6వ పేజీలో

ఘరానా మోసం

- రైస్‌పుల్లింగ్ పేరుతో బురిడీ
- రూ.3.28లక్షల దోపిడీ
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- పందిళ్లపల్లి టోల్‌ప్లాజా వద్ద ఘటన



7

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్టు

- 88 కేజీల రాగితీగ స్వాధీనం
- వివరాలను వెల్లడించిన దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ



వివరాలు 7వ పేజీలో

పీఎం కిసాన్ నిధులు జమ

- జిల్లాలో 2.48 లక్షల మంది రైతులకు రూ.49.51 కోట్లు విడుదల
- బిహార్ నుంచి ప్రధాని మోదీ కార్యక్రమం జిల్లాలోని ఆర్‌ఎస్‌కేలలో వీక్షణ


దర్శి కేవీకేలో ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ సమ్మాన్ ఆరవ వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రమేష్, వేదికపై డీఏవో శ్రీనివాసరావు, అధికారులు

ఒంగోలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధులను కేంద్ర ప్రభుత్వం సోమవారం నేరుగా లబ్ధిదారులైన రైతుల ఖాతాలలో జమ చేసింది. కేంద్రం ఏటా రూ.2వేల వంతున మూడు విడతలుగా రూ.6వేలను దీని కింద అందజేస్తోంది. ఈపథకాన్ని ప్రవేశపెట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఆరో వార్షికోత్సవం నిర్వహించారు. బిహార్ రాష్ట్రంలోని భాగల్పూర్‌లో జరిగిన సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 19వ విడత నిధులను విడుదల చేశారు. ఆ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ఉన్న రైతు సేవా కేంద్రాల్లో రైతులు ప్రత్యక్షంగా వీక్షించేలా జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. దర్శిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన సభలో జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) సిహెచ్.శ్రీనివాసరావు, ఏరువాక సైంటిస్ట్ డాక్టర్ రమేష్‌తోపాటు వ్యవసాయశాఖ అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. కాగా 19వ విడత పీఎం సమ్మాన్ పథకంలో భాగంగా జిల్లాలో మొత్తం 2.48 లక్షలమంది రైతులకు రూ.49.51 కోట్లు విడుదల కాగా సోమవారమే చాలామందికి వారి వారి ఖాతాల్లో జమ అయినట్లు అధికార వర్గాల సమాచారం.

నియోజకవర్గం పేరు	లబ్ధిదారుల సంఖ్య	విడుదలైన మొత్తం రూ.కోట్లలో
దర్శి	38,159	7.63
గిద్దలూరు	35,551	7.11
కనిగిరి	38,902	7.78
కొండపి	34,135	6.83
మార్కాపురం	31,262	6.25
ఒంగోలు	8,050	1.61
ఎస్‌ఎన్‌పాడు	26,833	5.37
వైపాలెం	35,108	7.02
మొత్తం	2,48,000	49.51

వ్యవసాయ రంగంపై కుట్ర

కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్రం పావులు

అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : దేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన వ్యవసాయమార్కెటింగ్ చట్టాన్ని తీసుకువచ్చిందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ఆరోపించారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెబుతూ మూడు నల్లచట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్లు రాతపూర్వకంగా ఇచ్చిన హామీని మరిచి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కొత్త వ్యవసాయ మార్కెటింగ్‌చట్టాలను తీసుకురావడం దుర్మార్గంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. ప్రస్తుతం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మద్దతు ధరలకోసం మార్చి 5నుంచి 10వతేదీ వరకు నిరవధిక ధర్నాలు, నిరాహారదీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మిర్చిక్వింటాకు రూ. 20వేలు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు చంద్రబాబు ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని కోరారు. ఏప్రిల్ 15నుంచి మూడు రోజుల పాటు అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలు తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి, వడ్డే హనుమారెడ్డి, ఉప్పుటూరి ప్రకాశరావు, కరవది సుబ్బారావు, శివారెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రావుల వెంకయ్య

పల్లె పండుగ పనుల బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం


బల్లికురవ మండలంలో మూడు నెలల కిందట వేసిన సీసీ రోడ్డు

పలు గ్రామాలలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, గోకులం షెడ్ల నిర్మాణం

నెలలు గడుస్తున్నా అందని డబ్బులు

కాంట్రాక్టర్లు లబోదిబో

బల్లికురవ మండలంలో సుమారు రూ.4 కోట్లతో పనులు

బల్లికురవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం గ్రామాలలో పల్లె పండగ పేరుతో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, రైతులకు గోకులం షెడ్లను నిర్మించింది. అధికారులు పనులు చేసిన వెంటనే వారం వారం బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో గ్రామాల్లో టీడీపీ నేతలు, కాంట్రాక్టర్లు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి శరవేగంగా పనులు చేపట్టారు. పనులు చేసి నెలలు అవుతున్నా నేటికీ బిల్లులు చెల్లించలేదు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. అధికారులు దగ్గరుండి నాణ్యతతో సిమెంట్ పనులు చేయించారని, వెంటనే బిల్లులు చెల్లించకపోతే నష్టమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి శుక్రవారం బిల్లుల జమ అవుతాయని చెప్పడంతో వారాలు మారుతున్నా బిల్లులు రావడం లేదని అంటున్నారు.

21 పంచాయతీల్లో పనులు

మండలంలోని 21 గ్రామ పంచాయతీకు ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు గాను 39 పనులకు సుమారు రూ.4కోట్ల నిధులను ఉపాధి కింద మంజూరు చేసింది. నవంబరులో వేసిన రోడ్లకు కూడా ఇంత వరకు బిల్లులు చెల్లించలేదు. పనులు చేసిన వారు తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయారు. తాము పనులు చేసిన వెంటనే క్వాలిటీ అధికారుల బృందం కూడా వచ్చి తనిఖీలు చేసిందని, అయినా బిల్లులు రాలేదని పనులు చేసిన వారు చెప్తున్నారు. మండలంలో పాడి రైతులకు 17 గోకులం షెడ్లు కూడా మంజూరు కాగా, కొందరు రైతులు పెట్టుబడులు పెట్టి పూర్తి శాతం పనులు చేశారు. వాటికీ ఇంత వరకు నగదు రాలేదు. ప్రభుత్వం వెంటనే చేసిన పనులకు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.


కొత్తపాలెంలో రైతులు నిర్మాణం చేసిన గోకులం షెడ్డు

ఉప్పు భూముల లీజులను రెన్యువల్ చేయాలి

చినగంజాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఉప్పు భూముల లీజును రెన్యువల్ చేసి వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ జిలాని, మండల ప్రముఖ్ కోలా సుబ్బారావు కోరారు. 2024 డిసెంబరు ఆఖరున రద్దు చేసిన ఉప్పు భూముల లీజును తిరిగి కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావుకు వారు వినతిపత్రం అందజేశారు. మండలంలోని రాజుబంగారుపాలెం, కుక్కలవారిపాలెం, కొత్తపాలెం, మున్నంవారిపాలెం, మూలగానివారిపాలెం, రామచంద్రానగర్ గ్రామాలకు చెందిన 800 కుటుంబాలకు చెందిన పేద రైతులు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న 497 ఎకరాలలో ఉప్పు పంటను సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని జిలాని తెలిపారు. ఉప్పు భూములను 20 సంవత్సరాల లీజు పద్ధతిలో గత వందేళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. కేంద్రప్రభుత్వం లీజు రద్దు చేయడం వలన చినగంజాం ప్రాంతంలో ఉండే వేల కుటుంబాలు వలసలు వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. ఉప్పు భూములను తిరిగి లీజు రెన్యువల్ చేయాలని కోరుతూ జిల్లా అధికారులకు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సాల్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులకు వినతిపత్రాలు పంపుతున్నట్లు జిలానీ, సుబ్బారావు తెలిపారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

మహిళ గర్భసంచిలో 3.5 కిలోలు కణితిని తొలగించిన వైద్యులు

మార్టూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు షేక్ రిజ్వానా అనే 50 ఏళ్ల మహిళకు అరుదైన ఆపరేషన్ చేశారు. సోమవారం ఈ మహిళ రిజ్వానా పూర్తిగా కోలుకుని ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లిపోయారు. ఈ మహిళ గర్భ సంచిలో ఉన్న 3.5 కిలోలు బరువు ఉన్న కణితిని జనరల్ సర్జన్ గారపాటి కిషోర్‌కుమార్ ఆపరేషన్ చేసి తొలగించారు. చిలకలూరిపేటకు చెందిన రిజ్వానా కొంతకాలం నుంచి జ్వరంతో, అధిక రక్తస్రావంతో బాధపడుతుండగా చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుంది. ఆపరేషన్‌కు రూ.లక్షకుపైగా వ్యయమవుతుందని డాక్టర్లు తెలిపారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న రిజ్వానా మళ్లీ చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. అక్కడ డాక్టర్లు ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆమె గత నెల నుంచి మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమె పరీక్షలు చేయించుకుంటూ ఈనెల 12న ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. 13న జనరల్ సర్జన్ గారపాటి కిషోర్‌కుమార్, ఫిజీషియన్ సాయిప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్, మత్తు డాక్టరు విష్ణుతేజ దాదాపుగా 3 గంటలు కష్టపడి ఆమెకు ఆపరేషన్ చేసి కణితిని తొలగించారు. ఇటీవల ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కొంత మంది దాతలిచ్చిన రక్తదానం నుంచి 4ప్యాకెట్ల రక్తాన్ని రిజ్వానాకు వైద్యులు దశల వారీగా అందించారు. దాంతో ఆమె పూర్తిగా కోలుకొని ఇంటికి వెళ్లారు. ఇంత పెద్ద ఆపరేషను ప్రభుత్వ ఆస్పత్రిలో చేయడం ఇదే తొలిసారి కావడంతో కుటుంబ సభ్యులు, రోగులు వైద్యులను అభినందించారు.


రిజ్వానాతో వైద్యులు కిషోర్‌కుమార్, విష్ణుతేజ, సాయిప్రసాద్

ఆధునిక వైద్య పరికరాల వినియోగంపై అవగాహన

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక వైద్య పరికరాలు, వాటిని వినియోగించే విధానం, సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి. జమున సూచించారు. సైరిక్స్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జీజీహెచ్‌లో నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. పరికరాల పనితీరును తెలుసుకుని వాటి నిర్వహణ చేయాలని నర్సింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సంస్థ డివిజన్ మేనేజరు హేమంత్ కుమార్, విభాగ ఇంజనీర్ సురేష్, జాషువ, టెక్నీషియన్ శరత్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రధాన గేటు మీదుగానే ఆర్‌వోబీ నిర్మాణం

టంగుటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులో ఆర్‌వోబీ నిర్మాణం ప్రస్తుతం ఉన్న రైల్వే ప్రధాన గేటుమీదుగానే చేపట్టనున్నారు. ఈమేరకు రైల్వే శాఖ ఇటీవల విడుదల చేసిన గజిట్‌లో పేర్కొంది. ఇదే విషయాన్ని అధికారులు ప్రారంభంలోనే ప్రకటించారు. అయితే అప్పట్లో వ్యాపార వర్గాలు అడ్డుకున్నాయి. దీంతో పాటిమీద గేటు వైపు ఆర్‌వోబీని మార్చాలని తీవ్రంగా ప్రయత్నించారు. ఆదిశగా స్థల పరిశీలన కూడా జరిగింది. ఏమైందో కాని చివరకు తొలుత అనుకున్నట్లే ప్రధాన రైల్వే గేటుమార్గాన్నే రైల్వే శాఖ ఖాయం చేసింది. దీంతో ఇదేమార్గంలో ఆర్‌వోబీ నిర్మాణం ఖాయమని అందరూ భావిస్తున్నారు.

ఇసుక అక్రమ దందాపై జనసేన ఫిర్యాదు

మద్దిపాడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):గత కొంతకాలం నుంచి మండల పరిధిలోని కొలచనకోట గ్రామ ఏటి పోరంబోకు సర్వే నెంబర్ 231లో జరుగుతున్న ఇసుక అక్రమ దందాపై సోమవారం జనసేన పార్టీ మంగళగిరి కార్యాలయంలో లీగల్ డెస్క్‌కు మద్దిపాడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు నున్నా బాలసుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు.

పీహెచ్‌సీని పరిశీలించిన మలేరియా అధికారి

మద్దిపాడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీని జిల్లా మలేరియా అధికారి మధుసూధన్ రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడుతూ నూతన సంవత్సరం నుంచి కొత్త చార్టులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ వినీల చౌదరి, డాక్టర్ శిరీష, సబ్ యూనిట్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేసిన జేసీ

చీమకుర్తి,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలో ఉన్న ప్రజాపంపిణీ సరుకులు నిల్వఉన్న మండల స్టాక్ పాయింట్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్చినెలకు అలాట్‌మెంట్, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఆయన వెంట పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మి,గోడౌన్ ఇన్‌చార్జి జయలక్ష్మి,తహసీల్దార్ బ్రహ్మయ్యలు పాల్గొన్నారు.

రేపు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

మార్టూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం గన్నవరంరోడ్‌లోని బొబ్బేపల్లి దండుదారి వద్ద గల దేవస్థానంలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహాత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటనలో తెలిపారు.

అవీఇవీ

ఘనంగా 'పది' విద్యార్థుల వీడ్కోలు సభ

సంతనూతలపాడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకపాడు జడ్పీహైస్కూల్లో సోమవారం పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. ఈసందర్భంగా హెచ్‌ఎం పి.స్వప్న రాజు మాట్లాడుతూ ఇష్టంతో చదివేటపుడు కష్టం కూడా ఆనందంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు చేరుకోవాలంటే ప్రణాళిక అనేది ముఖ్యమన్నారు. అనంతరం చిలకపాడు క్లస్టర్ స్థాయిలో గల పాఠశాలలైన వేములపాడు, మట్టిపాడు గ్రామాల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులైన ఎం.తిరుపతిరెడ్డి, కే.చంద్రమౌళిలు చిలకపాడు హైస్కూల్‌కు 20 కుర్చీలను బహూకరించగా వారిద్దరిని హెచ్‌ఎం స్వప్నరాజు ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.6.65 లక్షల మిగులు బడ్జెట్‌కు ఓకే

27అంశాలతో కూడిన అజెండాకు ఏకగ్రీవ ఆమోదం

చీమకుర్తి,ఫిబ్రవరి24 : చీమకుర్తి మున్సిపాలిటీలో 2025-26సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను సోమవారం చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. వివిధ మార్గాల్లో మున్సిపాల్టీకి సమకూరే ఆదాయం రూ.14,79,87,000గా అంచనా వేయగా వ్యయం రూ. 14,73,22,000గా అంచనా వేశారు. నికర మిగులుగా రూ.6.65 లక్షలుగా అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. తదుపరి జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టిన 27అంశాలతో కూడిన అజెండాకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రూ.22 లక్షలతో ప్రత్యేక పారిశుధ్య పనులు,రూ.13 లక్షలతో కార్యాలయానికి కాంపౌండ్‌వాల్ నిర్మించటానికి టెండర్లు ఖరారు చేశారు.ఈ సమావేశంలో కమిషనర్ వై.శివరామకృష్ణయ్య,కౌన్సిలర్లు,అధికారులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అసైన్డ్, సీలింగ్, అటవీ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తంచేస్తూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్న యర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక ఎంఎస్‌పీఎస్‌కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూశాఖ అధికారులు తప్పు చేశారనే కారణంతో తహసీల్దార్, సర్వేయర్, ఇతర ఉద్యోగులను సస్పెండ్ చేసి రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బందిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో విజయ్ కుమార్, జయరాజ్, సురేష్, శేఖర్, వంశీ, కోటి తదితరులు ఉన్నారు.

బిల్లుల పేరుతో భారీ దోపిడీ

(5వ పేజీ తరువాయి)

రూ.14లక్షల విలువ చేసే డంపర్ ప్లేజర్ గత ఐదేళ్లుగా మూలన పడి ఉంది. కాలువల్లో మురికి తొలగింపునకు మరింత సులువుగా ఉంటుందని రూ.25లక్షలకుపైగా జనరల్ ఫండ్ నిధులతో కొనుగోలు చేసిన మినీ ఎక్స్‌కవేటర్ ఏడాదికే మూలకు చేరింది. ప్రస్తుతం దాని మరమ్మతులకు అవసరమైన సామాన్లు అందుబాటులో లేవని గుట్టు చప్పుడు కాకుండా స్థానిక సంతపేటలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ కిందకు నెట్టేశారు. అదేవిధంగా చెత్త సేకరణ కోసం ఒక్కొక్కటి రూ.1.5లక్షలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసిన రెండు ఆటోలు మైనర్ రిపేర్లు రావడంతో నెలల తరబడి పక్కన పెట్టేశారు. చెత్తను తోసే ట్రాక్టర్ డోజర్‌దీ అదే పరిస్థితి. సుమారు రూ.3లక్షలకుపైగా ఖర్చుచేసి కొనుగోలు చేశారు. మొదట్లో కాస్తంత పనిచేసినా ఏడాదికే సేవలకు దూరమయ్యాయి.

ఇష్టారాజ్యంగా యంత్రాల కొనుగోలు

నగరంలో అక్రమ కట్టడాల తొలగింపు కోసం వేలకు వేలు అద్దెలు చెల్లించడం ఎందుకు మనమే కొనుగోలు చేస్తే ప్రజాధనం ఆదా అవుతుందని భావించిన అధికారులు రూ.24లక్షలతో ఎక్స్‌కవేటర్‌ని కొనుగోలు చేశారు. నగరంలో వీధుల్లో చెత్త పోసేందుకు డంపర్‌లు కొనుగోలు చేశారు. పాతవాటిని తొలగించి పలు ప్రాంతాల్లో కొత్తవాటిని ఏర్పాటు చేశారు. కానీ తొలగించిన వాటిని పాత సామానుకు గానీ, ఇతర వాటికి వినియోగించకుండా అలాగే నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇవన్నీ చూస్తుంటే పన్నుల రూపంలో ప్రజలు చెల్లిస్తున్న ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా, ప్రణాళిక లేకుండా అధికారులు ఖర్చు చేస్తున్నట్లు అర్థమవుతుంది. కనీస జవాబుదారీతనం లేకుండా వ్యవహరిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడమే నగరపాలక సంస్థ నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది.

విజిలెన్స్ విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి..!

కార్పొరేషన్‌లోని శానిటేషన్ విభాగంలో ఉపయోగించే వాహనాల కొనుగోలు, వాటిమరమ్మతులకు ఖర్చు చేసిన నిధులు, మూడేళ్లుగా పట్టించుకోకుండా మూలన పడిన వాహనాల పేరుతోనే డీజిల్ కొట్టించినట్లు బిల్లులు చేయడంతోపాటు, నిరుపయోగంగా ఉన్న 24 వాహనాలకు డ్రైవర్లుగా నియమించారు. వారికి నెలనెలా జీతాలు ఇస్తున్నారు. వారు ప్రస్తుతం ఏ విభాగంలో పనిచేస్తున్నారో నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉంది. అలాగే ఆ డ్రైవర్లకు నెలనెలా జీతాలు ఇవ్వడంపై విజిలెన్స్ విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

విచారించి చర్యలు తీసుకుంటాం:

డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఓఎంసీ కమిషనర్

శానిటరీ విభాగానికి సంబంధించి వినియోగించే పలు వాహనాల మరమ్మతులు, బిల్లులు విషయంలో చోటుచేసుకున్న అవకతవకలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇదేతరహా పనులకు సంబంధించి రూ.27 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో మాట్లాడి వాస్తవాలు గుర్తించాం. పనులు చేయకుండా బిల్లులు, డీజిల్ కొట్టించినట్లు ఉంటే తప్పకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాము.

గవర్నర్ ప్రసంగంలో 'వెలిగొండ'

(5వ పేజీ తరువాయి)

ఫోకస్ ఉంటుంది. అలాంటి గవర్నర్ ప్రసంగంలో జిల్లా ప్రజానీకం ప్రత్యేకించి పశ్చిమప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండకు స్థానం దక్కింది. తద్వారా వెలిగొండ పూర్తిపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్న విషయం స్పష్టమవుతోంది. ఈనెల 28న అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. అందులో వెలిగొండకు గతం కన్నా మెరుగ్గానే నిధుల కేటాయింపు ఉంటుందన్న సంకేతాలు ఆ ప్రాంత ప్రజాప్రతినిధులకు ఉంది. ఇప్పుడు గవర్నర్ ప్రసంగంలో కూడా ప్రాజెక్టు ప్రస్తావన రావడంతో నిధులపై ప్రజల్లో మరింత ఆశలు కలుగుతున్నాయి.

పారిశుధ్య పనులు పాతపద్ధతిలోనే...

(5వ పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే చెత్తపై పన్ను తొలగించి, ప్రజలకు ఉపశమనం కల్పించింది. నాటి వైసీపీ పాపాలు నేటికీ వెంటాడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయానికి గతంలో 60 చెత్త సేకరణ ఆటోలు పంపించగా, వాటిని నిర్వహణ బాధ్యతలు ఏజెన్సీ వారే చూడాల్సి ఉంది. అంతేకాకుండా ఆటోడ్రైవర్లకు వేతనాలు కూడా ఏజెన్సీ వారే చెల్లించాలి. కానీ వారు డ్రైవర్లకు వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందిపెట్టారు. ఆటోల కొనుగోలు కోసం ఓ ప్రముఖ ఫైనాన్స్ కంపెనీలో రుణం పొందిన ఏజెన్సీ నిర్వాహకులు గత ఆరు నెలలుగా వాయిదాలు చెల్లించడం లేదు. దీంతో సదరు ఫైనాన్స్ యాజమాన్యం నేరుగా రంగంలోకి దిగింది. తీసుకున్న రుణం కట్టలేదని, తమ కంపెనీ నిబంధనల ప్రకారం వాటిని స్వాధీనం చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆటోలను స్వాధీనం చేసుకోవచ్చుని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో సోమవారం నగరపాలక సంస్థలోని 50 చెత్త సేకరణ ఆటోలను ఫైనాన్స్ కంపెనీ స్వాధీనం చేసుకోవడంతో ఇక నుంచి పాత పద్ధతిలోనే పుష్‌కార్టుల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ చేయనున్నారు. అలాగే సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు గతంలో అమలుచేసిన విధానం ప్రకారం ట్రాక్టర్ల ద్వారా తరలించనున్నారు. అందుకు అనుగుణంగా కార్పొరేషన్ అధికారులు అవసరమైన ప్రణాళికను రూపొందించారు.

అలా ఎలా చేస్తారు?

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి చర్యలను డీఎల్‌సీవోపై తీసుకోలేదన్నారు. ఇరువురు అధికారులు ఈ నియామకం ద్వారా ప్రభుత్వాన్ని, సమాఖ్యను, రైతులను మోసగించారని ఆరోపించారు. వారిరువుపై చర్యలు తీసుకోవడంతోపాటు పొగాకు సమాఖ్య పీఐసీ నియామక ఉత్తర్వులు రద్దుచేసి మరొక అధికారిని నియమించాలని కోరారు. గతంలో ఇలాంటి సమయంలో పీఐసీ చైర్మన్లుగా నియమితులైన ఉన్నతాధికారుల జాబితాను కూడా కలెక్టర్‌కు నాగేశ్వరరావు అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకులు గొల్లపూడి బాబూరావు, కోటపాటి కాశీరావులు కూడా ఉన్నారు.

మణికేశ్వరంలో మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

అద్దంకి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఏర్పాట్లను సోమవారం రాత్రి సీఐ సుబ్బరాజు పరిశీలించారు. గుండ్లకమ్మ నదిలో స్నాన ఘాట్, క్యూలైన్, ఇతర ఏర్పాట్లు పరిశీలించి దేవాలయం అధికారులకు పలు సూచనలు చేశారు. అవసరమైన మేర బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్థులతో చర్చించారు. ఈవో వాసుబాబు, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, అంజయ్య, మేకల ఆదినారాయణ, బలరామిరెడ్డి, బడావలి, సుధాకరరెడ్డి పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

మహిమాన్విత క్షేత్రం నిర్మమహేశ్వరాలయం

పంచకోవెలగా, దక్షిణకాశీగా విశేష గుర్తింపు



● మతసహనానికి ప్రతీకగా రథోత్సవం

ఏటా శివరాత్రి మరుసటిరోజున జరిగే రథోత్సవానికి పలు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వస్తారు. కల్యాణ నిర్మమహేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పట్టణంలోని నాలుగు ప్రధానవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగిస్తారు. ఇక్కడ రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడటం విశేషం. హిందూవులతోపాటు ముస్లింలు, క్రైస్తవులు రథోత్సవంలో పాల్గొంటారు. ముఖ్యంగా రథం దర్శి రోడ్డులోకి వచ్చే సమయానికి పురుషులు తప్పుకొని రథాన్ని మహిళలకు అప్పగిస్తారు. మహిళలు రథాన్ని భక్తిశ్రద్ధలతో దేవాలయం వరకు లాక్కొని వెళ్లడం ఇక్కడి ఆనవాయితీ. ఆ సమయంలో పట్టణంలో చాలామంది భక్తులు ఉపవాస దీక్షను కొనసాగిస్తారు.

పొదిలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పృథులాపురి నిర్మమహేశ్వర ఆలయం మహిమాన్విత క్షేత్రంగా భాసిల్లుతోంది. దక్షిణ కాశీగా ప్రముఖ శైవక్షేత్రంగా ఈ ఆలయం పేరుగాంచింది. శివరాత్రి మహోత్సవాలకు ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. 18వ తేదీ నుంచి శివరాత్రి ఉత్సవాలు మొదలయ్యాయి. పట్టణంలోని నిర్మమహేశ్వస్వామి దేవాలయం పంచకోవెలగా మూడు ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇక్కడ ముక్కంటి వివిధ నామధేయాలతో భక్తుల పూజలు అందుకుంటున్నారు. శ్యామలాదేవి సమేత నగరేశ్వరునిగా, బాలత్రిపుర సుందరీ సమేత భీమేశ్వరునిగా, కామాక్షిసమేత కైలాసనాధుడు, పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరునిగా ఆలయంలో పూజలు అందుకుంటున్నారు. ఈ ప్రాంగణంలోని ప్రతి దేవాలయానికి ఎదురుగా ధ్వజస్తంభాలు ఏర్పాటు చేశారు. నవగ్రహ మండపంలో భక్తులు నవగ్రహదోష నిర్మూలనకు నిత్యం పూజలు చేయించడం ఇక్కడ ఆనవాయితీగా మారింది.

శతాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యం

దేశంలోని శివాలయాల అన్నింటిలో పొదిలి శివాలయానికి ప్రత్యేకత ఉంది. నాలుగు శివాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండడం ఇక్కడి విశిష్టత. ఈ ఆలయం 11వ శతాబ్దంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా స్పష్టం అవుతోంది. నిర్మమహేశ్వరస్వామి దేవాలయానికి దక్షిణం వైపున బాలత్రిపురి భీమేశ్వరాలయం ఉంది. బాలత్రిపుర సుందరీ దేవి రాత్రివేళల్లో నగర సంచారం చేస్తూ బలికోరుతుందని ఇక్కడి భక్తులు విశ్వసిస్తారు. ఆ బలిని నిలువరించేందుకు పుష్పగిరి పీఠాధిపతి ఉద్దండ నరసింహభూపతి వచ్చి అమ్మవారిని కట్టడి చేస్తుండగా ఆగ్రహించిన అమ్మవారు ఆయననే బలికావాలసినదిగా కోరింది. దీంతో భీమేశ్వరాలయం ఎదుట పుష్పగిరి పీఠిధిపతి ఉద్దండు నరసింహభూపతి అమ్మవారికి సజీవంగా తనప్రాణాన్ని అర్పించి సజీవసమాధి అయ్యారు. ఇప్పటికీ, దేవాలయం ఎదుటు పుష్పగిరి పీఠాధిపతి సమాధి దర్శనమిస్తోంది. దేవాలయాల్లో నాలుగు ధ్వజస్తంభాలను మహ్మదీయుడైన హవల్దార్ మహ్మద్‌బేగ్ ఏర్పాటు చేయించినట్లు స్థలపురాణం చెబుతోంది. నిర్మమహేశ్వరుడికి అత్యంత భక్తురాలైన నిమ్మవ్వకు ఈ ప్రాంగణంలోనే దేవాలయం ఉంది. దేవాలయానికి ఉత్తరం వైపున 35 సెంట్ల భూమిలో స్వామివారి కోనేరు ఉంది. స్వామివారి అభిషేక కార్యక్రమాలు ఈ కోనేరు నుంచి తీసుకొచ్చిన జలంతోనే నిర్వహించేవారు.



నిర్మమహేశ్వరస్వామి దేవాలయం

● దాతల సహకారంతో దేవాలయ అభివృద్ధి

అతిపురాతన నిర్మమహేశ్వరస్వామి దేవాలయాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నారు. వెంకటగిరిరాజులు నిర్మించి ఇచ్చిన రథం శిథిలావస్థకు చేరడంతో స్థానిక టింబర్‌డిపో అధినేత సామంతపూడి నాగేశ్వరరావు రూ.40 లక్షల వ్యయంతో అధునాతన రథాన్ని తయారు చేయించి దేవాలయానికి బహూకరించారు. విశ్రాంత ఇంజనీరింగ్ ఉద్యోగి మాకినేని రమణయ్య రూ.40 లక్షలకుపైగా ఖర్చుతో తూర్పు గాలిగోపుర నిర్మాణాన్ని పూర్తి చేయించారు. మాజీ శాసనసభ్యులు సానికొమ్ము పిచ్చిరెడ్డి దంపతులు నవగ్రహ మండపాన్ని నిర్మించారు. ఆర్యవైశ్య సంఘానికి చెందిన పమిడిమర్రి నారాయణ కుమారుడు దేవాలయం ఎదుట శివపార్వతుల భారీ విగ్రహాలను నెలకొల్పారు. కైలాసవనం పేరుతో పార్కుగా అభివృద్ధి చేసినప్పటికీ నిర్వహణలోపం కారణంగా ఇప్పుడు పార్కు దయనీయ స్థితిలో ఉంది. అదే ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణేశ్వరస్వామి పుట్ట మహిమాన్వితంగా భావిస్తూ ప్రతి ఆదివారం భక్తులు పెద్దఎత్తున పుట్టలో పాలుపోసి పూజలు చేస్తుంటారు.



మిట్టపాలెంలో గ్రామోత్సవం

సీఎస్‌పురం (పామూరు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థాన 67వ సప్తాహ్నిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం స్వామివార్లను అశ్వవాహనంపై అలంకరించి గ్రామోత్సం నిర్వహించారు. ఉదయం దేవస్థానంలో రుద్రహోవన, మృత్యుంజయ, ఆయుష్య హోమాలు, వేదపారాయణం, దీక్షా హోమాలు నిర్వహించారు. ఆలయ గోపురాలను విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. భక్తుల వినోదం కోసం రాత్రికి సత్యహరిశ్చంద్ర, వీరబ్రహ్మేంద్రస్వామి పూలసీను సిద్దయ్య, నాటకాల ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త చిన ఆదినారాయణ, ఈవో నరసింహబాబు తెలిపారు.

మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

అద్దంకి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం చినకాశీగా ఖ్యాతికెక్కింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రధాన శివాలయాలలో ఒకటిగా ఉన్న మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి 7 గంటలకు గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో వాసు తెలిపారు.



ఆలయం, పక్కన గుండ్లకమ్మ నది



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను అరెస్టు చేసిన పోలీసులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్టు

● 88 కేజీల రాగితీగ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగితీగ

దర్శి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను దర్శి సబ్‌డివిజన్ పోలీసులు సోమవారం అరెస్టుచేశారు. సోమవారం సాయంత్రం దర్శి పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ వివరాలు వెల్లడించారు. ముండ్లమూరు మండలం సింగన్నపాలెం గ్రామానికి చెందిన దేవరకొండ శేషారావు, సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన బి.వేణుగోపాల్, ఒంగోలు పట్టణానికి చెందిన దుర్గాప్రసాద్, తర్లుపాడు మండలం మీర్జాపేట గ్రామానికి చెందిన జి.ఆంజనేయులు, నాలి అల్లూరయ్య, పొదిలి పట్టణానికి చెందిన ఈశ్రీకాంత్‌లు ముఠాగా ఏర్పాడ్డారు. అనేక ప్రాంతాల్లో ఈ ముఠా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలకు పాల్పడ్డారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని ముండ్లమూరు, బల్లికురవ, అద్దంకి, తర్లుబాడు, తాళ్లూరు, దర్శి, కొనకనమిట్ల, పెద్దారవీడు, కొరిశపాడు మండలాల్లో 72 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అపహరించారు. ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి 588 కేజీల రాగితీగలను పాత ఇనుప దుకాణాల్లో విక్రయించారు. ఒంగోలుకు చెందిన పాత ఇనుప దుకాణం యజమాని బి.నాంచారయ్య ఈ రాగితీగను కొనుగోలు చేసి వారికి నగదు ఇస్తుండేవాడు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు దర్శి సీఐ వై.రామారావు పర్యవేక్షణలో దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు ఎస్ఐలు ఎం.మురళీ, వై.నాగరాజు, మల్లికార్జున ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి నిందితులను ముండ్లమూరు మండలంలోని సింగన్నపాలెం వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ వివరించారు. వారి వద్ద ఉన్న 88 కేజీల రాగితీగను, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ బంకుల్లో మాయాజాలం చేసి వినియోగదారులకు కుచ్చుటోపీ పెడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో శనివారం తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో మూడు బృందాలు 5 బంకులను తనిఖీలు చేశాయి. పెట్రోల్ పంపులలో ఎలక్ట్రానిక్ చిప్ అమర్చడం ద్వారా ఇంధన ప్రవాహనికి అంతరాయం కలిగించి 10 లీటర్లకు లీటరు ఇంధనాన్ని డీలర్లు ప్రయోజనం పొందుతున్నారని పెద్దఎత్తున్న ఆరోపణలు వచ్చాయి. దీంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు కొలతలు శాఖ అధికారులు కలిసి తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఐదు పెట్రోల్ బంకుల్లో తనిఖీ చేయగా మీటర్ రీడింగ్స్‌లో ఎలాంటి చేతివాటం లేదని గుర్తించారు. పెట్రోలు బంకుల్లో పనిచేసేవారి సమాచారం సక్రమంగా రికార్డు చేయలేదని, ధరల పట్టికలు పెట్టలేదని, పేలుడు పదార్థాలకు సంబంధించిన నియమాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయలేదని, మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేదని, పెట్రోల్ బంకుల పరిసరాల శుభ్రతలేదని గుర్తించారు. అయితే ఇలాంటి తనిఖీలు తరచూ చేయాలని, సామాన్యులకు ఇబ్బంది కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు.

ఘరానా మోసం

● రైస్‌పుల్లింగ్ పేరుతో బురిడీ ● రూ.3.28 లక్షలు దోపిడీ ● పోలీసులకు బాధితుల ఫిర్యాదు

బేస్తవారపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రైస్‌పుల్లింగ్ పేరుతో జరిగిన ఘరానామోసం బేస్తవారపేట పోలీసుస్టేషన్ పరిధిలో పందిళ్లపల్లి టోల్‌ప్లాజా వద్ద సోమవారం వెలుగుచూసింది. చిన్నపాటి రాగి వస్తువు ద్వారా రూ.కోట్లు సంపాదించవచ్చు అని మాయమాటల చెప్పి ఓ వ్యక్తి నుంచి రూ.3.28 లక్షల నగదును దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం మండలం వేములకోటకు చెందిన సాయికుమార్‌ను అదేగ్రామానికి చెందిన కిషోర్, రాజేష్ మార్కాపురానికి చెందిన మరోవ్యక్తి సంప్రదించారు. తమ వద్ద రైస్‌పుల్లింగ్ పాత్ర ఉందని, ఆ పాత్రను కొనుగోలు చేస్తే రూ.కోట్లు సంపాదించవచ్చునని ఆశ చూపి నమ్మించారు. అనంతరం బేస్తవారపేటకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తిని సాయికుమార్‌కు పరిచయం చేశారు. మార్కాపురంలోని కుంట ప్రదేశానికి తీసుకొచ్చి రైస్ పుల్లింగ్ రాగి వస్తువు వీడియోను మొబైల్‌లో చూపించారు. రూ.3 లక్షలు చెల్లిస్తే దీన్ని సొంతం చేసుకోవచ్చని చెప్పారు. వద్దనుకుంటే మార్కెట్‌లో విక్రయించినా, రూ.కోట్లకు విక్రయించవచ్చని సాయికుమార్‌కు వివరించారు. అనంతరం రామకృష్ణ కనిగిరికి చెందిన మరో రామకృష్ణను కూడా పరిచయం చేశాడు. రెండు వారాలపాటు వీరి మధ్య ఫోన్ సంభాషణలు జరిగాయి. కనిగిరి రామకృష్ణ సాయికుమార్‌కు ఫోన్ చేసి ఈ రైస్ పుల్లింగ్ పాత్ర కొనుగోలు చేస్తే లైఫ్‌లో సెటిల్ కావచ్చని నమ్మించాడు. దీంతో సాయికుమార్ తర్లుపాడులోని తన మామ మల్లికార్జునతో కలిసి రూ.2.80లక్షల డబ్బు తీసుకొని బేస్తవారపేటకు కారులో వచ్చారు. అప్పటికే హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులతో పాటు నరేంద్ర అనే మరో వ్యక్తితో కలిసి కనిగిరికి చెందిన రామకృష్ణ అక్కడ ఉన్నాడు. అందరూ టోల్‌ప్లాజా వద్ద కలుసుకొన్నారు. వీరిలో సాయికుమార్‌ను, నరేంద్రను టోల్‌ప్లాజా వద్ద ఉంచారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులతో పాటు, మల్లికార్జున, కనిగిరి రామకృష్ణ సమీపంలోని జగనన్న కాలనీ వద్దకు వెళ్లారు. నగదు తీసుకొని రైస్‌పుల్లింగ్ పరికరం ఇచ్చేందుకని చెప్పి అక్కడకు వచ్చారు. వారి వద్దకు గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు కారులో వచ్చారు. ఇక్కడ మీరేం చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా కొట్టి ఫోన్లు లాక్కొని కారులో ఉన్న రూ.2.80 లక్షల నగదు తీసుకున్నారు. వారిని బెదిరించి సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వారిని గ్రూపు ఫొటోలు తీశారు. తాము అటవీశాఖ అధికారులమని ఎవరికైన చెబితే జైలుకు పంపిస్తామని బెదిరించారు. ఇంకా నగదు కావాలని వారి ఫోన్‌పేలో ఉన్న రూ.48వేలను వారి అకౌంట్లకు బదిలీ చేయించుకున్నారు. ఆ నలుగురిని కొద్ది సేపు కారులో తిప్పి తిరిగి టోల్‌ప్లాజా వద్ద వదిలిపెట్టారు. అక్కడ నుంచి కనిగిరికి చెందిన రామకృష్ణ, హైదరాబాద్ నుంచి రాగి వస్తువుతో వచ్చిన వారు జారుకున్నారు. బాధితులైన సాయికుమార్, మల్లికార్జున బేస్తవారపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అటవీశాఖ అధికారులమని చెప్పి తమను బెదిరించి నగదు దోచుకున్నారని పోలీసులకు వివరించారు. ఫోన్‌పే స్క్రీన్‌షాట్‌ల ఆధారంగా ఓ అటవీశాఖ ఉద్యోగి ప్రమేయం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఘటనపై ఎస్సై రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేసిన సాయికుమార్, ఆయన మామ మల్లికార్జున

లబ్ధిదారులకు 'యూనిట్లు' త్వరితగతిన అందించాలి



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్న రుణాలకు లబ్ధిదారుల ఎంపిక, త్వరితగతిన యూనిట్ల గ్రౌండింగ్‌కు బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, వివిధ బ్యాంకుల అధికారులతో ప్రగతిభవన్‌లోని బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఆయన బ్యాంకు అధికారులతో మాట్లాడుతూ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నవారి అర్హతను పరిశీలించి వెంటనే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లులతో కలిసి లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలన్నారు.



విపత్కాలంలో.. వినూత్న ఆలోచనతో..

ఒంగోలుకు చెందిన నరేంద్ర ఒకప్పుడు తోపుడు బండిపై చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవించేవారు. ఒక ప్రమాదంలో కాలు దెబ్బతిని పనిచేయని పరిస్థితి ఏర్పడింది. ప్రతికూల పరిస్థితికి కుంగిపోకుండా వినూత్న ఆలోచనతో అనూకూలతగా మార్చుకున్నారు. తనకున్న ద్విచక్రవాహనానికి వెనుక చక్రం తొలగించి దాని స్థానంలో ప్రత్యేకంగా తయారు చేసిన ట్రాలీని అమర్చారు. అందులో రాగి జావ,తినుబండారాలు, మొలకైతిన విత్తనాలు పెట్టి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా నలూమూలల నుంచి సోమవారం కలెక్టరేట్‌లో స్పందన భవన్ వద్దకు వచ్చిన అర్జీదారులకు, అధికారులకు జావ అందిస్తూ బతుకు బండిని నడిపిస్తున్నారు.

అవీ..ఇవీ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకురాలు పి. కల్పన డిమాండ్‌చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కల్పన మాట్లాడుతూ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, వేతనాలను వెంటనే మంజూరు చేయాలన్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఒక్కొక్క విద్యార్థికి రూ. 20 మెనూ చార్జీలు పెంచిన తర్వాతనే కొత్తమెనూను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జి ల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సోమయాజులు, మీరాబి, భారతి, మాణిక్యమ్మ, వెంకటేశ్వరమ్మ, బంగారమ్మ, ఏసుదయమ్మ తదితరులు ఉన్నారు.



ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న జనతా మజ్దూర్ సెల్ నేతలు

విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు నడపాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 1వతేదీ నుంచి ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీపాతుల్లా బాషా కోరారు. సోమవారం ఆర్టీసీ డిపోలో ఆర్ఎం సుధాకర్‌బాబును కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో వేలాది మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారని, వారు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. ఉదయం ఏడు గంటల నుంచే బస్సులు నడిపే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి షేక్ సిద్దాంబి, శివ నాగరాజు తదితరులు ఉన్నారు.



తవనం, పమిడిల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

తవనం, పమిడిల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శులు తవనం చెంచయ్య, పమిడి కోటయ్యల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం తవనం చెంచయ్య, పమిడి కోటయ్యల వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభకు సీపీఎం జిల్లాకార్యదర్శి ఎస్‌కే మాబు అధ్యక్షత వహించగా సీపీఎం సీనియర్ నాయకుడు వై. సిద్దయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు అగ్ర నాయకుల్లో పమిడి, తవనంలు ముఖ్యులన్నారు. జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. కూలి పోరాటాలు, భూపోరాటాలు విస్తృతంగా నడిపిన మహనీయులన్నారు. వారి స్ఫూర్తితో ఇప్పటి వరకు కమ్యూనిస్టు ఉద్యమంలోనే కొనసాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పూనాటి ఆంజనేయులు, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, జి. రమేష్, పి. కల్పన, కే. రమాదేవి, బి. రఘురాం, జి. నరసయ్య, ఎస్. నరసింహారావు, సత్యం తదితరులు ఉన్నారు.



గూటెన్‌బర్గ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నెల్సన్ రాజు

ఘనంగా ప్రింటర్స్ డే వేడుకలు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ముద్రణా రంగం పితామహుడు జోహన్నస్ గుటెన్ బర్గ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా ప్రింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రింటర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఊరచెరువులోని గూటెన్ బర్గ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసి కార్యక్రమంలో ప్రింటర్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని పూల దండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కే. నెల్సన్ రాజు మాట్లాడుతూ ప్రింటింగ్ రంగాన్ని ఆవిష్కరించిన తొలి మహనీయుడు గూటెన్ బర్గ్ అన్నారు. అనంతరం ఇటీవల మరణించి అసోసియేషన్ కోశాధికారి హేమసుందరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యక్షుడు యామని కృష్ణ, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావుతోపాటు పలువురు ప్రింటర్లు, బైండర్స్, డీటీపీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్ అన్సారియా



మీకోసంలో అర్జీదారు సమస్యను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలనుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకొని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతి వారం సమీక్షిస్తామన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయినట్లు అయితే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అధికారులు రోజూ లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, రెవెన్యూ అధికారి ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, పార్థసారథి, జాన్సన్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

● అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆసంఘం నాయకులు వడ్డె హనుమారెడ్డి, సుధాకర్ నాయుడు, శ్రీనులు కలెక్టర్‌ను కోరారు.

● 108 ఎంప్లాయిస్ యూనియన్‌తో జరిగిన ఒప్పందం మినిట్స్‌ను అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దుర్గా మస్తాన్‌వలి, గాలిరెడ్డి, కే ఆదాంలు కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 63 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదులు పరిష్కార కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన 63 మంది తమ ఫిర్యాదులను అందజేసారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఫిర్యాదిదారులతో పోలీసు అధికారులు ముఖాముఖి మాట్లడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అధికంగా భూవివాదాల గురించి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సీఐలు అజయ్ కుమార్, పాండురంగారావు , హజరత్తయ్య లతో పాటు ఎస్సైలు రజియా సుల్తాన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీహర్షిణి విద్యార్థుల హవా

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు.బీఎస్‌సీ కంప్యూటర్స్ విభాగంలో ఎస్. ధర్మపావని 9.46 గ్రేడ్ పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచారు. ఆర్. వైష్ణవి 9.20 పాయింట్లతో రెండవ స్థానం, వై. హరిప్రియ 9.13 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచారు. బీసీఏ విభాగంలో కే మేఘన 9.22 పాయింట్లతో మొదటి స్థానంలో నిలువగా ఎస్‌కే సోఫియా 9.13 పాయింట్లు, కే గోవిందమ్మ 9.0 పాయింట్లతో తర్వాత స్థానాల్లో నిలిచారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో ఏ కార్తీక్ 8.82 గ్రేడ్ పాయింట్లు సాధించగా డి. భువనేశ్వరి 8.63, రత్నకుమారి 8.43 పాయింట్లతో తర్వాత స్థానంలో నిలిచారు. బీఎస్సీ ఆక్వా కల్చర్ విభాగంలో పి. నవీన్ కుమార్ 8.75 పాయింట్లతో మొదటి స్థానంలో నిలువగా డి. సరస్వతి 8.12 పాయింట్లు, భాగ్యరాజు 7.95 పాయింట్లతో తర్వాత స్థానంలో నిలువగా, బీఎస్సీ ఫిజిక్స్ విభాగంలో ఈ. హైమావతి 8.45 పాయింట్లతో మొదటి స్థానంలో నిలువగా, బీఎస్సీకెమిస్ట్రీ విభాగంలో ఎస్‌కే నాగిని 7.79 పాయింట్లతో ప్రథమ స్థానం, ప్రవళిక 7.54 పాయింట్లు, పి. వెంకట యశ్వంత్‌రెడ్డి 7.46 గ్రేడ్ల పాయింట్లతో తర్వాత స్థానంలో నిలిచారు. బీబీఏ విభాగంలో జి. రోహిణి 8.5 గ్రేడ్ పాయింట్లతో మొదటిస్థానంలో నిలువగా ఎం. లహరి 8.48, డి. సిద్దార్థ 8.18పాయింట్లతో తర్వాత స్థానాల్లో నిలిచారు. బీఎస్సీ జువాలజీ విభాగంలో ఎన్. రాయ 8.7 గ్రేడ్ పాయింట్లతో మొదటి స్థానంలో నిలువగా జి. జహ్నవి 7.76, బి. నాగలక్ష్మి 7.75 పాయింట్లతో తర్వాత స్థానాల్లో నిలిచారు. బీఎస్సీ బొటనీ విభాగంలో ఈ. జహ్నవి 7.76 గ్రేడ్ సాధించగా బి. నాగలక్ష్మి 7.75 గ్రేడ్, బి.వర్షిని 7.7 గ్రేడ్ పాయింట్లు సాధించగా, బీఏ విభాగంలో కే తేజశ్రీ 8.15 గ్రేడ్ పాయింట్లు సాధించగా, టి. మల్లికార్జున్ 7.65, ఎస్. వసంత్ కృష్ణ 7.57 గ్రేడ్ పాయింట్లు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవి కుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో యాంకర్ శ్రీనివాసరావు, గిరీష్, ప్రతాప్, శంకర్, ఇతర అధ్యాపకులు అభినందించారు.




ఎస్. ధర్మపావని, ఎం.పార్వతి, ఈ.హైమావతి, జి.రోహిణి, కె.తేజశ్రీ, కె.మేఘన, ఏ.కార్తీక్

జేఈఈ మెయిన్స్‌లో శ్రీసరస్వతి విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్(పేపర్-2) ఫలితాల్లో శ్రీసరస్వతి విద్యార్థి ఆల్ ఇండియా స్థాయిలో ఎస్సీ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారని ఆ విద్యా సంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. 99.94 టాప్ పర్సంటేజ్‌తో రెండు తెలుగు రాష్ట్రాల్లో గర్వకారణమైన ఫలితాలను మరోసారి శ్రీ సరస్వతి విద్యా సంస్థలు సాధించాయన్నారు. స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీ సరస్వతి జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆల్ ఇండియా స్థాయిలో తమ విద్యా సంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిలిచి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేశారన్నారు. కే లోక్‌క్రిటి 99.94 పర్సంటేజ్‌తో ఎస్సీ కేటగిరిలో ఆల్ ఇండియా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా ఎన్. ఇంద్ర 99.30, కె. గుణశేఖర్‌రెడ్డి 99.22 పర్సంటేజ్ సాధించారన్నారు. 90 పర్సంటేజ్‌కు పైగా 22 మంది, 85 పైగా 64 మంది, 80కి పైగా 112 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో శ్రీ సరస్వతి విద్యా సంస్థలకు గుర్తింపు తీసుకువచ్చేందుకు సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, ఈ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఇంకా మ ంచి ఫలితాలను సాధిస్తామన్నారు. ఈ సందర్భంగా మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్లు ఎ. గణేష్‌రెడ్డి, ఎ. గంగా శంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ సురేష్, డీన్‌లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఉన్నారు.

ఆలిండియా యూనివర్శిటీ టోర్నమెంట్‌కు క్విస్ విద్యార్థిని




విద్యార్థిని మధురికను అభినందిస్తున్న క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, వైస్‌చైర్మన్ గాయత్రి తదితరులు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి అంతర్ యూనివర్శిటీ టోర్నమెంట్‌కు ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఎంపికైంది. కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న మధురిక బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటి జేఎన్‌టీయూకే బాల్ బ్యాడ్మింటన్ జట్టులో స్థానం సాధించింది. తమిళనాడులోని అలగప్ప యూనివర్శిటీలో జరగనున్న జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆడనుంది. యూనివర్శిటీ జట్టుకు ఎంపికైన మాధురికను క్విస్ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ గాయత్రిలు అభినందించారు. ఆలిండియా యూనివర్శిటీ టోర్నమెంట్‌లో కూడా ప్రతిభ చాటి మంచిపేరు ప్రతిష్టలను సాధించాలని వారు అభిలషించారు.

నష్టపరిహారం ఇవ్వాలని బాధితుల ధర్నా

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): కొప్పోలు రోడ్డులోని ఇందిరా కాలనీ రోడ్డు మార్జిన్‌లో గృహాలు కోల్పోయిన వారు సోమవారం ఒంగోలు - కొత్తపట్నం నాలుగు వరుసల రోడ్డులో ఎఫ్‌సీఐ ఎదురు ధర్నా నిర్వహించారు. రోడ్డుకు సిమెంట్ దిమ్మెలను,రాళ్లను అడ్డం పెట్టారు. దీంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన వ్యాపార కేంద్రాలు, గృహాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. దీంతో ఒంగోలు తాలూకా పోలీస్‌లు వచ్చి ధర్నా చేస్తున్న వారితో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.



ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

ఆహార సలహా సంఘ సమావేశం నిర్వహించాలి

టంగుటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆహార సలహా సంఘ సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని వినియోగదారుల హక్కుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్రరావు కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోడ్ కారణంగా నిలిపివేసిన సమావేశాలను ఇప్పటి వరకూ ఏర్పాటు చేయకపోవడంతో వినియోగదారుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లలేకపోతున్నామన్నారు. కార్డుదారులకు రేషన్ సరుకులు అందకున్నా అడిగే దిక్కు లేకుండా పోయిందన్నారు. వినియోగదారులు అనేక ఇబ్బందులను తమ దృష్టికి తీసుకొస్తున్నా నిస్సహాయులుగా ఉన్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పోలేరమ్మ ఆలయంలో దుకాణాలకు వేలం

జరుగుమల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో వివిధ రకాల వ్యాపారాలకు సంబంధించి సోమవారం వేలం నిర్వహించారు. గత ఏడాది కన్నా 1,67,000 రూపాయలు అధికంగా ఆదాయం వచ్చింది. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకునే హక్కు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కుకు సంబంధించిన పాటలో ఎవ్వరూ పాల్గొనకపోవడంతో నిలిపివేశారు. గ్రూప్-2 కందుకూరు ఆలయాల కార్యనిర్వహణాధికారి వీవీఎల్ రవీంద్రనాథ్, ఈవో బైరాగి చౌదరి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆక్వా రైతులకు నాణ్యమైన సీడ్‌ను అందించాలి

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆక్వా రైతులకు నాణ్యమైన బ్లాక్ టైగర్ రొయ్యల సీడ్‌ను అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా రొయ్యల రైతుల సంఘం డిమాండ్ చేసింది.రొయ్య రైతుల సంఘ సమావేశం సోమవారం ఒంగోలులో జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపినాథ్ మాట్లాడుతూ జిల్లా మత్స్య శాఖ అధికారులు రొయ్యల హేచరీలు నాసిరకం సీడ్‌ను రైతులను సరఫరా చేయకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంతూరి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్ ఏర్పాటుపై కూటమి నాయకుల హర్షం

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అత్యంత సుందరంగా ఆర్టీసీ బస్టాండ్ నిర్మించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం కూటమి పార్టీ నాయకులు బస్టాండ్ వద్ద హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు కనగాల శ్రీను, పెంట్యాల కోటేశ్వరరావు, బెల్లం శ్రీను, సెల్వం శ్రీకాంత్ నల్లూరి భాస్కరరావు, మసిముక్కు భాస్కర్, మిండాల శ్రీను, కొండా శ్రీనివాసరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పురస్కరించుకొని ఒంగోలుకు చెందిన ఇందూ జ్ఞానవేదిక, ప్రబోధసేవా సమితి ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు, కండ్లగుంట గ్రామాలలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. శివరాత్రి విశిష్టత, భగవద్గీత అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేపట్టి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఎం.సుబ్బారావు, శ్రీనివాసరావు, కృష్ణ, స్రవంతి, కోమలి,నారాయణ తదితరులు పాల్గొన్నారు.



లే అవుట్‌లో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న కమిషనరు వెంకటేశ్వరరావు

ఐడీఎస్ఎంటీ స్థలాల వేలానికి చర్యలు వేగవంతం

● పనులు పరిశీలించిన ఓఎంసీ కమిషనరు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని ఐడీఎస్ఎంటీ స్థలాలలో మిగిలిన ప్లాట్‌లు వేలం వేసేందుకు అవసరమైన చర్యలను కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. గత కొన్నేళ్లుగా పిచ్చిమొక్కలు, ఆక్రమణలతో నిండిన ఆ స్థలాలను బాగు చేసే పనులు వేగంతం చేశారు. ప్లాట్‌లోని చెరువుల్లోని నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయడంతోపాటు, ప్లాట్‌లను చదును చేసి, వినియోగంలోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా నగర కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావు పనులు పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. అలాగే కొప్పోలు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ తదిరత ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలించారు. అలాగే ఆక్రమణల తొలగింపులో ఆర్అండ్‌బీ అధికారులు మార్కింగ్ చేయగా, రెవెన్యూ అధికారులు పట్టాల పరిశీలన చేశారు. ఈ సమయంలో స్థానికులు కొందరు ఆక్రమణల తొలగింపు పనులను అడ్డుకున్నారు. తమ నివాసాలు కూల్చొద్దని కొద్దిసేపు నిరసన తెలియజేయగా, అభివృద్ధిలో భాగంగానే ఆక్రమణలు తొలగిస్తున్నట్లు కమిషనరు వారికి వివరించారు. ఇదిలా ఉండగా రాజీవ్ నగర్‌లో పర్యటించిన కమిషనరు ఆ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లను పరిశీలించారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సెట్‌బ్యాక్‌లు వదలాలని, అలాగే ప్లాన్ ప్రకారం కట్టుకోవాలని సూచించారు.



స్కౌట్స్, గైడ్స్ యూనిట్ల ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థులు, శిక్షకులు

స్కౌట్స్, గైడ్స్ యూనిట్లు ప్రారంభం

జరుగుమల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లి జడ్పీహెచ్ఎస్ కేంద్ర ప్రభుత్వ పీఎంశ్రీ జడ్పీ స్కూల్‌గా మారడంతో 48 మంది విద్యార్థులతో సోమవారం స్కౌట్స్, గైడ్స్ యూనిట్లను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్కౌట్ మాస్టర్ నర్రా కోటేశ్వరరావు, గైడ్స్ మాస్టర్ ఎ.అనంతలక్ష్మీ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో నాగేంద్రవదన్ మాట్లాడుతూ స్కౌట్స్ గైడ్స్ శిక్షణ పొందిన వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అనూరాధ, ఎస్ఎంసీ చైర్మన్ కె.పూర్ణచంద్రరావు, జిల్లా గైడ్స్ కమిషనర్ హెప్సీబా పాల్గొన్నారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

ఉద్యోగ నియామక పత్రం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని పేర్నమిట్టలో హత్య గురైన చింతగుంట్ల జీవన్ భార్య జ్యోతికి కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రం, రిలీఫ్‌ను అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈమేరకు కలెక్టర్ అందించారు. ఐదేళ్ళ క్రితం జీవన్ హత్య జరిగింది. జీవన్‌భార్య జ్యోతికి రూ. 8.25 లక్షల రిలీఫ్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ డీఏతో కలిపిన ఎస్సీఎస్టీ మంత్లీ పెన్షన్‌ను అందజేయనున్నారు. రిలీఫ్‌తో పాటుజూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగపత్రాన్ని కలెక్టర్ అందజేశారు.

శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐ బాలికల కాలేజీలోని ఒంగోలు స్కిల్ హబ్‌సెంటర్‌లో మూడు నెలల పాటు కంప్యూటర్ కోర్సుకు ఉచిత శిక్షణ కోసం పేర్లు(రిజిస్ట్రేషన్) నమోదు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జే రవితేజ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. మూడు నెలల పాటు కంప్యూటర్ కోర్సుపై నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వచ్చేనెల 3వతేదీన శిక్షణ ప్రారంభం అవుతుందని, జిల్లాలోని నిరుద్యోగులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 7842004344 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.



మహిళా సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం గోపీనాథ్

గ్రూపుల ఆడిట్ కోసం సిద్ధంగా ఉండాలి

కొండపి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ఆడిట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెలుగు ఏపీఎం గోపీనాథ్ తెలిపారు. అందుకోసం బ్యాంకు స్టేట్‌మెంట్లు, గ్రూపు సభ్యుల పుస్తకాలు సిద్ధం చేయాలని ఆయన సీసీలు, వీవోఏలను ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో గోపీనాథ్ మాట్లాడారు. ఆడిట్ కోసం నాలుగు బృందాలను కేటాయించినట్లు చెప్పారు. సమావేశంలో మండల సమాఖ్య కార్యదర్శి బొద్దులూరి సుభాషిణి, కార్యవర్గ సభ్యురాలు శారద, సీసీలు మల్లికార్జున, కృష్ణారెడ్డి, రామాంజనేయులు, అకౌంటెంట్ కోటేశ్వరి, వీవోఏలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

మద్దిపాడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని వీఆర్‌ఏ సంఘం అధ్యక్షుడు వై. శ్రీరాములు అన్నారు. మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్‌ఏ సంఘ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుని శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా వై.రాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యు.సావిత్రి, కావూరి రాఘవులు, చెంచురావు, పూనూరి నరసయ్య, కోటయ్య, పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల అందజేత

సంతనూతలపాడు, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు సోమవారం స్థానిక జడ్పీహైస్కూల్‌కు 15 కుర్చీలను హెచ్ఎం ఎం.ప్రమోదకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్.సుబ్బారావు, బి.రామలింగయ్య, ఎమ్.మురళీ, నాగేశ్వరరావు, నరసింహారావు, సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

చెత్తట్రాక్టర్‌లో బ్యాటరీ చోరీ


బ్యాటరీ లేని ట్రాక్టర్

పొదిలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ చెత్త ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని దొంగలు దొంగిలించిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. రోజూ మాదిరిగానే పట్టణంలో చెత్త సేకరించిన అనంతరం పాత పంచాయతీ కార్యాలయం ముందు ఆదివారం ట్రాక్టర్‌ను నిలిపారు. సాయంత్రం కూడా ట్రాక్టర్‌ను చూసుకొని వెళ్ళినట్లు డ్రైవర్ తెలిపారు. అయితే తిరిగి సోమవారం ఉదయం చెత్తసేకరణకు వెళ్లేందుకు సిద్ధమై ట్రాక్టర్ వద్దకు వెళ్లి చూడగా, బ్యాటరీ లేదని డ్రైవర్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ దగ్ధం


దగ్ధమవుతున్న మోటారు సైకిల్

మార్కాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్‌కు మంటలంటుకుని పూర్తిగా దగ్ధమైన ఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తర్లుపాడు రోడ్డులోని అంజనేయస్వామి దేవస్థానం సమీపంలో మధ్యాహ్నం రహదారి పక్కన మోపెడ్‌ను నిలిపారు. అయితే ప్రమాదవశాత్తు ఆ వాహనానికి మంటలు అంటుకున్నాయి. దీంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే నీళ్లుపోసి మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే మోటార్ సైకిల్ పూర్తిగా దగ్ధమైంది.

తమ్ముడిపై అన్న దాడి

- కుటుంబ కలహాల నేపథ్యంలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యం మత్తులో తమ్ముడిపై అన్న ఇనుపరాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలోని గంగుపల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గంగుపల్లి గ్రామానికి చెందిన గొట్టం బాలగురవయ్య(లేట్) పిచ్చమ్మలకు (కవలలు) ఇద్దరు కుమారులు. వీరిలో అన్న గొట్టం రామాంజీకి వివాహం అయ్యింది. తమ్ముడు గొట్టం లక్ష్మనుడు మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అన్న రామాంజీ మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో తరచు కలహాలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున (పక్క పక్క నివాసం ఉంటున్నారు) తమ్ముడు నిద్రిస్తున్న సమయంలో ఇనుప రాడ్డుతో దాడికి దిగాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మనుడుని స్థానికులు దోర్నాల వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ప్రవేటు వైద్యశాలకు తరలించారు. తల్లి పిచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి చౌడయ్య తెలిపారు.

చోరీకి గురైన వాహనం లభ్యం


బైకును అప్పగిస్తున్న పోలీసులు


గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఉంచిన వాహనం చోరీకి గురికావడంతో వాహనదారుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో స్పందించిన అర్బన్ సీఐ కె.సురేష్ సిబ్బందితో పట్టణంలో వెతికించాడు. కొంగళవీడు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనాన్ని గుర్తించిన పోలీసులు దానిని సంబంధిత వాహనదారునికి అప్పగించారు. వాహనాన్ని గుర్తించడంలో నైపుణ్యం ప్రదర్శించిన కానిస్టేబుల్ రసూల్, హోంగార్డు ఖాజాలను సీఐ అభినందించారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పెద్ద దోర్నాల,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై వీ.మహేశ్ అన్నారు. స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో గుడ్‌టచ్- బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. పరీక్షల సమయం కాబట్టి శ్రద్ధగా చదివి ప్రథమశ్రేణిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి మృతి


చెంచుకుమారికి నివాళి అర్పిస్తున్న సీడీపీవో పద్మావతి

ఎర్రగొండపాలెం రూరల్/ పుల్లలచెరువు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన విశ్రాంత ఉద్యోగి టి. చెంచుకుమారి సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. పుల్లల చెరువు మండలం పిడికిటివానిపల్లి గ్రామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహిస్తుండగా, ఆమె భౌతికకాయాన్ని ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్లు పద్మజ, సుజాత, శివలక్ష్మీ అంగన్వాడీ కార్యకర్తలు సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే ఏపీయుడబ్ల్యూజే నాయకులు ఎస్‌కే.నూరుద్దీన్, ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ.రమణ, యూనియన్ సీనియర్ నాయకులు మూల అల్లురిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె బాష, మార్కాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు డి. మోహన్‌రెడ్డి, మాజీ ఎస్‌కె మహబుబ్ సుబాని, యూనియన్ జిల్లా కోశాధికారి డి.బాబి, కె శంకర్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. ఆమె కాకర్ల నరసింహారావును పరామర్శించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నే రవీంద్ర, టీడీపీ నాయకులు శనగా నారాయణరెడ్డి, రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా ఐ.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. శ్రీనివాసులు గుంటూరు నుండి బదిలీపై గిద్దలూరు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న వెంకటదాస్ బదిలీపై నంద్యాల మున్సిపల్ కార్యాలయానికి మేనేజర్‌గా వెళ్లారు.

శివరాత్రికి ఏర్పాట్లు

- పశ్చిమ ప్రకాశంలో ముస్తాబవుతున్న ఆలయాలు
- పటిష్ట బందోబస్తుకు చర్యలు చేపట్టిన పోలీసులు


త్రిపురాంతకంలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

త్రిపురాంతకం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో భక్తులకు క్యూలైన్ బారికేట్లు ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి ఆలయాల వరకు పంచాయితీ ఆధ్వర్యంలో వీధిదీపాలను అమర్చారు. ఆలయాల సమీపంలో మహిళలకు, పురుషులకు ప్రత్యేకమైన మరుగుదొడ్లు ఏర్పాటుచేసి, 70 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. రెండు ఆలయాలను విద్యుత్ దీపాలతో అంకరించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనాలకు పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేసి రోడ్డును సిద్ధం చేశారు. ప్రధాన సమస్య అయిన ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు రోడ్డుకు మధ్యలో ఇనుప కమ్మీలతో బారికేట్లు ఏర్పాటు చేశారు. భక్తులు సుమారు లక్ష మంది వరకు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని సామాజిక సత్రాలవారు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు, మెట్ల మార్గాలలో మంచినీటిని అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు స్వాగతం పలుకుతూ రోడ్ల వెంట స్వాగత ద్వారాలను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు - సీఐ అస్సాన్

పోలీసుశాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ అస్సాన్, ఎస్సై శివబసవరాజు తెలిపారు. 200 మంది వరకు సిబ్బందిని అందుబాటులోకి తీసుకున్నామన్నారు. కీలక ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, రెండు డ్రోన్ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. కొండపైకి వెళ్లేందుకు ఫిట్‌నెస్ బాగున్న పది ఆటోలను మాత్రమే అనుమతిస్తామన్నారు. భక్తులకోసం ఆర్‌టీవో ఆధ్వర్యంలో రెండు ఉచిత బస్సులను కొండపైకి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలువకు రెండు వైపులా బారికేట్లు నిర్మించినందున భారీ వాహనాలు, గడ్డి ట్రాక్టర్లు అనుమతించమన్నారు. వై.పాలెం వెళ్ళే బస్సులను విశ్వనాథపురం, లేళ్లపల్లి, మిట్టపాలెం మీదుగా దారి మళ్లిస్తామన్నారు. భక్తులు, ప్రజలు ఉత్సవాలను విజయవంతం చేసేందుకు పోలీసులకు, ఇతర అధికారులకు సహకరించాలన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో మార్కాపురం నుంచి శ్రీశైలం కాలినడకన వెళ్లే శివస్వాములు, శివ భక్తులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేసి నీటి ట్యాంకర్‌ను కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సేవాసంఘం అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి కరాటే మాస్టర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి, చందలూరి సత్య నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, సానికొమ్ము అశోక్‌రెడ్డిలు ఆర్థిక సాయం అందించారు.



ఇరుముడులు కట్టుకుంటున్న శివస్వాములు, రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఉపాహార శిబిరం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

శ్రీశైలం, రామతీర్థానికి బస్సులు

పొదిలి : మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం, రామతీర్థానికి 30 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డీఎం శంకరరావు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. శ్రీశైలం 20, రామతీర్థానికి 10 బస్సులు నడుపు తున్నట్లు చెప్పారు. కనుక భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివమాలలు ధరించిన శివస్వాములు శ్రీశైల మల్లన్న చెంతకు బయలుదేరారు. సోమవారం స్థానిక శివాలయంలో శివస్వాములు ఇరుముడులు కట్టుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, గురు స్వాముల అధ్వర్యంలో శ్రీశైలం స్వామివారి దర్శనానికి వెళ్లారు.

26న మహాశివరాత్రి వేడుకలు

కంభం : మండలంలోని పలుపులవీడులోని శ్రీ భైరవేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 26న బుధవారం మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు ఉంటాయన్నారు. కోలాట ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్పోర్ట్స్ కార్నివాల్, సాంస్కృతి ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిమూలపు సతీష్

మార్కాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఫార్మసీ కళాశాలలో సోమవారం స్పోర్ట్స్ కార్నివాల్, సాంస్కృతి ఉత్సవ్ వేడకలు నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఈ వేడుకలకు సంబంధిం చిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మార్చి 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎస్‌జీబీపీఎస్ స్పోర్ట్స్ కార్నివాల్-2కె25ను నిర్వహిస్తామన్నారు. డివిజన్ స్థాయిలోని ఫార్మసీ, ప్రొఫెషనల్, డిగ్రీ కళాశాల విద్యార్థులు క్రీడల పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. అదేవిధంగా మార్చి 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సాంస్కృతి ఉత్సవ్- 2025ను నిర్వహిం చనున్నట్లు తెలిపారు. సింగింగ్, ఆర్ట్, డ్యాన్స్, ఫన్‌గేమ్స్ నాటకాల ప్రదర్శన తదితర పోటీలుంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో అధ్యాపకులు డాక్టర్ రాజా జయరావు, డాక్టర్ సునీత, డాక్టర్ అశోక్, ముజీబ్ పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ ప్రభాకరరావు

ఎర్రగొండపాలెం రూరల్ : పదవతరగతిలో మంచిమార్కులు సాధించి ఉన్నత విద్యలో రాణించాలని ఎర్రగొండపాలెం సీఐ సీహెచ్ ప్రభాకరరావు అన్నారు. సోమవారం స్థానిక వినుకొండ రోడ్డులోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో విద్యాలయ ప్రత్యేకాధికారి తిరుమల దేవి అధ్వర్యంలో ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐతో పాటు ఎంఈవో పి.ఆంజనేయులు, ఎస్సై పి. చౌడయ్యలు పాల్గొని విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం రమాదేవి, జెడ్పీహెచ్ హెచ్‌ఎం పిచ్చరావు, డా.పెద్దిరాజు, లిల్లిప్రకాష్ వాణి, ప్రదీప్, రమేష్, విజ్ఞాన్ సంపత్ విద్యాలయ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దారుగా శైలేంద్రకుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ తహసీల్దారుగా శైలేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత తహసీల్దారు ఏ బాలకిషోర్ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయన్ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. దీంతో డీటీగా నలగాటి మల్లికార్జున నాయుడు ను ఇన్‌చార్జ్ తహసీల్దారుగా నియమించారు. పెద్దారవీడు తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆయన సోమవారం వై.పాలెంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఇన్‌చార్జ్ తహసీల్దారుగా ఉన్న మల్లికార్జుననాయుడు డీటీగా కొనసాగుతున్నారు.

విద్యార్థికి క్రమశిక్షణ అలంకారం


పదవ తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

కంభం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణ అలంకారమని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎంఈవో మాల్యాద్రి తెలిపారు. సోమవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థి జీవితంలో 10వ తరగతి అత్యంత కీలకమైనదని, వారి భవిష్యత్తును నిర్దేశించుకొనే మలుపు అని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంజిత్‌కుమార్, ఉర్దూ డీఐ మొయినుద్దీన్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

మార్కాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషిచేయాలని సీడీపీవో బి.సుశీల అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి (ఎఫ్ఎల్ఎన్) అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరురోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐదవ రోజు కార్యక్రమంలో సీడీపీవో సుశీల పాల్గొని వారి అభ్యసనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ జిల్లా సమన్వయకర్త ఎం.సుబ్బా రావు, డీఆర్పీలు ఎ.శేషయోగయ్య, పి.పిచ్చయ్య, సీహెచ్.శ్యామ్ వరప్రసాద్, కె.రవికుమారి, ఎమ్.బుజ్జి, పి.అరుణకుమారి, సీఆర్పీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ


వివరాలు సేకరిస్తున్న సూపరింటెండెంట్ శ్రీమన్నారాయణ

మార్కాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ న్యాయసేవా సంఘం ఆదేశాల మేరకు స్థానిక మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని 16, 17 వార్డుల్లో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన బదిరుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజలకు బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సూపరింటెండెంట్ శ్రీమన్నారాయణ, న్యాయసేవా సహాయకులు బాష, ఆది నారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం ప్రారంభం

పెద్దారవీడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):షిరిడీ సాయిబాబా అన్నదాన సేవాసమితి, చట్టమిట్ట వారి ఆధ్వర్యంలో కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిపై మూడు రోజులు అన్నదానం చేయనున్నట్లు నిర్వహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం వెళ్లే యాత్రికులు, శివస్వాములకు ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకూ అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


వెంకటరమణ (ఫైల్)

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన మండలంలోని బురుజుపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో చోటుచేసుకొంది. పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మారెళ్ల వెంకటరమణ(54) ఉదయం పాఠశాలలో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. దీంతో తోటి ఉపాధ్యాయులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. వెంకటరమణ రాచర్ల మండలం అనుమలపల్లెకు చెందిన వెంకటరమణకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మార్కాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి కోశాధికారి ఎమ్.రామస్వామి అన్నారు. స్థానిక ఎన్ఎస్ నగర్‌లోని చెరువు సప్తైఛానల్ సమీపంలో గుడ్ సామరటిన్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ ఫౌండర్ ఎనిబెర మోషే మాట్లాడుతూ నిత్యం ప్రజల దాహార్తిని తీర్చేందుకు 200 లీటర్ల కూలింగ్ మినరల్ నీటిని అందిస్తామ న్నారు. వేసవికాలం మొత్తం ఈ కార్యక్రమం కొనసాగు తుందన్నారు. కార్యక్రమంలో చర్చి ఉపాధ్యక్షుడు గుర్రం ఆర్థర్, 19వ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షితబాబీ, చర్చి సభ్యులు టీఎస్ జయపాల్, కె.జాన్ వినయ్‌కుమార్, బూదాల పాల్‌మనోహర్, దేవానందరావు, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దును ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకోవాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. స్థానిక పూల సుబ్బయ్య భవన్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమిషనర్ డీవీఎస్ నారాయణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు షేక్ కాశీం మాట్లాడుతూ, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

పొదిలిలో : రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకోవాలని నగరపంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఉత్తరాలు చేతబట్టి సోమవారం కార్యాలయం నుండి పోస్టాఫీస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆప్కాస్ రద్దు చేయకుండా పంచాయతీ కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఉత్తరాలను పోస్టుడబ్బాలో వేశారు.

ఆప్కాస్‌ను రద్దు చేయవద్దు

గిద్దలూరుటౌన్ : మున్సిపల్ పారిశుధ్య కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని ఆప్కాస్ రద్దు చేయవద్దని, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.నాగయ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి పోస్టు కార్డులను పంపించారు. గిద్దలూరు పెద్దపోస్టాఫీసు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు చంటయ్య, రవి, బాలయ్య, పాపయ్య, రంగయ్య, చెన్నమ్మ, సుబ్బమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యపై రైతులకు అవగాహన


కొండేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాయితీ సంక్షేమ పథకాలు నేరుగా రైతులఖాతాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలంటే ప్రతి రైతు ఫర్మార్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎర్రగొండపాలెం ఏవో కేవీ.శేషిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అమానిగుడిపాడు గ్రామంలో రైతులకు, ప్రజలకు 11 అంకెల విశిష్టత గురించి అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తారణాధికారి మల్యాద్రి రెడ్డి, టీడీపీ నాయకులు వెంగళ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది. పాల్గొన్నారు.

కొమరోలు : ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద మండలంలోని 6471మంది రైతులకు రూ. 1.29కోట్లు నిధులు విడుదలైనట్లు ఏవో రాజశ్రీ తెలిపారు. మండలంలోని నల్లగుంట్ల రైతు సేవా కేంద్రంలో రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని దేశ ప్రధాని ప్రారంభించే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. రైతులు విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలన్నారు.

కంభం : పీఎం కిసాన్ సమాన్‌నిధి కార్యక్రమంలో భాగంగా బీహార్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. 19వ విడత నిధులను విడుదల చేసే కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ 19వ విడతలో భాగంగా గిద్దలూరు సబ్‌డివిజన్ పరిధిలో 26277 మంది రైతులకు రూ.5.25 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో విజయభాస్కర్‌రెడ్డి, సాంకేతిక ఏవో షేక్ మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) :ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని తహసీల్దారు కిన్నెర శాంతి అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం,చిన్నగుడిపాడు కేంద్రాల్లో ఏవో జవహర్ లాల్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం రైతు విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రెవిన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్టసంఖ్య తప్పనిసరి

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి). భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా 11 అంకెల విశిష్ట గుర్తింపు నెంబర్ తీసుకోవాలని ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కొండేపల్లి, మాల్యవంతుని పాడు గ్రామాలలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో రైతుల నమోదు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏట మాట్లాడుతూ మండలంలో పిఎం కిసాన్ 19 విడత లో 8528 మంది రైతులకు రూ.1.7 కోట్లు రైతుల వ్యక్తిగత ఖాతాల్లోకి బదిలీ అయ్యాయన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది నాగవేణి, హైమావతి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ


అట్టలతో విద్యార్థులు

గిద్దలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుతున్న 60 మంది విద్యార్థినులకు యువప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ పరీక్ష అట్టలను, ఇతర పరీక్ష సామగ్రిని అందజేసింది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వేణుగోపాల్, సభ్యులు కుశాంత్ రెడ్డి, రత్నం, శ్రీనివాసులు, తదితరులతోపాటు హాస్టల్ వార్డెన్ జయమ్మ పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల

దర్శి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి పనులకు నిధులు విడుదలైనట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రూ.15 కోట్లతో అనేక రహదారుల మరమ్మతులు చేసినట్లు పేర్కొన్నారు. మరో రూ.5 కోట్లతో ప్రస్తుతం మరమ్మతులు చేస్తున్నట్లు ఆమె వివరించారు. దొనకొండ - కురిచేడు రోడ్డు అభివృద్ధి పనులకు రూ.25 కోట్లు, శివరాంపురం- తూర్పుగంగవరం, తాళ్ళూరు-గుంటిగంగ, తాళ్లూరు-కుంకుపాడు, ఈదర-వేముల, ఎన్‌పీ అగ్రహారం-బోధనంపాడు, రుద్రసముద్రం-పోలేపల్లి, దొనకొండ-రాయవరం వయా మల్లంపేట, చందలూరు-అబ్బాయిపాలెం రోడ్ల అభివృద్ధి పనులకు రూ.35 కోట్ల నిధులు విడుదల కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆమె తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి అంచనాల నివేదికలను పంపినట్లు ఆమె తెలిపారు. త్వరలో ఈ రోడ్లకు మహర్దశ పడుతుందని డాక్టర్ లక్ష్మి తెలిపారు.

ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన బ్రహ్మయ్య

పామూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పామూరు ఎంపీడీవోగా ఎల్.బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన టంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బి.సురేష్ సెలవుపై వెళ్లారు. ఈసందర్భంగా ఎంపీడీవో బ్రహ్మయ్యను టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్‌బాబు, మన్నం రమణయ్య, జి.శ్రీనివాసులు, జి.మహేష్, వై.రమేష్, షేక్ సందానిబాషా, పిడుగు శ్రీను, బండ్ల నారాయణ, ఎం.రామయ్య పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

పామూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణానికి చెందిన డయాలసిస్ బాధితురాలు పటాన్ షాహినాకు మానవతా సంస్థ దాతల సహకారంతో రూ.20 వేల నగదును సోమవారం అందజేసినట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఎం.ముసలయ్య, టి.రమేష్ తెలిపారు. సంస్థ తరుపున రూ.ఐదు వేలు, దాతల తరుపున రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ వి.వెంకటేశ్వరరెడ్డి, పి.తిరుపతిరెడ్డి, రంగారెడ్డి, కె.సుబాషిణి, కె.ప్రభాకర్, బాషా మొహిద్దీన్, జిలాని, అమీర్‌బాబు, పి.మాల్యాద్రి పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న శివాలయాలు

దొనకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి మండలంలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. స్థానిక ఆనంద ఆశ్రమంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఉదయం 5గంటల నుంచి ప్రత్యేక పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి తెలిపారు.

రేపు మిట్టపాలెంలో అన్నదానం

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం వద్ద నూతనంగా నిర్మించిన కాకతీయ కమ్మ అన్నదాన సత్రాన్ని మహాశివరాత్రి నాడు ప్రారంభోత్సవం చేయనున్నట్లు అన్నదాన సత్ర అధ్యక్ష కార్యదర్శులు చావా రాములు, పాములపాటి మాధవప్రసాద్ తెలిపారు. బుధవారం జరిగే మహాశివరాత్రి సందర్భంగా సుమారు పదివేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పామూరు ఈవోపీఆర్డీగా అరవింద

పామూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పామూరు ఈవోపీఆర్డీగా పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందను నియమిస్తూ జిల్లా పంచాయితీ అధికారి జి.వెంకటనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. డీపీవో ఉత్తర్వుల మేరకు అరవింద సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా అరవిందను ఎంపీడీవో బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అభినందించారు.

గుంటిగంగమ్మ హుండీ ఆదాయం రూ.5.81 లక్షలు

తాళ్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగాభవానీ ఆలయ హుండీని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.అనంత సత్యనారాయణ సమక్షంలో సోమవారం లెక్కించారు. 166 రోజులకు హుండీని లెక్కించారు. భక్తులు అమ్మవారికి రూ.5,81,569 కానుకలుగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈవో వాసు, పూజారి వాసుదేవశర్మ, ఆర్‌పి ప్రసాద్ పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 38 వేలు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి ఆదివారం హుండీ ఆదాయం లక్షా 37వేల 916 రూపాయలు వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.39,500, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.26,130, అన్నదానానికి రూ.31,670, ఇతర విరాళాల ద్వారా రూ.40,616 వచ్చినట్లు ఆయన తెలిపారు.

రైతులతోనే దేశ పురోగతి

» జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు, పాల్గొన్న శాస్త్రవేత్తలు

దర్శి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతితోనే దేశం పురోగతి సాధిస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ నిధులు విడుదల సందర్భంగా ఆదర్శ రైతులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే రైతన్నకు ప్రజలందరూ రుణపడి ఉన్నారన్నారు. ప్రస్తుతం ఎన్నో కష్టనష్టాలకోర్చి వ్యవసాయంలో నష్టాలు వస్తున్నప్పటికీ మొక్కవోని ధైర్యంతో పంటలు పండిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు అమలుచేస్తున్నట్టు చెప్పారు. సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు అందించటంతో పాటు పెట్టుబడి నిధి కింద నగదు కూడా అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం 19వ విడతగా విడుదల చేసిన పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో పడుతున్నాయన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక, సాంకేతిక పద్ధతులను అనుసరించి రైతులు లాభాల బాటలో ముందుకు సాగాలని కోరారు.

కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానాధికారి డాక్టర్ పి.సంధ్యారాణి, దర్శి ఏడీఏ బాలాజీనాయక్, శాస్త్రవేత్తలు టి.వెంకటేశ్వరరెడ్డి, మానస, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం

దొనకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అన్నీ మండలాల్లో రెండు మూడు సమీప గ్రామాలను కలిపి ఫార్మర్ ఐడీలపై క్యాంపులు ఏర్పాటుచేసినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండలంలోని ఆరవళ్లిపాడు రైతుసేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన క్యాంపును సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు పొలం ఉన్న ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్యను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్, రాష్ట్రప్రభుత్వం ఇవ్వబోయే అన్నదాత సుఖీభవ, రాయితీ విత్తనాలు, సున్నావడ్డీ పంట రుణాలు తదితర వాటికి ఇప్పుడు ఇచ్చే విశిష్ట సంఖ్య తప్పనిసరి అన్నారు. ప్రస్తుతం రైతుల పట్టా పొలాలకు మాత్రమే సర్వర్ అనుమతిస్తుందని చెప్పారు. అసైన్‌మెంట్, ఈనామ్, దేవదాయ భూములకు తర్వాత అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, సాంకేతిక వ్యవసాయాధికారి శ్రీనివాస నాయక్, మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు శివకోటేశ్వరరావు, తదితరు పాల్గొన్నారు.

తూర్పుగంగవరంలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాళ్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతులు తమ పంటలను అమ్ముకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. నాగంబొట్లపాలెం సహకారపరపతి సంఘం ఆధ్వర్యంలో తూర్పుగంగవరంలో ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం కందులకు మద్దతు ధర క్వింటా రూ.7550 ప్రకటించిందన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇంతకన్నా ఎక్కువ ధర వస్తే అమ్ముకోవచ్చునని చెప్పారు. ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే కందులు కొనుగోలు చేస్తారన్నారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల మేరకు కం దులు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో శ్రీనివాసనాయక్, సొసైటీ సీఈవో శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో ఆక్రమణల తొలగింపు


అర్బన్ కాలనీలోని ప్రభుత్వభూమిలో వేసిన వెంచర్ రాళ్ళను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కనిగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో ఆక్రమణల తొలగింపును అధికారులు చేపట్టారు. ఆగని అక్రమ వెంచర్లు శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ రవిశంకర్ స్పందించారు. ఈక్రమంలో రెండోరోజు సోమవారం ఆక్రమణల తొలగింపు కార్యక్రమం ముమ్మరం చేశారు. పట్టణ సమీపంలోని పామూరు రోడ్డులో సర్వే నెంబరు 288లో, సెయింట్ జోసఫ్ కాన్వెంట్ వెనుక వైపున శంఖవరం పరిధిలోని సర్వే నెంబరు 386లో అనుమతులు లేకుండా వేసిన వెంచర్లకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ రవిశంకర్ తెలిపారు.

అలాగే, కంభం రోడ్డులోని సర్వే నెంబరు 947లోని ప్రభుత్వభూమిలో వేసిన అక్రమ వెంచరులోని హద్దురాళ్ళను తొలగించి ప్రభుత్వభూమి అని బోర్డు ఏర్పాటుచేశారు.

సర్వే నెంబర్లు 288, 386లోని వెంచరు నిర్వాహకులు అపరాధ రుసుం చెల్లించకపోతే వెంచరులోని రాళ్లను తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు.

చిన్నారులకు ఆర్థికసాయం


చిన్నారులకు అందజేసిన ట్రైసైకిళ్లు

ముండ్లమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మ గుట్ట గ్రామానికి చెందిన రాఘవేంద్ర, ఎస్తేర్‌రాణి దంపతుల ముగ్గురు పిల్లలు కండరాల వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో మంచం పట్టి కదల్లేని స్థితిలో ఉన్నారు. దాదాపు రూ20 లక్షల మేర వైద్యం కోసం ఖర్చులు పెట్టినా కూడా ఎటువంటి మార్పులేదు. ఈక్రమంలో ఇటీవల ఆంధ్రజ్యోతిలో ఆచిన్నారులు విధి వంచితులు ప్రచురితమైన కథనానికి చారిటబుల్ ట్రస్ట్ స్పందించింది. ఒంగోలుకు చెందిన సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.50వేలు నగదును ఆ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు, ప్రవాస భారతీయుడు పోకల శ్రీనివాసులు సహకారంతో ఆర్థిక సాయాన్ని అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ సహనాజ్, సెక్రటరీ సర్దార్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ఇటీవల డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు చిన్నారులకు పరామర్శించారు. ముగ్గురికి చిన్నారులకు ట్రై సైకిళ్ళను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగానే ముగ్గురికి తన శాఖలోని సిబ్బంది ద్వారా ట్రై సైకిళ్ళు అందజేశారు.

నాటుసారా బట్టీలపై దాడులు

కనిగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాటుసారా కాసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.నరహరిరావు అన్నారు. నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలంలోని మైలుచర్ల గ్రామంలో నాటుసారా బటీటలపై సోమవారం ఆకస్మిక దాడులు చేశారు. మైలుచర్ల నుంచి నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ తెలిపారు.

ఈసందర్భంగా నరహరిరావు మాట్లాడుతూ నాటుసారా బట్టీలు కాసా వారేపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎవరైనా నాటుసారా బట్టీల వివరాల సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కనిగిరి ఎక్సైజ్ సీఐ విజయభాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

27న మెగా జాబ్‌మేళా

కనిగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో ఈనెల 27న మెగాజాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ముత్తూట్ ఫైనాన్స్, సింధూజా మైక్రో క్రెడిట్ లిమిటెడ్, పేటీఎం తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 19 నుంచి 30 సంవత్సరాల ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూల్లో పాల్గొని ఉపాధి అవకాశాలు పొందాలని కోరారు. వివరాలకు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ ఆర్.బెనర్జిబాబు సెల్ నెం.8008822821ను సంప్రదించాలని కోరారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

ముండ్లమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 9,545 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులకు రూ.1.91 కోట్లు విడుదలైనట్టు ఏవో ఎండీ ఫరూక్ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున వారి ఖాతాలో జమ చేసినట్టు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో వసతుల కొరత

» ఇబ్బందులు పడుతున్న మహిళలు



తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయం

తాళ్లూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో వసతుల కొరత వేధిస్తుంది. ప్రధానంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యాలయంలో మూత్రశాలలు లేవు. దీంతో పనుల నిమిత్తం వచ్చే మహిళలు, మహిళా ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి మాత్రమే దీనిని నిర్మించారు. సిబ్బందికి మాత్రం ఏర్పాటుచేయలేదు. దీంతో మహిళా ఉద్యోగులు వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మహిళా ఉద్యోగులు తక్కువగా ఉండేవారు. ప్రస్తుతం మండలంలో 14 సచివాలయాలు ఉన్నాయి ఐదు గ్రామసచివాలయాలకు మహిళా గ్రామ సర్వేయర్లను నియమించారు. ప్రస్తుతం మండల సర్వేయర్‌గా మహిళ విధుల్లో ఉన్నారు. వీఆర్వోలుగా ముగ్గురు మహిళలు ఉన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి పనుల నిమిత్తం నిత్యం పది మంది వరకు మహిళా ఉద్యోగులు వస్తుంటారు. సమావేశాలు, పనుల నిమిత్తంవచ్చిన మహిళా ఉద్యోగులు అత్యవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మహిళల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

ఎనిమిదేళ్ళ బాలికపై అత్యాచారయత్నం

» పోలీసుల అదుపులో నిందితుడు » పోక్సో కేసు నమోదు

కనిగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ళ బాలికపై యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. సదరు వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఖాజావలి తెలిపారు. అతడిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..

పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో ఓ బాలిక మూడో తరగతి చదువుతుంది. మరో బాలిక తండ్రి ఉమేష్(28) శనివారం రాత్రి మోటర్‌సైకిల్‌పై బాధితురాలిని తన ఇంటికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కేకలు పెట్టడంతో సమీపంలో వదిలిపెట్టి వెళ్లాడు. బాలిక కనిపించక పోవటంతో కుటుంబసభ్యులు వెతుకుతుండగా ఆప్రాంతంలో ఏడుస్తూ ఉంది. దీంతో బాలికను కుటుంబసభ్యులు ఇంటికి తీసుకెళ్లారు.

రెండు రోజులుగా కడుపు నొప్పి అని బాలిక చెప్పటంతో అనుమానం వచ్చి అడగగా, జరిగిన విషయాన్ని తల్లికి చెప్పింది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేశారు. బాలికపై అత్యాచారయత్నం జరిగినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకురాలు పి.కల్పన డిమాండ్‌చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కల్పన మాట్లాడుతూ పథంలో పనిచేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, వేతనాలను వెంటనే మంజూరు చేయాలన్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఒక్కొక్క విద్యార్థికి రూ. 20 మెనూ చార్జీలు పెంచిన తర్వాతనే కొత్తమెనూను అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సోమయాజులు, మీరాబి, భారతి, మాణిక్యమ్మ, వెంకటేశ్వరమ్మ, బంగారమ్మ, ఏసుదయమ్మ తదితరులు పాల్గొన్నారు.


మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, ఏపీఎం

‘మీకోసం’కు అధికారుల డుమ్మా

వీసీపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే మీకోసం కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు డుమ్మా కొడుతున్నారు. మీకోసం కార్యక్రమంలో అర్జీ ఇస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో మండల ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. అక్కడ తహసీల్దార్‌తోపాటు ఒకరిద్దరు అధికారులు తప్ప మిగిలిన శాఖల అధికారులెవరూ కనిపించడంలేదు. సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో తహసీల్దార్ ఉష, ఏపీఎం సత్యానందం మాత్రమే పాల్గొన్నారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలను తహసీల్దార్ తీసుకుని సంబంధిత గ్రామాల వీఆర్వోలకు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇతర సమస్యలతో వచ్చిన పలువురు ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు లేకపోవడంతో ఉసూరుమంటూ వెళ్లిపోయారు. ఇలా ప్రతి సోమవారం కూడా ఒకటిరెండు శాఖలకు సంబంధించిన అధికారులే వస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎన్ని పనులున్నా జిల్లాస్థాయిలో కలెక్టర్, ఇతర శాఖల అధికారులు తప్పనిసరిగా మీకోసం కార్యక్రమంలో పాల్గొంటున్నా మండలస్థాయిలో డుమ్మా కొట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లక్ష్యం పెట్టుకొని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని జీసీడీవో హేమలత అన్నారు. సోమవారం సీఎస్‌పురం మండల కేంద్రంలోని కేజీబీవీలో జరిగిన ఫేర్‌వెల్ వేడుకలకు ప్రిన్సిపాల్ షేక్ రేష్మ అధ్యక్షత వహించారు. హేమలత మాట్లాడుతూ బాలికల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తగినన్ని నిధులు వెచ్చించి అన్ని వసతులు సమకూరుస్తుందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత శాతం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్.కొండారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పామూరు: ప్రతివిద్యార్థి కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. సోమవారం పామూరులో జరిగిన ఎస్వీ జూనియర్, ఈటీఎస్ అండ్ ఎల్ డిగ్రీ కళాశాలల ఫేర్‌వెల్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రశాంతంగా పరీక్షలురాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కరుణకుమారి, విద్యాసంస్థల కరస్పాండెంట్ యేలూరి నరేన్, ప్రిన్సిపాల్ మీసాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

వీసీపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక ప్రకారం చదివితే అత్యున్నతమైన స్థాయికి చేరుకోవచ్చని మండల విద్యాశాఖాధికారులు సంజీవి, ఆర్. శ్రీనివాసులు అన్నారు. సోమవారం నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లా మల్లికార్జున్, ఎస్ఎంసీ చైర్మన్ మల్లికార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జెండా బావిలో క్లోరినేషన్

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం ప్రజల మంచి నీటి అవసరాలు తీరుస్తున్న జెండాబావి అపరిశుభ్రంగా ఉంది. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి భైరవకోన వెళుతూ జెండాబావిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే జెండా బావిని పరిశుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. దీంతో గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు యుద్ధప్రాతిపదికన జెండా బావి ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. బావిలోని నీటిని క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. త్వరలో బావిపై ఇనుప జల్లెడ వేసి వ్యర్థాలు పడవేయకుండా రక్షణ చర్యలు తీసుకొంటామని ఈవో బ్రహ్మానందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.మోహన్‌రావు, టీడీపీ నాయకులు బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రి పాల్గొన్నారు.

నారపురెడ్డి మృతి టీడీపీకి తీరనిలోటు

తాళ్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత మంచాల నారపురెడ్డి మృతి తీరనిలోటని ఆపార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ అన్నారు. సోమవారం దారంవారిపాలెం గ్రామంలో వృద్ధాప్యంతో నారపురెడ్డి(89) మృతి చెందాడు. మృతదేహాన్ని లలిత్‌సాగర్ సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, గొల్లపూడి వేణుబాబు, సర్పంచ్ మంచాల వెంకటేశ్వరరెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, శాగం కొండారెడ్డి, వి.సుబ్బయ్య, దారం సుధాకర్‌రెడ్డి పేరిరెడ్డి, మంచాల గిరి, పాలం రత్నారెడ్డి, నుసుం ఆదినారాయణరెడ్డి, మంచాల వెంకటేశ్వరరెడ్డి. ఐవీ రమణారెడ్డి, తదితరులు ఉన్నారు. అలాగే, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ మంచాల వలసారెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ దారం వెంకటరమణారెడ్డి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

దొనకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆధార్ గుర్తింపు తప్పనిసరి అయింది. గతంలో పొందిన కొందరి కార్డుల్లో వచ్చిన తప్పులను సవరించుకునేందుకు, కొత్తగా ఆధార్ కార్డులు పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సచివాలయాల ద్వారా ఆధార్ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అవసరమైన సామగ్రిని మంజూరుచేసి సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లకు ఆధార్ బాధ్యతలను అప్పగించారు.

ఈనేపథ్యంలో మండలంలోని దొనకొండ-1, పెద్దన్నపాలెం గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఆధార్ సేవలను ప్రజలకు అందిస్తున్నారు. ప్రతి పదేళ్ళకు ఒకసారి ఆధార్‌కార్డును తప్పనిసరిగా సరిచేసుకోవాల్సిన అవసరం ఉంది. వృద్ధుల్లో చాలామందికి వేలిముద్రలు అరిగిపోవటం జరుగుతుండటంతో అటువంటి వారికి ఐరీష్ ఉపయోగపడు తుంది. ఆధార్‌కార్డుల్లో పేరు, ఫొటో, ఫోన్ నెంబర్, చిరునామాలు మార్పులు చేసుకోవచ్చు. ఇతర ప్రాంతాల నుండి వచ్చి స్థిరపడిన వారికి ఇది సరైన అవకాశం. అవసరమైన ధ్రువపత్రాలు అందజేసి మార్పులు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. పెద్దన్నపాలెం సచివాలయంలో గ్రామ కార్యదర్శి ఎల్లబాబు పర్యవేక్షణలో ఆధార్ సేవలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దొనకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని బాదాపురం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని రామిరెడ్డిపల్లికి చెందిన అన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి ద్విచక్ర వాహనంపై దొనకొండ వచ్చి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈక్రమంలో బాదాపురం గ్రామ సమీపంలో అకస్మాత్తుగా రోడ్డుపైకి అడవిపంది రావడంతో, దానిని ఢీకొట్టి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. సంఘటనాస్థలానికి 108 సిబ్బంది చేరుకొని క్షతగాత్రుడిని వినుకొండ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

40 మందికి వైద్య పరీక్షలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, నూజెండ్లపల్లి గ్రామాల్లో ఇటీవల చికెన్ గున్యా, జ్వరాలతో గ్రామస్థులు బాధ పడుతుండటంతో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 40 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

త్రికోటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం

నరసరావుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా 26న తిరునాళ్ల వైభవంగా జరగనుంది. తిరునాళ్లకు రాష్ట్ర పండగ హోదా ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో త్రికోటేశ్వరస్వామికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామి వారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టువస్త్రాలతోపాటు వెండి ప్రభ కూడా సమర్పిస్తారు. ఇందుకు ప్రభుత్వం రూ.20 వేలు దేవస్థానానికి విడుదల చేసింది.

ఉసురు తీసిన వరల బావి



మృతులు మహంకాళి (29), రాజేష్(20), కాళీ బాబు(52), బాలయ్య(45)

బతుకుదెరువు కోసం నంబూరు కాళీ బాబా ఆశ్రమ సమీపంలోని గోశాలలో కూలి పనులకు చేరారు. వరల బావిని శుభ్రం చేసేందుకు సోమవారం అందులోకి ఇనుపనిచ్చిన వేసుకుని దిగారు. కంప్రెషర్‌కు ఉన్న వైర్లు తెగి విద్యుత్ సరఫరా జరిగి తొలుత గండాల మహంకాళి (29), అనంతరం యాకుల రాజేష్(20), వేటగిరి బాలయ్య(45), మండాది కాళిబాబు (52) విద్యుదాఘాతానికి గురై నిమిషాల్లోనే దుర్మరణం చెందారు. ఒకరిని కాపాడే యత్నంలో మరొకరు, ఇలా వరుసగా నలుగురు మృత్యువాత పడ్డారు. సంఘటనపై మంత్రి గొట్టిపాటి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

- విద్యుదాఘాతంతో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం
- గోశాలలో బావిని శుభ్రం చేస్తుండగా ప్రమాదం



ప్రమాదానికి కారణమైన వరల బావి

పెదకాకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రెక్కాడితేగానీ.. డొక్కాడని బడుగు జీవులు ఆ కూలీలు. బతకడం కోసం ఉన్న ఊరిని వదులుకొని వచ్చారు. ఏడాదిగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. పెదకాకాని సమీపంలోని నంబూరు కాళీ బాబా ఆశ్రమ సమీపంలో గోశాలలో ఈ సంఘటన జరిగింది. తెనాలి సమీపంలోని చినరావూరుకు చెందిన గండాల మహంకాళి(29), వేటగిరి బాలయ్య(45), దుగ్గిరాల మండలం పెనుముడి గ్రామానికి చెందిన యాకుల రాజేష్ (20) అనే ముగ్గురు ఏడాదిగా గోశాలలో కూలీలుగా పనిచేస్తున్నారు. గోశాలలో సేవ చేసేందుకు సత్తెనపల్లి సమీపంలోని కట్టమూరు గ్రామానికి చెందిన మండాది కాళిబాబు(52) గోశాల వద్దకు వచ్చాడు. వర్లబావిలోకి దిగి శుభ్రం చేసే క్రమంలో లోపల ఉన్న వేస్ట్ వాటర్ బయటికి పంపేందుకు విద్యుత్ కంప్రెషర్‌తో ప్రయత్నించారు. కంప్రెషర్‌కు ఉన్న వైర్లు తెగి విద్యుత్ సరఫరా అయింది. బావిలోకి ఇనుపనిచ్చిన వేసుకొని దిగడంతో తొలుత గండాల మహంకాళి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. గమనించిన యాకుల రాజేష్ అతన్ని కాపాడేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. వీరిని కాపాడే యత్నంలో వేటగిరి బాలయ్య, మండాది కాళిబాబు విద్యుదాఘాతానికి గురై నిమిషాల్లోనే దుర్మరణం చెందారు. మండాది కాళిబాబు(52) గోవులకు సేవ చేసేందుకు వచ్చి మృత్యువాత పడ్డాడు. ఆవులకు సేవ చేస్తే పుణ్యం దక్కుతుందని వచ్చి మృతి చెందాడు.

విషాద ఛాయలు...

నలుగురు మృతి చెందటంతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, పెదకాకాని సీఐ నారాయణస్వామి పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మార్చురికీ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్

ప్రభుత్వం అండగా ఉంటుంది

విద్యుదాఘాతం ఘటనపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన నలుగురు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఘటనపై స్థానిక శాసన సభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రతోపాటు స్థానిక అధికారులతో కూడా మంత్రి మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

నిఘా నీడలో.. ఇంటర్ పరీక్షలు

- ప్రతి గదిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ
- ప్రతి ప్రశ్నా పత్రానికి క్యూఆర్ కోడ్
- సీసీ కెమెరాల నిఘాలోనే ప్రశ్నాపత్రాలు సీల్ తీయాలి
- జవాబు పత్రాల బండిల్స్ ప్యాకింగ్ కెమెరాల నిఘాలోనే..
- వాట్సప్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడుకు ఆస్కారం

ఒక్కో పరీక్షా కేంద్రంలో గేటు బయట.. ప్రతి గదిలో సగటు రెండుకు పైగా సీసీ కెమెరాలు. వాటి ద్వారా అనుక్షణం జిల్లా కేంద్రంలో, రాష్ట్ర కార్యాలయంలో పర్యవేక్షణ చేసే యంత్రాంగం. ప్రతి ప్రశ్నా పత్రానికి బార్ కోడింగ్.. క్యూఆర్ కోడ్ స్కానర్.. పొరపాటున ప్రశ్నా పత్రం బయటకు వెళితే ఏ జిల్లాలో.. ఏ ఊరిలో.. ఏ కేంద్రంలో ప్రశ్నా పత్రం బయటకు వచ్చిందని తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం.. పటిష్టమైన కస్టోడియన్ కేంద్రాలు.. అక్కడ నుంచి ప్రశ్నా పత్రాలు తరలించేందుకు ప్రత్యేక రూట్ మ్యాప్‌లు... నిత్యం పరీక్షల్ని పర్యవేక్షించేందుకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్. ఇలా కట్టుదిట్టమైన భద్రత నడుమ ఇంటర్ పరీక్షలు ఈ ఏడాది నిర్వహించనున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా అనేక నూతన సంస్కరణలు ఇంటర్ పరీక్షల కోసం ప్రవేశపెట్టారు.

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చి 1 నుంచి ప్రారంభం అయ్యే పరీక్షల్ని ప్రశాంత వాతావరణంలో, కట్టదిట్టు మైన భద్రత నడుమ నిర్వహించేలా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జిల్లాకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా ఎస్‌వీ సుబ్బారావు, పరీక్షల ప్రత్యేక అధికారిగా డీవీఈవో పద్మను ప్రభుత్వం నియమించి పరీక్ష నిర్వహణపై ప్రణాళికలు సిద్ధం చేశారు. పరీక్షల నిర్వహణలో కీలక భూమిక పోషించే చీఫ్ సూపరింటెండెంట్స్(సీఎస్‌లు), డిపార్టుమెంట్ ఆఫీసర్ల(డీవో)లతో సమీక్ష నిర్వహించిపరీక్ష కోసం విస్తృత ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 34,273 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 34,973 మంది, ఇంటర్ మొదటి సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల పరీక్షలకు 1215 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 867 మంది చొప్పున మొత్తం 71,528 మంది విద్యా ర్థిని విద్యార్థులు పరీక్ష హాజరుకానున్నట్లు తెలిపారు. మొత్తం 81 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. గేటు బయట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా విద్యార్థులు, ఇతర పర్యవేక్షణ సిబ్బంది రాకపోకల్ని గమనిస్తారు. గదుల్లో ఏర్పాటు చేసిన కెమెరాల కిందనే ప్రశ్నా పత్రాల సీల్ తీయడం, జవాబు (మిగతా 6వ పేజీలో)

నకిలీ విత్తనాల అడ్డా.. ఆటోనగర్



గుంటూరు నుంచి బంగ్లాదేశ్‌కు లారీలో జూట్ విత్తనాలు

- లైసెన్స్ లేకున్నా ప్రాసెసింగ్ ప్రక్రియ
- జూట్ విత్తనాలు బంగ్లాదేశ్ కు తరలింపు
- నకిలీ పత్తి, మిరప విత్తనాలకు ఇక్కడ హంగులు
- బీజీ-2 మాదిరిగానే బీజీ-3 అమ్మకం
- కళ్లు తెరవకుంటే ఖరీఫ్ గుల్లే

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆటోనగర్ నకిలీ విత్తనాల హబ్‌గా మారింది. ఇక్కడ కొన్ని కంపెనీ లు లైసెన్సుతో విత్తనాల ప్రాసెసింగ్ చేస్తు న్నాయి. సందట్లో సడేమియా అన్నట్లుగా మరికొన్ని కంపెనీలు అసలు అనుమతి లేకుండానే భారీ విత్తన వ్యాపారం గుట్టుగా సాగిస్తున్నాయి. ఎక్కడో ఫెయిల్ అయిన విత్తనాలు ఇక్కడకు తీసుకువచ్చి ప్రాసెసింగ్ పేరుతో వినియోగంలోకి తెచ్చే ప్రక్రియ గత కొన్ని సంవత్సరాలుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇక్కడ ప్రాసెసింగ్ చేసిన జూట్ విత్తనాలను బంగ్లాదేశ్, నేపాల్ తదితర ప్రాం తాలకు ఎక్కువ మొత్తంలో పంపటం అనేది చాలా గోప్యంగా జరుగుతుంది. వస్తున్నా యో.. పోతున్నాయో.. తెలియదు కానీ గుం టూరులోని పార్శిల్ కార్యాలయాలు మాత్రం వ్యవసాయ సంబంధిత బస్తాలు, అట్ట పెట్టలతో కిక్కిరిసి పోతుంటాయి.

మొదలైన ఖరీఫ్ హడావుడి..

రబీ సాగు చివరకు వచ్చింది. ఒక్క పంటకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చే రైతులు ఖరీఫ్ కోసం ఎదురు చూస్తుంటారు. అందుకు సం బంధించిన విత్తనాల హడావుడి మాత్రం ఫిబ్రవరి నుంచి ఆరంభం అవుతుంది. కంపె నీలు కూడా ఈ మార్చికి నిల్వలను అన్ని ప్రాంతాలకు చేరవేస్తాయి. అందులో భాగంగా విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లు తీరిక లేకుండా పనిచేస్తున్నాయి. గుంటూరు ఆటోనగర్‌లో కొన్ని లైసెన్సు కంపెనీలు వివిధ రకాల విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తున్నాయి. లైసెన్సు ఉన్న వారి వద్ద చిన్నా, చితక వ్యాపారులు కూడా కొన్ని రకాల విత్తనాలను ప్రాసెసింగ్ చేయిస్తున్నారు. వాటిని రైతులకు విక్రయించేందుకు సిద్ధ పరుస్తున్నారు.

అనుమతి కొందరికే...

ప్రస్తుతం జూట్ ఎగుమతి జోరుగా సాగు తోంది. ఇక్కడ వాస్తవానికి అనుమతి పొందిన వ్యాపారులు కొద్ది మంది మాత్రమే ఉన్నారు. కానీ సుమారు 100 మంది జూట్ ను ఇతర దేశాలు, రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. లైసెన్సు లేకుండా ప్రాసెసింగ్ చేయించి బంగ్లాదేశ్, నేపాల్, గుజరాత్, మహారాష్ట్ర తదితర ప్రాంతా లకు సరఫరా చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో గుంటూరు నుంచి ఆయా ప్రాంతాలకు లెక్కకు మించిన సంఖ్యలో జూట్ ఎగుమతి చేస్తున్నారు. ఎర్రజూట్,నల్ల జూట్ విత్తనాలును వేర్వేరుగా పంపటం జరుగుతుంది. రైతు వద్ద నుంచి అతితక్కువ ధరకు కొనుగోలు చేసి, ప్రాసెసింగ్ పేరుతో అతి ఎక్కువకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆటోనగర్ నుంచి రోజుకు 10 లారీ లకు తగ్గకుండా జూట్ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది. ఇక్కడే మినుముల (మిగతా 6వ పేజీలో)

పీడీఎఫ్ హ్యాట్రిక్ కొట్టేనా..?

- 2013, 2019లో వరుసగా గెలుపు
- పట్టు కోసం కూటమి వ్యూహాలు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి 18 ఏళ్లు అయింది. శాసనమండలి పునరుద్ధరణ తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో గెలుపొందిన టీడీపీ ఆ తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ పార్టీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. దీంతో గత రెండు పర్యాయాల నుంచి ఈ నియోజకవర్గంలో గెలుపు టీడీపీకి నిరాశనే మిగిల్చింది. దీంతో ఈ దఫా ఎలాగైనా గెలుపొందాలన్న పట్టుదలని ఆ పార్టీ నాయకత్వం, క్యాడర్, బీజేపీ, జనసేనలు ప్రదర్శిస్తున్నాయి. మరోవైపు వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టేందుకు పీడీఎఫ్ గ్రౌండ్‌వర్కు చేసుకుంటున్నది. శాసనమండలి పునరుద్ధరణ జరిగిన తర్వాత తొలిసారిగా 2007లో ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో బరిలోకి దిగిన చిగురుపాటి వరప్రసాద్ విజయం (మిగతా 6వ పేజీలో)



ఘర్షణ పడ్డ టెక్నికల్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న ఎంపీడీవో (ఫైల్)

మస్టర్లు.. మీ ఇష్టం

- నెలనెలా ముడుపులిస్తే ఓకే
- మండల అధికారి, టెక్నికల్ అసిస్టెంట్‌ల మధ్య ఒప్పందం
- తలలు పట్టుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు
- ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్‌ల బదిలీ

అద్దంకి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో అవినీతి తాండవిస్తోంది. ఈ విషయంలో మండల స్థాయి అధికారులు, పర్యవేక్షణ సిబ్బంది వ్యవహారం మరింత శ్రుతి మించడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు తలలు పట్టుకుంటున్నారు. మస్టర్లు మీ ఇష్టం వచ్చినంత మందికి వేసుకోండి... కానీ మాకు వారంవారం ముడుపులు మా త్రం కచ్చితంగా ఇవ్వాల్సిందే అంటూ, అద్దంకి నియోజకవర్గంలోని రెండు మండలాలలో ఉపాధిహామీ పథకం అధికారులు, సిబ్బంది నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు మౌఖికంగా అందిన ఆదేశాలు. ఈ క్రమంలోనే సంతమాగులూరు మండలంలో 4 గురు టెక్నికల్ అసిస్టెంట్‌లు ఉండగా సోమవారం ముగ్గురిపై బదిలీ వేటు పడినట్లు తెలుస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో అన్నీ తానై వ్యవహరించి తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న బల్లికురవ మండల ఏపీవో బదిలీపై వేరే మండలానికి వెళ్లి మరలా పక్క మండలమైన సంతమాగులూరుకు వచ్చారు. పనిలో పనిగా బల్లికురవ మండలం ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంపాదన రెండు చేతుల నిండా వస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ వారానికి రూ.5వేలు చొప్పున ఇవ్వాల్సి ఉంది. అంటే నెలకు రూ.20వేల చొప్పున ఇవ్వాలన్న మాట. ఇలా ఒక్కో మండలంలో సరాసరిన 20 మందికి పైగానే ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉండడంతో రూ.4లక్షలు వసూలు చేయాలన్న లక్ష్యంగా ఒప్పందం కుదరినట్లు తెలుస్తున్నది. వచ్చిన మొత్తాన్ని సదరు మండల స్థాయి అధికారి, టెక్నికల్ అసిస్టెంట్‌లు వాటాల ప్రకారం పంచుకునేలా గుట్టుగా ఒప్పందం జరిగినట్లు సమాచారం. వసూలు విషయం బయటకు పొక్కడంతో నీవు బాధ్యుడవంటే కాదు నీవు బాధ్యుడవని ఇటీవల బల్లికురవ మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు గొడవ పడ్డారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కుసుమకుమారి వెంటనే టెక్నికల్ అసిస్టెంట్‌లను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇదేక్రమంలో సంతమాగులూరు మండలంలో కూడా రచ్చకెక్కడం తో అవినీతికి ఒకింత దూరంగా ఉండే మండల స్థాయి ఒక ముఖ్య అధికారి ఉపాధి సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి తనకు ఎలాంటి వాటాలు అ క్కర లేదని, వసూలు చేసే మొత్తాన్ని రచ్చ చేయకుండా పంచుకోవాలని చెప్పినట్లు సమాచారం. ఇలా ఫీల్డ్ అసిస్టెంట్‌లకు టార్గెట్‌లు విధించి వసూలుకు ఉపక్రమించడంతో దొంగ మస్టర్‌లు ఇష్టానుసారం వేసే పనిలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు నిమగ్నమైనట్లు తెలుస్తుంది. పనిలో పనిగా పెద్ద ఎత్తున దొంగ మస్టర్‌లు వేసేందుకు పలువురు ఫీల్డ్ అసిస్టెంట్‌లు సిద్ధమైనట్లు సమచారం. మరి కొందరు మాత్రం దొంగ మస్టర్‌లు వేసి సమస్యలు కొని తెచ్చుకోవడం ఎందుకనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కట్టడి చేయక పోతే గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతిని మించి వసూలు చేసేందుకు సిద్ధమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 36 సెంటర్లలో పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. పరీక్షలకు 19,219 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థులు బస్సు సౌకర్యం కొరకు ఆర్టీసీ వారికి బస్సు బయలుదేరు స్థలం, పరీక్ష కేంద్రాల వివరాలను తెలుపుతూ లేఖ రాయాలన్నారు. ప్రతి విద్యార్థి ఉదయం 8.30కు పరీక్షా కేంద్రంలో ప్రవేశానికి అవకాశం కల్పించాలన్నారు. 9గంటల తర్వాత ఎవరని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రం చుట్టూ పక్కల మండల రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 144వ సెక్షన్ నిర్వహించబడుతుందన్నారు. ప్రశ్నాపత్రాలను పోలీసు వారి సహాయంతో నాలుగు చక్రాల వాహనంలో మాత్రమే ఆయా పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్ళాలని తెలిపారు. పరీక్షలు సీసీ కెమేరాల పర్యవేక్షణలో జరగాలన్నారు. పరీక్ష కేంద్రంలో ఉండే ఇన్విజిలేటర్లకు, అటెండర్లకు ఫొటో గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడినచో నిబంధన మేరకు ఆయా రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించటం జరుగుతుందన్నారు. సమావేశంలో డివిజన్ విద్యాధికారి యర్రయ్య, సర్వశిక్షాభియాన్ అధికారి నాగిరెడ్డి, స్పెషలాఫీసర్ కోదండ రాము, జిల్లా పరీక్షా కమిటీ మెంబరు సీహెచ్ సతీష్‌బాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషకుమారి, చీరాల మహిళ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమీక్షిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

హోరాహోరీగా ఎడ్ల పందాలు

చినగంజాం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి న్యూ జూనియర్ విభాగం నాటు బండి పోలు రాధా బల ప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి హోరాహోరీగా సత్తా చాటేందుకు ఎడ్లు తలపడ్డాయి. రాష్ట్ర స్థాయి పోటీలకు పల్నాడు, కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు, బాపట్ల జిల్లాలోని బాపట్ల, చెరుకుపల్లి, సోపిరాల తదితర గ్రామాలకు చెందిన 16 ఎడ్ల జతలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. సోపిరాల టైర్లు బండ్ల అసోసియేషన్, గ్రామస్థుల సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాటు బండి పోలు రాధా ఎడ్ల పందేలను మున్సిపల్ మాజీ కమిషనర్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు, ఎస్ఐ శీలం రమేష్, ఏపీఎం గద్దె పెద్దసుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం వలన ప్రజల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. పేక్షకుల ఈలలు, కేరింతలతో దేవస్థానం ప్రాంగణం తిరునాళ్ల వాతావరణం నెలకొంది. పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పోటీలలో విజేతలైన ఎడ్ల యజమానులకు మంగళవారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ, ఏపీఎం, ఎడ్ల యజమానులను కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు.



పోటీలలో పాల్గొన్న కృష్ణా జిల్లా ఎడ్లు

రేపు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

మార్టూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం గన్నవరంరోడ్‌లోని బొబ్బేపల్లి దండుదారి వద్ద గల దేవస్థానంలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారని, అనంతరం భక్తులకు అన్న ప్రసాదకార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ప్రజావేదిక

ఇంకొల్లు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి పనులపై గత వారం రోజులుగా సామాజిక తనిఖీలు నిర్వహించారు. దీనిపై మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరుగుతుందని ఏపీవో రేణుక తెలిపారు. అధికారులు, సర్పంచ్‌లు, సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరారు.

తాగునీటి చెరువులు నింపేందుకు చర్యలు



చెరువులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్యలక్ష్మి

మేదరమెట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న తాగునీటి చెరువులు నింపేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని రాచపూడి గ్రామంలోని చెరువును ఆమె పరిశీలించారు. గ్రామాల్లో చెరువులను నింపేందుకు ఉన్న వనరులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ముందుస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరమ్మతులకు గురైన చేతి బోర్లను బాగు చేయిస్తున్నామని తెలిపారు. ఆమె వెంట గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల అడ్డా.. ఆటోనగర్

(5వ పేజీ తరువాయి)

విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఎక్కడెక్కడో కొనుగోలు చేసి తీసుకువచ్చిన విత్తనాలను అందమైన ప్యాక్ లలో నింపుతున్నారు.

బీజీ-2 కాదు..బీజీ-3

ఆటోనగర్ వేదికగా బయటకు వస్తున్న పత్తి విత్తనాలపై పలు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి బీజీ-2 పత్తి విత్తనాలను మాత్రమే సాగు చేయాలి. అయితే ప్రభుత్వ అనుమతి లేని బీజీ-3 విత్తనాలను ఇక్కడ నుంచి సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బీజీ-2 విత్తనాల ప్యాకెట్లలోనే వాటిని నింపి అమ్మకాలు జరుపుతున్నారన్న వాదన ఉంది. మిరప విత్తనాలు కూడా బెంగుళూరు ప్రాంతం నుంచి తీసుకువచ్చి ఇక్కడి గోడౌన్లలోనే ఉంచుతున్నారు. అక్కడ ప్రముఖ కంపెనీల లో ఫెయిల్ అయిన లాట్స్ ను ఇక్కడ కు తెచ్చి అమ్మకాలు జరుపుతున్నారు.

47 పార్సిల్స్...

గుంటూరు లో 47 పార్సిల్స్ కార్యాలయాలు ఉన్నాయి. రాష్ట్రంలో ని ఎక్కడ నుంచి ఎక్కడకు సరుకు వెళ్లాలన్నా ఇక్కడ కు రావాల్సిందే.నకిలీ విత్తనాలు కూడా ఆయా పార్సిల్స్ ద్వారానే అటు ఇటు సరఫరా అవుతున్నాయి. గతంలో అధికారులు ఆయా పార్సిల్స్ లో తనిఖీ లు నిర్వహించి కేసులు నమోదు చేశారు. తనిఖీ లకు వెళ్లిన ప్రతి సారి ఏదో ఒక కేసు నమోదు అయ్యింది. ఈ మధ్య కాలంలో తనిఖీ లు బొత్తిగా లేవన్న వాదన వినిపిస్తోంది. ఖరీఫ్ లో రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ఉండాలంటే ఆటోనగర్ తో పాటు,పార్సిల్స్ కార్యాలయాలపై దృష్టి కేంద్రీకరించాలని పలువురు సూచిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దొనకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని బాదాపురం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని రామిరెడ్డి పల్లికి చెందిన అన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి ద్విచక్ర వాహనంపై దొనకొండ వచ్చి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈక్రమంలో బాదాపురం గ్రామ సమీ పంలో అకస్మాత్తుగా రోడ్డుపైకి అడవిపంది రావడంతో, దానిని ఢీకొట్టి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. సంఘటనాస్థలానికి 108 సిబ్బంది చేరుకొని క్షతగాత్రుడిని వినుకొండ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

పల్లె పండుగ పనుల బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం



బల్లికురవ మండలంలో మూడు నెలల కిందట వేసిన సీసీ రోడ్డు

పలు గ్రామాలలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, గోకులం షెడ్ల నిర్మాణం
నెలలు గడుస్తున్నా అందని డబ్బులు
కాంట్రాక్టర్లు లబోదిబో
బల్లికురవ మండలంలో సుమారు రూ.4 కోట్లతో పనులు

బల్లికురవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం గ్రామాలలో పల్లె పండగ పేరుతో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, రైతులకు గోకులం షెడ్లను నిర్మించింది. అధికారులు పనులు చేసిన వెంటనే వారం వారం బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో గ్రామాల్లో టీడీపీ నేతలు, కాంట్రాక్టర్లు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి శరవేగంగా పనులు చేపట్టారు. పనులు చేసి నెలలు అవుతున్నా నేటికీ బిల్లులు చెల్లించలేదు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. అధికారులు దగ్గరుండి నాణ్యతతో సిమెంట్ పనులు చేయించారని, వెంటనే బిల్లులు చెల్లించకపోతే నష్టమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి శుక్రవారం బిల్లుల జమ అవుతాయని చెప్పడంతో వారాలు మారుతున్నా బిల్లులు రావడం లేదని అంటున్నారు.

21 పంచాయతీల్లో పనులు

మండలంలోని 21 గ్రామ పంచాయతీకు ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు గాను 39 పనులకు సుమారు రూ.4కోట్ల నిధులను ఉపాధి కింద మంజూరు చేసింది. నవంబరులో వేసిన రోడ్లకు కూడా ఇంత వరకు బిల్లులు చెల్లించలేదు. పనులు చేసిన వారు తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయారు. తాము పనులు చేసిన వెంటనే క్వాలిటీ అధికారుల బృందం కూడా వచ్చి తనిఖీలు చేసిందని, అయినా బిల్లులు రాలేదని పనులు చేసిన వారు చెప్తున్నారు. మండలంలో పాడి రైతులకు 17 గోకులం షెడ్లు కూడా మంజూరు కాగా, కొందరు రైతులు పెట్టుబడులు పెట్టి పూర్తి శాతం పనులు చేశారు. వాటికీ ఇంత వరకు నగదు రాలేదు. ప్రభుత్వం వెంటనే చేసిన పనులకు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.



కొత్తపాలెంలో రైతులు నిర్మాణం చేసిన గోకులం షెడ్డు

ఉప్పు భూముల లీజులను రెన్యువల్ చేయాలి

చినగంజాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఉప్పు భూముల లీజును రెన్యువల్ చేసి వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ జిలాని, మండల ప్రముఖ్ కోలా సుబ్బారావు కోరారు. 2024 డిసెంబరు ఆఖరున రద్దు చేసిన ఉప్పు భూముల లీజును తిరిగి కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావుకు వారు వినతిపత్రం అందజేశారు. మండలంలోని రాజుబంగారుపాలెం, కుక్కలవారిపాలెం, కొత్తపాలెం, మున్నంవారిపాలెం, మూలగానివారిపాలెం, రామచంద్రానగర్ గ్రామాలకు చెందిన 800 కుటుంబాలకు చెందిన పేద రైతులు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న 497 ఎకరాలలో ఉప్పు పంటను సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని జిలాని తెలిపారు. ఉప్పు భూములను 20 సంవత్సరాల లీజు పద్ధతిలో గత వందేళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. కేంద్రప్రభుత్వం లీజు రద్దు చేయడం వలన చినగంజాం ప్రాంతంలో ఉండే వేల కుటుంబాలు వలసలు వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. ఉప్పు భూములను తిరిగి లీజు రెన్యువల్ చేయాలని కోరుతూ జిల్లా అధికారులకు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సాల్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులకు వినతిపత్రాలు పంపుతున్నట్లు జిలానీ, సుబ్బారావు తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

మహిళ గర్భసంచిలో 3.5 కిలోలు కణితిని తొలగించిన వైద్యులు

మార్టూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు షేక్ రిజ్వానా అనే 50 ఏళ్ల మహిళకు అరుదైన ఆపరేషన్ చేశారు. సోమవారం ఈ మహిళ రిజ్వానా పూర్తిగా కోలుకుని ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లిపోయారు. ఈ మహిళ గర్భ సంచిలో ఉన్న 3.5 కిలోలు బరువు ఉన్న కణితిని జనరల్ సర్జన్ గారపాటి కిషోర్‌కుమార్ ఆపరేషన్ చేసి తొలగించారు. చిలకలూరిపేటకు చెందిన రిజ్వానా కొంతకాలం నుంచి జ్వరంతో, అధిక రక్తస్రావంతో బాధపడుతుండగా చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుంది. ఆపరేషన్‌కు రూ.లక్షకుపైగా వ్యయమవుతుందని డాక్టర్లు తెలిపారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న రిజ్వానా మళ్లీ చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. అక్కడ డాక్టర్లు ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆమె గత నెల నుంచి మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమె పరీక్షలు చేయించుకుంటూ ఈనెల 12న ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. 13న జనరల్ సర్జన్ గారపాటి కిషోర్‌కుమార్, ఫిజీషియన్ సాయిప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్, మత్తు డాక్టరు విష్ణుతేజ దాదాపుగా 3 గంటలు కష్టపడి ఆమెకు ఆపరేషన్ చేసి కణితిని తొలగించారు. ఇటీవల ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కొంత మంది దాతలిచ్చిన రక్తదానం నుంచి 4ప్యాకెట్ల రక్తాన్ని రిజ్వానాకు వైద్యులు దశల వారీగా అందించారు. దాంతో ఆమె పూర్తిగా కోలుకొని ఇంటికి వెళ్లారు. ఇంత పెద్ద ఆపరేషను ప్రభుత్వ ఆస్పత్రిలో చేయడం ఇదే తొలిసారి కావడంతో కుటుంబ సభ్యులు, రోగులు వైద్యులను అభినందించారు.



రిజ్వానాతో వైద్యులు కిషోర్‌కుమార్, విష్ణుతేజ, సాయిప్రసాద్

పీడీఎఫ్.. హ్యాట్రిక్ కొట్టేనా..?

(5వ పేజీ తరువాయి)

సాధించారు. అయితే ఆయన ఎమ్మెల్సీగా విజయవాడకే ఎక్కువగా పరిమితమయ్యారు. దాంతో గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ నేతలు 2013లో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. సీఎం చంద్రబాబు అప్పటి నేతలను పిలిపించుకుని మాట్లాడి తిరిగి వరప్రసాద్‌కే మద్దతు ప్రకటించారు. ఆ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొడ్డు నాగేశ్వరరావు రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో గెలుపొందారు. 2019లో సాధారణ ఎన్నికలకు నెల ముందు పట్టభద్రుల ఎన్నికలు వచ్చాయి. దాంతో టీడీపీ ప్రత్యక్షంగా ఫలాన అభ్యర్థికి తాము మద్దతిస్తున్నామని ప్రకటించలేదు. అయితే శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం నూతలపాటి అంజయ్య పోటీ చేసి టీడీపీ మద్దతు తనకే ఉందని ప్రకటించుకున్నారు. ఆ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు పోటీ చేసి రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో విజయం సాధించారు.

ఆలపాటి, లక్ష్మణరావు మధ్య హోరాహోరీ

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి నాల్గో దఫా ఎన్నికలు జరగబోతున్నాయి. దీంతో ఎలాగైనా విజయం సాధించి పూర్వవైభవం సంతరించుకోవాలని టీడీపీ కూటమి విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మద్దతుగా జనసేన, బీజేపీ నాయకులు ప్రచారంలోకి దిగారు. కొన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల మద్దతు కూడా టీడీపీ కూడగట్టుకున్నది.

మరోవైపు పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపు కోసం ఉపాధ్యాయ సంఘాలు గత కొన్ని రోజుల నుంచి గ్రౌండ్‌వర్క్ చేస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాల నేతలు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులను కలుసుకుని లక్ష్మణరావుకు మద్దతుని కూడగడుతున్నాయి. ఈ నేపథ్యంలో పోటీ హోరాహోరీగా మారుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో విజయం తేలకపోవచ్చని, రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతోనే ఫలితం వస్తుందని అంచనా వేస్తున్నారు. సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు భిన్నం కావడంతో తొలి ప్రాధాన్య ఓటు కోసమే అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ప్రచార కార్యక్రమాలు, ఆత్మీయ సమావేశాలను ముమ్మరం చేశాయి.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

- పరీక్షల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు : 81
- ప్రథమ సంవత్సరం విద్యార్థులు : 34,273
- ద్వితీయ సంవత్సరం విద్యార్థులు : 34,973
- సీఎస్,డీవోలు : 166
- సిట్టింగ్,ఫ్లయింగ్ స్క్వాడ్స్ : 8
- స్టోరేజ్ కేంద్రాలు :16
- సీసీ కెమెరాలు: దాదాపు 400 పైగా

పత్రాల బండిల్స్ ప్యాక్ చేసేలా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌అమల్లో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్ఐఓ వివరించారు. ఈనెల 24న ప్రశ్నా పత్రాల కోసం 16 స్టోరేజ్ కేంద్రాలకు(పోలీసు స్టేషన్స్) అత్యంత భద్రత నడుమ పంపిణీ చేశారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 83 మంది, చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 83 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఓ జుబేర్ వెల్లడించారు.

విద్యార్థుల సౌలభ్యం కోసం సంస్కరణలు

ఇంటర్ బోర్డు చరిత్రలో తొలిసారి హాజరుతో పనిలేకుండా ఫీజు కట్టిన ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాదు విద్యార్థుల సౌలభ్యం కోసం హాల్‌టిక్కెట్లు వాట్సప్‌వెబ్(9552300009) నుంచి డౌన్‌లోడు చేసుకుని ప్రిన్సిపల్ సంతకంతో పనిలేకుండా నేరుగా పరీక్షకు హాజరుఅయ్యేలా ఏర్పాట్లు చేశారు. పరీక్షలపై ఎటైనా సందేహాలు, ఫిర్యాదుల చేసేందుకు ఇంటర్ బోర్డు కార్యాలయంలో ప్రత్యేసెల్ (0863-2228528) ఏర్పాటు చేశారు. ఇలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు నడుమ ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణకు ప్రణాళికలు ఇంటర్ బోర్డు అధికారులు సిద్ధం చేశారు.



స్టోరేజ్ కేంద్రాల వద్ద భద్రత.....

ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు

కనిగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల బాలికపై యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. సదరు వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఖాజావలి తెలిపారు. అతనిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని ఓ బాలిక ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. మరో బాలిక తండ్రి ఉమేష్(28) శనివారం రాత్రి మోటర్‌సైకిల్‌పై బాలికను బయటకు తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కేకలు పెట్టడంతో సమీపంలో వదిలిపెట్టి వెళ్లాడు. బాలిక కనిపించకపోవటంతో కుటుంబసభ్యులు వెతుకుతుండగా ఆ ప్రాంతంలో ఏడుస్తూ ఉంది. దీంతో బాలికను కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. రెండు రోజులుగా కడుపునొప్పి అని బాలిక చెప్పటంతో అనుమానం వచ్చి అడగగా, జరిగిన విషయాన్ని తల్లికి చెప్పింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేశారు. సంబంధిత వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

అవీఇవీ

ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు



ఉప్పుమాగులూరులో ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఉన్న సర్వే నెంబరు-371లో గత వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన ఓ నేత ప్రభుత్వ భూమిని ఆక్రమించి చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో సోమవారం వార్త ప్రచురితమవడంతో తహసీల్దార్ రవినాయక్ వెంటనే స్పందించారు. సిబ్బందిని అక్కడికి పంపించి ప్రభుత్వ భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే శిక్షార్హులని బోర్డు ఏర్పాటు చేయించారు. ఎవరైనా అక్రమంగా భూమిలోకి చొరబడితే చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పోతురాజు, వీఆర్వో అశోక్ పాల్గొన్నారు.

కుటీరం నమూనా దగ్గుబాటికి బహూకరణ

అభిమానం చాటుకున్న ప్రముఖ చిత్రకారుడు లంకా

కారంచేడు (పర్చూరు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు నివాస గృహం ఆవరణలో నిర్మించిన కుటీరం నమూనాను ప్రముఖ చిత్రకారుడు లంకా ప్రసాద్ దగ్గుబాటికి బహూకరించి అభిమానం చాటుకున్నారు. ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన దగ్గుబాటికి సోమవారం ఆయన నివాసంలో కలసి కుటీర నమూనాని అందజేశారు. డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, సతీమణి పురందేశ్వరి 2004 ఎన్నికల్లో పోటీ చేసిన సందర్భంలో ఇంటికి వచ్చిన కార్యకర్తలు, అభిమానులను కలుసుకునేందుకు, ప్రచారం నిర్వహించుకునేందుకు ఈ కుటీరాన్ని నిర్మించారు. ఈకుటీరంలో ఎక్కడా ఇనుముగానీ, సిమెంట్ గానీ వాడకపోవడం విశేషం. అంతా మట్టి గోడలు, కొయ్యిదూలాలతో, జమ్ముతో పైకప్పు, గోడలన్నీ పేడతో అలకడం వలన రంగురంగుల ముగ్గులతో అలంకరించిన దృశ్యాలు ఉండడం కుటీరం ప్రత్యేకత. ఈ కుటీరంలో కుర్చీలు, టేబుళ్లు, సోఫాలు, ఇతర ఫర్నిచర్ అంతా పూర్తిగా వెదురుతో తయారు చేసినవి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న కుటీరాన్ని తన కళానైపుణ్యంతో చిత్రీకరించి ప్రముఖ చిత్రకారులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన్ని దగ్గుబాటి ప్రత్యేకంగా అభినందించారు.



కుటీర నమూనాను చిత్రకారుడు ప్రసాద్

మణికేశ్వరంలో మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఏర్పాట్లను సోమవారం రాత్రి సీఐ సుబ్బరాజు పరిశీలించారు. గుండ్లకమ్మ నదిలో స్నాన ఘాట్, క్యూలైన్, ఇతర ఏర్పాట్లు పరిశీలించి దేవాలయం అధికారులకు పలు సూచనలు చేశారు. అవసరమైన మేర బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్థులతో చర్చించారు. ఈవో వాసుబాబు, టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, అంజయ్య, మేకల ఆదినారాయణ, బలరామిరెడ్డి, బడావలి, సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్




విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో సత్యనారాయణ, వెంకట్రామయ్య

పర్చూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఎంఈవో ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం వైఆర్ హైస్కూలో మండల స్థాయిలో 8, 9 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈపోటీలలో మొదటి బహుమతి అంబేడ్కర్ గురుకులం, రెండవ బహుమతి ఉప్పుటూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యా ర్థులు కైవసం చేసుకున్నారు. విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వెంకట్రామయ్య, విశ్రాంత నవోదయ ఉపాధ్యాయుడు పిన్నక సాంబశివరావు, హెచ్ఎం ఈదర రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కజొన్న చేలో మంటలు

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం రూ.20వేల ఆస్తి నష్టం

అద్దంకి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న పొలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి రూ.20వేల ఆస్తినష్టం వాటిల్లింది. అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులో గుడిపాటి చిరంజీవికి చెందిన పొలంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మం టలు రేగి డ్రిప్ నీటి పైపులు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నాటుసారా బట్టీలపై దాడులు

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నాటుసారా కాసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.నరహరిరావు అన్నారు. నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలంలోని పైలుచర్ల గ్రామంలో నాటుసారా బటీటలపై సోమవారం ఆకస్మిక దాడులు చేశారు. పైలుచర్ల నుంచి నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ తెలిపారు. ఈసందర్భంగా నరహరిరావు మాట్లాడుతూ నాటుసారా బట్టీలు కాసా వారేపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎవరైనా నాటుసారా బట్టీల వివరాల సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు

- వేలాదిగా భక్తులు పాల్గొనే అవకాశం
- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

చీరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించకుని చీరాల పరిధిలోని ఆలయాలు శరవేగంగా వేడుకలకు ముస్తాబవుతున్నాయి. ప్రతిఏటా చాంద్రమాన మాసంలోని 14వ రోజు లేదా అమావాస్యకు ముందు రోజు భక్తులు విశేషంగా పండుగను జరుపుకుంటారు. మహాశివరాత్రి పండుగను ఆధ్యాత్మికంగా, ఉత్సాహంగా జరుపుకునేందుకు భక్తలు, ఆయా ఆలయాలు కమిటీ ప్రతినిధులు సన్నద్ధమయ్యారు. చీరాల పరిధిలో ప్రాచూర్యం పొందిన ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. దీంతో ప్రత్యేక పూజలతో పాటు, రాత్రంతా జాగారాలతో ఆలయాలు మార్మోగనున్నాయి.

పేరాల శివాలయం


పేరాల పునుగు రామలింగ మల్లేశ్వర స్వామి ధ్వజ స్తంభం

పేరాల పునుగు రామలింగ మల్లేశ్వర స్వామి దేవస్థానానికి ప్రత్యేకత ఉంది. 1465వ సంవత్సరంలో గౌతం మహా మునీశ్వరులు కొంతకాలం పూజల అనంతరం స్వామి వారిని కారంచేడు గేటు సమీపంలో వదిలి వెళ్లారని, కాలక్రమేణా పూర్వీకులు స్వామిని 1795లో కాళయుక్త నామ సంవత్సరంలో పేరాల వద్ద పునఃప్రతిష్ఠించారు. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలోనే జమ్మిచెట్టు అవతరించడంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. జమ్మిచెట్టు శనీశ్వరునికి ప్రీతిపాత్రమైనది కావడంతో పూజలు నిర్వహిస్తే శని దోషాలు తొలుగుతాయని శాస్త్రోక్తంగా భావించిన భక్తులు విశేష పూజలు చేస్తుంటారు. ఈక్రమంలో ఆలయంలో నిత్యం పూజలు, పుణ్యకార్యాలు, అన్నదానాలు జరుగుతుంటాయి. ఈసారి శివరాత్రికి కూడా ఇక్కడ ప్రత్యేక పూజలకు భక్తులు వేల సంఖ్యల్లోనే పాల్గొననున్నారు.

కొత్తపేట ఓంకార క్షేత్రం


కొత్తపేట ఓంకార క్షేత్రం గాలి గోపురం

చీరాల సమీపంలోని కొత్తపేట ఐఎల్‌టీడీ కాలనీలో వెలిసిన ఓంకార క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. 2000 సంవత్సరంలో ఆలయాన్ని నిర్మించి ఒకేసారి 18 ప్రతిష్ఠలు చేశారు. ఇక్కడ స్వామి సన్నిధిలోనే రామాలయం, పంచముఖ గాయత్రి అమ్మవారి, నవగ్రహాలు, ఆంజనేయ స్వామి దేవాలయాలను నిర్మించారు. అన్ని దేవుళ్లూ ఒకేచోట ఉండటంతో ఓంకార క్షేత్ర పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శివరాత్రి ప్రత్యేక పూజలు జరుగనున్నాయి.

చీరాల శివాలయం విశిష్టత


చీరాల గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం

చీరాల గంజిపాలెంలో సుమారు 400 ఏళ్ల క్రితం గంగా భ్రమరాంబసమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం వెలిసింది. దీంతో ఆలయానికి యేటా భక్తులు సుమారు 10వేల మంది భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అలాగే నిర్వాహకులు అన్ని సౌకర్యాలతో పాటు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక్కడ పూజలు నిర్వహించేందుకు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారుకూడా పెద్ద సంఖ్యలో హాజరవుతారు. కమిటీ ప్రతినిధులు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా స్వామి కల్యాణ మహోత్సవం, లింగోద్భవ అభిషేకాలు, అన్నదానం నిర్వహించనున్నారు.

మహా శివరాత్రి అంటే గుర్తొచ్చేది చినగంజాం


చినగంజాంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం

చినగంజాం : మహాశివరాత్రి తిరునాళ్ల అంటే చినగంజాం ప్రాంతం గుర్తుకు రావాల్సిందే. దేశ, విదేశాలలో ఎక్కడ ఉన్నా ఏ పండుగకు వచ్చినా రాకపోయినా మహాశివరాత్రి పండుగకు స్వగ్రామానికి వచ్చి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. మహాశివరాత్రి తిరునాళ్లను వైభవంగా జరుపుకునేందుకు మండలంలోని శైవ క్షేత్రాలు వద్ద సర్వం సిద్ధం చేశారు. మండలంలోని సంతరావూరలోని పురాతన దేవాలయం అయిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం, చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలోని లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వర స్వామి ఆలయాల వద్ద బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని కనులవిందుగా చేసేందుకు ఆలయాల నిర్వహణ కమిటీ సభ్యులు సుందరంగా ముస్తాబు చేశారు. మహాశివరాత్రి తిరునాళ్లను జిల్లాలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మండలంలోని సోపిరాల, కొత్తపాలెం గ్రామాల్లో ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ఈ ఏడాది రెండు దేవాలయాల వద్ద అత్యంత వైభవంగా తిరునాళ్ల నిర్వహించేందుకు కావలసిన ఏర్పాట్లను ఇరువర్గాల వారు సిద్ధం చేశారు. గుంటూరు జిల్లా కోటప్పకొండ తరువాత చినగంజాం మండలంలో నిర్వహించే తిరునాళ్లకు అంతటి ప్రసిద్ధి పొందింది. కొత్తపాలెం గ్రామ పంచాయతీలోని శ్రీబాలకోటేశ్వరస్వామి స్వయంభు కాగా భక్తుల కోర్కెలను తీర్చే స్వామిగా ఈ ప్రాంతంలోని వారికి ప్రగాఢ విశ్వాసం ఉంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఒక సామాజిక వర్గానికి చెందిన వారిచే అత్యంత వైభవంగా మహాశివరాత్రి తిరునాళ్ల జరుగుతుండేది. కాలక్రమంలో ఒక వర్గం సోపిరాల గ్రామంలో ఐదు దశాబ్దాల కిందట రామకోటేశ్వరస్వామి ఆలయాన్ని ఏర్పాటు చేసి పోటాపోటీగా తిరునాళ్లను నిర్వహిస్తున్నారు. గ్రామంలో గుడి నిర్మించిన తరువాతనే గ్రామాభివృద్ధి చెందిందని గ్రామస్థుల నమ్మకం. స్నేహపూర్వక వాతావరణంలో జరిగే ఈ తిరునాళ్లలో నిర్మించే భారీ విద్యుత్ ప్రభల దీపాలంకరణాలు, సాంస్కృతిక కార్యక్రమాలనుఏర్పాటు చేయడం ఇక్కడ ప్రత్యేకత. భక్తులను ఆకర్షించే విధంగా భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేయటమే కాకుండా మెగా ఈవెంట్స్ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమాలను వీక్షిస్తూ శివరాత్రి జగారాన్ని భక్తులు పూర్తి చేస్తారు.. బుధవారం తెల్లవారుజాము 3గంటల నుంచి ఆలయాల వద్ద స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ప్రారంభమైన్న తిరునాళ్ల మరసటి రోజు ఉదయం వర కు వివిధ రూపాలలో కార్యక్రమాలు కొనసాగుతూ ఉంటాయి. రామకోటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి బాటిల్‌తో పాటు తీర్థ ప్రసాదాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. పోలీసు వారి ఆదేశాలను పాటిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఐదు భారీ విద్యుత్ ప్రభలు, రామకోటేశ్వరస్వామి ఆల యం వద్ద ఎనిమిది భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి ప్రముఖ యాంకర్లచే నిర్వహించే కార్యక్రమాలతో పాటు, సినీ మ్యూజికల్ నైట్, మిమిక్రీ, పౌరాణిక నాటకాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు.


రామకోటేశ్వరస్వామి ఆలయం

రామకూరు కొండపై రామలింగేశ్వరస్వామి

పంగులూరు : మండలంలోని రామకూరు కొండపై స్వయంభూగా వెలసిన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని అర్చకస్వామి వెంకటేష్ తెలిపారు. ఈ నెల 26 మహా శివరాత్రి రోజున ఆలయ గిరి ప్రదక్షిణతో ప్రత్యక పూజలు ప్రారంభమ వుతాయని తెలిపారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో అజయ్‌బాబు

చినగంజాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-1 బి.అజయ్‌బాబు అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదవ రోజైన సోమవారం జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాఠశాల సంసిద్ధత మేళాపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు పాఠశాలకు వెళ్లే చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేయవలసిన విధానం, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, పిల్లలకు ఆహ్వానించడం, కేంద్రంలో నమోదు ప్రక్రియ మేళా రిపోర్టు కార్డు, అభివృద్ధిల గురించి డీఆర్‌పీలు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, వెంకటేశ్వరరావులు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నేర్పించవలసిన పలు విషయాలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కే.వాణిశ్రీ, ఎన్.సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు మెరుగైన బోధన అందించాలి

చెరుకూరు (పర్చూరు) : చిన్నారులకు మెరుగైన బోధన అందిచి వారి ఎదుగుదలకు కృషి చేయాలని ప్రధాన శిక్షకులు బ్రహ్మయ్య అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం చెరుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అండన్‌వాడీ కార్యకర్తలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, బాలకోటేశ్వరావు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్య పనులపై సూచనలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పారిశుధ్య పనులు చేపట్టాలి

పంగులూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయితీ కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం, మురుగు కాలువలలో పూడికతీత, నీటిని క్లోరినేషన్ చేసే కార్యక్రమాలను క్రమంతప్పకుండా చేపట్టాలన్నారు. రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, 15 రోజల వ్యవధిలో బ్లీచింగ్ చల్లాలని కోరారు. నివాస ఆవాసాల నుంచి సేకరించే చెత్తను డంపింగ్ యార్డులలో కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి పంచాయతీలకు సంపద రాబట్టాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో తాగు నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమీక్షా సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో 100 కుటుంబాలు చేరిక

చీరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎంఆర్‌పీఎస్ నాయకులు వేటపాలెంకు చెందిన మున్నంగి అరుణ్ ఆధ్వర్యంలో సుమారు 100 కుటంబాలు ఆదివారం రాత్రి టీడీపీలో చేరారు. ఈక్రమంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తన క్యాంప్ కార్యాలయంలో వారిని పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. సమిష్టిగా కృషి చేసి ప్రాంతాల అభివృద్ధికి పాటు పడాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. పలువురు కూటమి నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

పీఎం కిసాన్‌తో రైతులకు ఆసరాగా

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో రైతులకు ఆసరాగా ఉంటుందని సోమవారం మండల పరిధిలోని 1898 మంది రైతులకుగాను సుమారు రూ.38లక్షల నగదు విడుదల అయినట్లు వ్యవసాయాధికారి కాశీ విశ్వనాథ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించిన వీక్షణ కార్యక్రమాన్ని దేశాయిపేట రైతు సేవాకేంద్రం-2 కేంద్రంలో నిర్వహించారు. నగదు జమ జరగని అర్హులు సరైన ధ్రువపత్రాలు తీసుకుని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు సజ్జా వెంకటేశ్వర్లు, వీఏఏలు కావ్య, మనీషా, కుసుమ కుమారి, రైతులు పాల్గొన్నారు.

సీఎంకు మునిసిపల్ కార్మికుల లేఖలు

చీరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కారం కోరుతూ మునిసిపల్ కార్మికులు సోమవారం ముఖ్యమంత్రికి లేఖలు రాసి పోస్టు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పొరుగు సేవల కార్మికుల్లో నెలకొన్న భయాందోళన తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు వీరాస్వామి, ఇమ్మానియేల్, శామ్యేల్, క్రాంతిసాగర్, సింగయ్య, చాంద్‌బాషా, నాగేశ్వరరావు, సురేష్, రాంబాబు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్‌ను రద్దు చేసి మమ్మల్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దంటూ సోమవారం అద్దంకిలోని పారిశుధ్య కార్మికులు వినూత్న నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మా సమస్యలు వినండి అంటూ పోస్టు కార్డులు వేసి నిరసన తెలిపారు. మినిమం టైం స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ కార్మికులు అధ్యక్షుడు ఉసురుపాటి సామ్యేలు, పెద్దమార్కు, మారుతి, యోహోషువా, పారిశుధ్య కార్మికులు ఆదాం, బిష్మా, వీరయ్య, వెంకట్రావు, శ్రీను, లక్ష్మినారాయణ, హనుమంతరావు పాల్గొన్నారు.


మల్లన్న తలపాగా గ్రామోత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

వైభవంగా మల్లన్న తలపాగా గ్రామోత్సవం

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని తయారు చేసిన మల్లన్న తలపాగా గ్రామోత్సవం సోమవారం మండల పరిధిలోని రామన్నపేట కొత్తనగర్‌లో వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సాదు శ్రీనివాసరావు 41 రోజుల పాటు శివమాల ధరించి పాగాను తయారీ చేశారు. ఈక్రమంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవం నిర్వహించి మంగళవారం శ్రీశైలంకు తరలించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఊటుకూరి సుబ్రహ్మణ్యస్వామి, పిచ్చుక శ్యామ్, వెంకటేశ్వరరావు, లింగమూర్తి, బండ్ల తిరుమలాదేవి, అరుణ్, బండ్ల బాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీరామ లింగేశ్వర దేవస్థానానికి వెండికిరీటం బహూకరణ

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్వామి కృపకు పాత్రుడిని కావడం ఆనందంగా ఉందని సత్య హరిశ్చంద్ర కళాకారులు దుబ్బు వెంకట సుబ్బారావు మనువడు జూనియర్ సుబ్బారావు అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని రామన్నపేటలో వేంచేసి ఉన్న శ్రీరామ లింగేశ్వర దేవస్థానానికి 115 గ్రాముల వెండి కిరీటాన్ని సుబ్బారావు బహూకరించారు. సుమారు రూ.15వేలు విలువైన కిరీటాన్ని మహాశివరాత్రి రోజున అలంకరించాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మౌనిక, ఆదర్శ్, శాన్విక, ఆలయ ఈవో పోతిని శ్రీనివాసరావు, కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


కమిటీ ప్రతినిధులకు వెండి కిరీటాన్ని బహూకరిస్తున్న జూనియర్ సుబ్బారావు


మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

బాలికలు ఉన్నత చదువులతో ఎదగాలి

బల్లికురవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలికలు పదో తరగతితో చదువు మానుకోకుండా ఉన్నత చదువులతో భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని తహసీల్దార్ రవినాయక్ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో బాలికలకు ఉన్నత చదువులు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, సీడీపీవో సుధ, కేజీబీవీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సరళాకుమారి, సుధాకర్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి హరిహరన్‌రెడ్డి అవగాహన కల్పించారు.

రైల్వే గేటు మూసివేత

చీరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రైల్వే లైన్ మరమ్మతుల నేపథ్యంలో చీరాల ఫైర్ స్టేషన్ సమీపంలోని రైల్వే గేటు తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపాలరు. మంగళవారం ఉదయం నుంచి మార్చి 2వ తేదీ వరకు ఈ అంతరాయం ఉంటుందని, అనంతరం యథావిధిగా సేవలు అందుతాయని, ప్రజలు సహకరించాలని కోరారు.

యూపీహెచ్‌సీకి వీల్‌చైర్ అందజేత


వీల్ చైర్‌ను అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాథమిక హెల్త్ సెంటర్‌కు వీల్ చైర్‌ను అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు గోరంట్ల లక్ష్మీనారాయణ మాస్టర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వంశీ సౌజన్యంతో అద్దంకిలో గాజులపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో రోగుల సౌకర్యార్థం వీల్‌చైర్‌ను డాక్టర్ గొట్టిపాటి జయసింహకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీ రయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, అన్నంగి సుబ్బారావు, అంజాద్ బాషా, గోరంట్ల వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అక్రమ అమ్మకాలపై చర్యలు

చీరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం నిల్వ చేసినా, అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని తోటవారిపాలెంలో దాడులు నిర్వహించారు. ఈక్రమంలో ఒక వ్యక్తి వద్ద 2లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గవినివారిపాలెంలో కూడా దాడులు చేసి 8 మద్యం సీసాలు ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సాగర్ కాలువలో యువకుడి గల్లంతు

గాలింపు చర్యలు ప్రారంభించిన బంధువులు

బల్లికురవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన గుంటుపల్లి అయ్యప్ప అనే యువకుడు ఆదివారం గుంటూరు జిల్లా పరిధిలో సాగర్ కాలవలో ఈతకు దిగి నీటి ప్రవాహానికి కొట్టుకు పోయాడు. దీంతో బంధువులు యువకుడి గాలింపు కోసం సోమవారం వెళ్లారు. అందిన సమాచారం మేరకు.. ముక్తేశ్వరం గ్రామానికి చెందిన గుంటుపల్లి అయ్యప్ప నర్సారావుపేటలో బేల్దారి పనులకు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. ఆదివారం సరదాగా మిత్రులతో కలిసి అడిగొప్పుల అమ్మవారిని దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా రోడ్డు పక్కన నీటిని చూసి ఈత కోసం సాగర్ కాలవలోకి దిగాడు. కాలవలోకి దిగిన అయ్యప్ప నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. మిత్రుల ద్వారా సమాచారం తెలుసుకున్న బంధువులు రెండు రోజుల నుంచి వెతుకులాట ప్రారంభించారు. సుమారు 20 మంది వరకు యువకుడి ఆచూకీ కోసం వెళ్లారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం చెందిన ఘటన సోమవారం వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ (26) గతకొంత కాలంగా అనారోగ సమస్యలతో సతమతమవతున్నాడు. ఈనేపథ్యంలో మృతికి పాల్పడినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు ఆహ్వానం

చీరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతున్నట్లు ప్రిన్సిపాల్ జె సరళ సోమవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆసక్తి కలిగిన విద్యార్థులు 24వ తేదీ నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరములకు 949494 6770, 9100 6070 80 నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి

చినగంజాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : బాలలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగిఉండాలని లోక్ అదాలత్ కమిటీ మెంబరు, న్యాయవాది అసోది రామకృష్ణారెడ్డి అన్నారు. చీరాల లోక్ అదాలత్ ఛైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పెదగంజాం, ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం, ఆవులదొడ్డిపాతగొల్లపాలెం, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యా రంగంలో అభివృద్ధి చెందాలంటే ఆరోగ్యంగా ఉండాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.సాయిశ్రీచరణ్ విద్యార్థులకు సూచించారు. ఆయా పాఠశాలల్లోని 220 మంది విద్యార్థులకు ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు అందజేశారు. బాల కార్మిక వ్యవస్థను అరికట్టవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రామకృష్ణారెడ్డి అన్నారు. విద్యార్థులకు చెందాల్సిన హక్కులు, బాల్య వివాహాలు, వరకట్నం, ఆస్తిహక్కులు, లైగింగ వేధింపులు, గృహ హత్యలు, విద్య యొక్క ప్రాముఖ్యత తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చినగంజాం పీ.హెచ్‌సీ. వీహెచ్ఎన్ స్వర్ణలత, హె.వీ. ఉల్దారాణి, 104 డీఈవో పొదిలి రాఘవ, సీ.హెచ్.వో ప్రశాంతి, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మండల పార లీగల్ వలంటీర్ ఎం.వీ.రామారావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బాలల హక్కులను వివరిస్తున్న న్యాయవాది రామకృష్ణారెడ్డి

తిరిగొద్దాం.. తెలుసుకుందాం!

● విద్యార్థులకు ఆటవిడుపుగా విహారయాత్రలు - 6లో



బర్డ్ ఫ్లూ... భయమేదీ!?

● కోళ్ల ఫారాలలో కానరాని జాగ్రత్తలు ● దుర్వాసన, ఈగల బెడదతో ప్రజలు



మర్రిపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగురాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ విజృంభిస్తోంది. వ్యాధి దాటికి వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తుండటంలో ప్రజలు వ్యక్తగత శుభ్రతను పాటిస్తున్నారు. వ్యాధికి సోకకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే వ్యాధికి కారణమయ్యే కోళ్ల ఫారాల వద్ద మాత్రం ఎలాంటి జాగ్రతలు, శుభ్రత, నిబంధనలు యజమానులు పాటిం చడం లేదు. మర్రిపాడు మండలం కృష్ణాపురం సెంటర్ సమీపంలోనూ, బ్రాహ్మణపల్లిలోని జాతీయ రహదారికి పక్కనే కోళ్ల ఫారాలు ఉన్నాయి. కోడిమాంసం దుకాణాల వద్ద తీసుకుంటున్న చిన్నపాటి జాగ్రతలు కూడా ఇక్కడ కరువ య్యాయి. దీంతో పరిసరప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫారాల్లో నెలలు తరబడి పేరుకుపోయిన కోళ్ల వ్యర్థాలతో కిలోమీటరు దూరం దుర్వాసన వెదజల్లుతోంది. కోళ్ళ, గుడ్లు కొనుగోలు చేసేం దుకు నిత్యం ఇతర ప్రాంతాల నుంచి పౌల్ట్రీఫామ్‌లకు వ్యాపారులు వస్తుంటారు. వారు ఏయే ప్రాంతాల్లో కోళ్ల ఫామ్‌లలో తిరుగుతూ వస్తున్నారో? ప్రాథమిక జాగ్రతలను సైతం పాటించక పోగా, శానిటేషన్ చర్యలు తీసుకోవడంలేదు. చుట్టూ ఈగలమోతతో పెగళ్లపాడు, బూదవాడ, కృష్ణాపురం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణాపురం బస్టాండ్ సెంటర్ ప్రాంతంలోని దుకాణాలకు వివిధ గ్రామాల నుంచి వస్తున్న ప్రజలు సైతం ఈగల బెడదతో తట్టుకోలేకపోతున్నారు. ఆ ప్రాంతంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో వందలాది మంది చదువుకుంటున్నారు. వారు కూడా దుర్వాసన, ఈగలతో ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, చర్యలకు రాజకీయ ఒత్తిళ్లు అడ్డువస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



పౌల్ట్రీ ఫామ్‌లో పేరుకుపోయిన కోళ్ల వ్యర్థాలు



ఫామ్‌లో ఉన్న కోళ్లు



శేష వాహనంపై ముక్కంటి వైభోగం!

ఆశేష భక్తజనం నడుమ మూలస్థానేశ్వరుడు శేషవాహనంపై కొలువుదీరి కనువిందైన దర్శనం ఇచ్చాడు. నగరంలోని మూలాపేట మూల స్థానేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు జరిగాయి. అనంతరం చప్పర ఉత్సవం జరిగింది. సాయంత్రం మూలస్థానేశ్వరస్వామి, భువనేశ్వరి అమ్మవార్లకు కుంభ హారతులు, విశేష పుష్పాలంకరణలు జరిగాయి. అనంతరం స్వామివారు శేషవాహనంపై కొలువుదీరి విహరించారు. ఈ కార్యక్రమాలను ఉభయదాతలు, ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

బంకుల్లో బురిడీ!

● పెట్రోలు, డీజిల్ విక్రయాల్లో మాయాజాలం
● నిబంధనలకు నీళ్లొదిలిన నిర్వాహకులు
● విజిలెన్స్ తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి
● లీటరుకు 40 మి.లీ తేడా గుర్తించిన అధికారులు
● రూ.32.77 లక్షల విలువైన ఇంధనం సీజ్
● సివిల్ సప్లయిస్ శాఖపై విమర్శల వెల్లువ

నెల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బతుకుబండి నడవాలంటే అందులో పెట్రోల్, డీజిల్ అత్యవసరం. ఈ రెండు రకాల ఇంధనం లేకపోతే సాధారణ జీవనాన్ని ఊహించలేం. అటువంటి పెట్రోల్, డీజిల్ మాటున వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. పెట్రోల్ బంకుల యజమానులు నిబంధనలకు నీళ్లొదులుతూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. వీరి అక్రమాలను అరికట్టాల్సిన సివిల్ సప్లయిస్, తూనికల కొలతల శాఖలు మామూళ్ల మత్తులో ఊగుతున్నా యన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా విజిలెన్స్ విభాగం అధికారులు పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న మోసా లను బయటపెట్టేందుకు పూనుకున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులను వెంటబెట్టుకొని జిల్లావ్యాప్తంగా కొన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అనేక మోసాలు బయటపడ్డాయి. మూడు బృందాలుగా ఏర్పడిన అధికారులు ఏడు ఫిల్లింగ్ స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. అందులో నాలుగు బంకుల్లో అవకతవకలు గుర్తించారు. మూడు బంకులపై 6 (ఏ) కేసులు నమోదు చేయగా మరో బంకుపై తూనికలు, కొలతల చట్టం ప్రకారం కేసు నమో దు చేశారు. కుందుకూరులోని ఓ ఫిల్లింగ్ స్టేషన్ లో లీటర్ పెట్రోల్‌ను శాంపిల్ తీసుకొని కొలత వేయగా 40 ఎం.ఎల్ తగ్గినట్లు గుర్తించారు. బుచ్చి సమీపంలోని రేబాల వద్దనున్న మరో పెట్రోల్ బంకు, ముత్తుకూరులోని మరో బంకులో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించడం లేదని తేల్చారు. ప్రభుత్వ నిబం ధనల ప్రకారం ఒకరు ఫిల్లింగ్ స్టేషన్‌కు లైసెన్స్ పొందగా, మరొకరు ఆపరేట్ చేస్తున్నట్లు విజిలెన్స్ అధికా రులు గుర్తించారు. ప్రతి బంకులోనూ ఉచిత ఎయిర్ మిషన్లను ఉంచాల్సి ఉండగా కొన్నిచోట్ల అవి పని చేయడం లేదు. అలాగే కార్మిక శాఖకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదు. ధరలు, సైన్ బోర్డులు, ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయలేదు. కొన్ని బంకుల్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవు. మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించడం లేదు. చాలా చోట్ల పేలుడు నియమాలకు సంబంధించిన బోర్డులు ప్రదర్శించలేదని తనిఖీల్లో గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు జరుపుతుండటంతో రూ.32.77 లక్షల విలువైన 14,503 లీటర్ల పెట్రోల్, 14,585 లీటర్ల డీజిల్, 561 లీటర్ల 2టీ ఆయిల్‌ను అధికారులు సీజ్ చేశారు.

తనిఖీలు మరిచిన అధికారులు

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు అమలుపై తనిఖీ చేయాల్సిన బాధ్యత సివిల్ సప్లయిస్ శాఖ అధికారులదే. అలానే రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహిస్తూ ఆయిల్‌లో కొలతలు సరిగ్గా ఉన్నాయా? లేదా? అన్నది తూనికలు, కొలతల శాఖ అధికా రులు పరిశీలించాల్సి ఉంది. అయితే ఈ రెండు శాఖలు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి నెలా మామూళ్లు తీసుకుంటూ పెట్రోల్ బంకులకు వెళ్లకుండానే వెళ్లినట్లుగా రికార్డుల్లో సంతకాలు చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇటీవల కొత్త పెట్రోల్ బంకులకు అనుమతులు ఇచ్చే వ్యవహారంలో జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయంలో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అయితే వారు ఈ ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోలేదన్న విమ ర్శలున్నాయి. ఇటీవల కలెక్టర్ పలువురు జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. అందులో సివిల్ సప్లయిస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కూడా ఉన్నారు. కానీ అక్కడ పనిచేస్తున్న ఓ అధికారి సదరు ఉద్యోగిని బదిలీ చేసేందుకు ఇష్టపడలేదు. పెట్రోల్ బంకుల యజమానులను మేనేజ్ చేయడంలో ఈ ఉద్యోగి దిట్ట అని, అందుకే సదరు ఉద్యోగిని పంపకుండా అంటిపెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో కీలకమైన సివిల్ సప్లయిస్ విభాగానికి గడిచిన రెండు నెలలుగా రెగ్యులర్ అధికారి లేరు. అక్కడ పనిచేస్తున్న అధికారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం గమనార్హం.



పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

'అగ్రిగోల్డ్' ఆస్తులు అమ్మి.. డిపాజిటర్లకు చెల్లించండి

కలెక్టరేట్ ఎదుట సీపీఐ, అగ్రిగోల్డ్ బాధితుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు, అగ్రిగోల్డ్ బాధితులు

అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి డిపాజిట్‌దారులకు కూటమి ప్రభుత్వం సొమ్ము చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద డిపాజిటర్లతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నా యుడు కూడా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అయితే అది నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. వరికుంటపాడు, ఉద యగిరి, కలిగిరి, దుత్తలూరు తదితర ప్రాంతాల్లో అగ్రిగోల్డ్ భూము లు ఉన్నాయన్నారు. వాటిలో జామాయిల్, ఎర్రచందనం వంటి విలు వైన కలప ఉందని పేర్కొన్నారు. వాటిని దుండగుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్‌కు ఉన్న ఆస్తులను అమ్మకానికి పెట్టి డిపా జిటర్లను ఆదుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు ఓ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. ఈ నిరసనలో సీపీఐ జిల్లా నాయకులు దామా అంకయ్య, మాలకొండయ్య, అసోసియేషన్ నేతలు రాందాస్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)

శివాలయాలకు నిరంతర విద్యుత్ : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 26న జిల్లాలోని అన్ని శివాలయాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ అధికా రులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయం నుంచి ఏఈలు, ఏడీలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎక్కడా సమస్యలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే శివాలయాల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఏర్పడితే టోల్‌ఫ్రీ నెం.1912కు భక్తులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఈ సమావేశంలో ఈఈలు శ్రీధర్, శేషాద్రి బాల చంద్ర, సోమశేఖర్‌రెడ్డి, విజిలెన్సు విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేవూరు రైతులు, వైసీపీ నాయకులు

బీపీసీఎల్‌కి భూములు ఇవ్వం!

కలెక్టర్‌కు తేల్చి చెప్పిన చేవూరు గ్రామస్థులు

కందుకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి ప్రమాదకారి బీపీసీఎల్ సంస్థకు భూము లు ఇవ్వమని గుడ్లూరు మండలం చేవూరు రైతులు తేల్చి చెప్పారు. నెల్లూరులో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ ఓ ఆనంద్‌ను వారు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇండోసోల్ కంపెనీకి గ్రామస్థుల నుంచి భూములు సేకరించి ఇప్పుడు ఆ భూములు బీపీసీఎల్‌కు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నా మంటూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. 1300 ఎకరాల భూములకు కొన్ని వర్గాల రైతులకు పరిహారం కూడా అందిందన్నారు. అయితే, ఇండోసోలార్ ప్రాజెక్టు కోసం గ్రామసభలు నిర్వహించి వాతావరణ కాలుష్యం ఉండదని ఒప్పించి భూములు తీసుకున్నారని, ఇప్పుడు బీపీసీఎల్‌కు కట్టబెడితే పూర్తిగా వాతావరణం కాలుష్యమై గ్రామీన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. చేవూరు రైతులు, గ్రామస్థులతోపాటు వైసీపీ నాయకులు కిషోర్, పాశం కొండయ్య తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పొణకా కనకమ్మ ఆస్తులను పరిరక్షించాలి

● నెల్లూరులో కేంద్ర మహిళా వర్సిటీ ఏర్పాటు చేయాలి
● మార్చి 4న హైదరాబాద్‌లో కనకమ్మ, రామిరెడ్డి జయంత్యుత్సవాల సభ
● కనకమ్మ ఆశయ సాధన సమితి కార్యదర్శి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు పొణకా కనకమ్మ, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి జయంత్యుత్సవాలను మార్చి 4న హైదరాబాద్ అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కనకమ్మ ఆశయ సాధన సమితి ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ప్రముఖ రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పీ. వేణుగోపాలరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. కవికోకిల దువ్వూరి విజ్ఞాన సమితి, పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి ప్రతినిధులు సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకుడు సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయోద్యమ సమయంలో పొణకా కనకమ్మ కుటుంబ ఆస్తితో పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం నెలకొల్పడంతోపాటు బాలికా విద్యను ప్రోత్సహించడానికి నెల్లూరులో పాఠశాలలు, వసతి గృహాలు ఉచితంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఈనాడు ఆ ఆస్తుల విలువ రూ.2,500 కోట్లకు చేరినట్టు చెప్పారు. అయితే, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం స్వీకరించాలని కోరారు. నిస్వార్థంగా సామాజ శ్రేయస్సు కోసం నెల్లూరులోని 20 ఎకరాల విస్తీర్ణంలో కనకమ్మ నెలకొల్పిన కస్తూరిదేవి ఉచిత పాఠశాల, పారిశ్రామిక విద్యాలయం స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారుల నుంచి ఆ భూమిని కాపాడడంతో పాటు ఆ స్థలంలో కేంద్ర మహిళా విశ్వవిద్యాలయం నెలకొల్పాలని ప్రభుతాన్ని కోరారు. పినాకిని ఆశ్రమ స్థలంలో మహిళా వర్సిటీ అనుబంధ పోస్టు గ్రాడ్యుయేషన్ కేంద్రంతోపాటు డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. మహిళా వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన నిధులను సమకూర్చడానికి పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. అబిడ్స్ రెడ్డి హాస్టల్ ప్రాంగణంలో కనకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు పొణకా కనకమ్మ-జమీన్ రైతు పత్రిక స్మారక పురస్కారాన్ని సీఎం చేతుల మీదగా ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య వైబీ సత్యనారాయణ, వాగ్దేవ చినవీరభద్రుడు, విశ్రాంత ఐఏఎస్ పి.రవికుమార్, రైతు సంఘం నాయకుడు చుండూరు రంగారావును పురస్కారాలతో సత్కరిస్తున్నట్టు ఆయన వివరించారు.



పొణకా కనకమ్మ, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి జయంత్యుత్సవ సభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పాశం యాదగిరి, కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్.ఎన్ రెడ్డి, సుబ్రహ్మణ్యరెడ్డి, కొల్లూరి సత్తయ్య

సాహసం చేయరా డింభకా!

నెల్లూరు నగరం రోజురోజుకు అభివృద్ధి చెందుతుండగా, అదేస్థాయిలో ట్రాఫిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయి.నగరంలో వాహనాల రాకపోకలు పెరుగుతుండగా, రోడ్డు దాటాలంటేనే చిన్నారులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా పొదలకూరు రోడ్డులోని సారా అంగడి సెంటర్‌లో విద్యార్థులు తాడు సాయంతో ఒకరినొకరు పట్టుకుని రహదారి దాటుతున్నారు. ట్రంకురోడ్డులో కూడా సూచిక బోర్డులు లేకపోవడంతో ఏక్షణాన ఏమి జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గుంపులు, గుంపులుగా రోడ్డు దాటేస్తున్నారు. ట్రాఫిక్ ఉన్న చోట్ల జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు. అలాగే రద్దీ సమయంలో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్


పొదలకూరు రోడ్డులో తాడు సాయంతో రోడ్డు దాటుతున్న విద్యార్థులు


వాహనాలను తప్పించుకుంటూ డివైడర్ బండలపై నుంచి రోడ్డు దాటుతున్న ప్రజలు


వాహనాల మధ్యలో రోడ్డు అవతలికి వెళుతున్న ఓ విద్యార్థిని

రిక్షా బండ్లు ఇలా...
చెత్త సేకరణ ఎలా...?



స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామ పంచాయతీల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది. ఇందుకోసం శని, ఆదివారాల్లో రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ కూడా చేపట్టింది. అయితే కలువాయి మేజర్ పంచాయతీకి గతంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రిక్షా బండ్లు ఇచ్చింది. సంబంధిత అధికారులు వాటిని వినియోగించక పోయినా, కనీసం భద్రపరచకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో అవి వర్షానికి తడచి.. ఎండకు ఎండి తుప్పు పట్టి పనికి రాకుండా పోయాయి. వీటితో పాటు ఒక మినీ లారీ కూడా నిరుపయోగంగా ఉంది. ఈనేపథ్యంలో మేజర్ గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ ఎలా జరుగుతుందో అధికారులకే తెలియాలి.

- కలువాయి,(ఆంధ్రజ్యోతి)

ఎడ్లు పెంచాలని.. రాష్ట్రస్థాయిలో నిలవాలని..!

- వ్యవసాయ కుటుంబంలోని ఓ సాఫ్ట్‌వేర్ ఆకాంక్ష
- రూ.1.8 లక్షలకు రెండు కోడెదూడల కొనుగోలు
- వాటి పోషణపై ప్రత్యేక శ్రద్ధ
- బండ లాగుడు పోటీలకు పొరుగు జిల్లాలో శిక్షణ

వ్యవసాయం అన్నా, పశువుల పెంపకం అన్నా ఆ యువకుడికి మహాఇష్టం. చేస్తున్నది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అయినా తన అభిరుచి మేరకు రూ.1.8 లక్షలు వెచ్చించి రెండు కోడెదూడలను కొనుగోలు చేశారు. వాటికి పోషకాలు కలిగిన ఆహారం అందించడంతోపాటు వాటి బాగోలు చూసేందుకు నెలవారి జీతంతో ఓ వ్యక్తిని నియమించారు. అంతేకా దండోయ్.. రాష్ట్రస్థాయి ఎడ్లపందేలలో ప్రథమ స్థానం సాధించేందుకు ఆ ఎడ్లకు పొరుగు జిల్లాలో శిక్షణ కూడా ఇప్పిస్తున్నాడు. ఆ వివరాల్లోకి వెళితే..


తాను పెంచుతున్న ఒంగోలుజాతి ఎడ్లతో బుధవరపు ప్రతాప్

పొదలకూరు మండలం ముత్యాలపేట గ్రామానికి చెందిన బుధవరపు ప్రతాప్‌ది వ్యవసాయ కుటుంబం. బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని పీహెచ్ఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కరోనా సమయంలో వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా ఇంటి నుంచే చేస్తున్నాడు. తాత, తండ్రుల నుంచి వస్తున్న ఎడ్ల పెంపకంపై ఆసక్తి కలిగింది. ఒంగోలు జాతికి చెందిన కోడెలు కొనుగోలు చేసి పెంచాలని భావించి తన తండ్రి పెంచలయ్యతో చెప్పాడు. ఆయన సహకారంతో మూడేళ్ల క్రితం వెంకటాచలం మండలం సర్వేపల్లిలో 8 నెలల వయసున్న దూడను రూ.80 వేలకు, అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏడాది వయసున్న దూడను రూ.లక్ష వెచ్చించి కొనుగోలు చేశారు. ఆ దూడలకు రాముడు, భీముడు అని పేర్లు పెట్టి పెంచాడు. వాటి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ ఆలనా పాలనకు నెల జీతం ఇచ్చి ఓ మనిషిని కూడా ఏర్పాటు చేశాడు. అంతేకాదు.. వాటి పోషణకు నిత్యం రూ.2వేలు వరకు ఖర్చు చేస్తున్నాడు. పశుగ్రాసంతోపాటు ఉలవలు, జొన్నలు కూడా ఆహారంగా ఇస్తున్నారు. పశువైద్యుల సలహాల మేరకు వాటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

పోటీల కోసం ప్రత్యేక శిక్షణ

రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీల్లో తన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలవాలన్న ఉద్దేశంతో ప్రతాప్ రాముడు, భీముడుకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాడు. ఇందుకోసం నెలకు రూ.30 వేలు వెచ్చించి కడప జిల్లా చెన్నూరులో నెల కిందటే శిక్షకుడి వద్ద వదిలిపెట్టినట్లు ప్రతాప్ తెలిపారు. 'ప్రతి నిత్యం వాటిని వీడియోల్లో చూసుకుంటూ శిక్షణకు ఎలా సహకరిస్తున్నాయో తెలుసుకుంటున్నాను. నా ఎడ్ల గురించి తెలిసిన కొందరు రైతులు మంచి ధరకు కొనుగోలు చేస్తామని ముందుకొచ్చినా ఇవ్వలేదు. బండ లాగుడు పోటీల్లో అవి ప్రథమ స్థానంలో నిలిచేలా చేయడమే నా ధ్యేయం' అని ప్రతాప్ చెప్పుకొచ్చారు.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు



ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని
విరమించుకోవాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

కావలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాల్లో ఆప్కాస్‌ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు మల్లె అంకయ్య, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ఆ స్థానంలో ప్రయివేట్ ఏజెన్సీలను పెడతామని మంత్రివర్గ సమావేశంలో కూటమి ప్రభుత్వం నిర్ణయంచటంతో ఆప్కాస్‌ని కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. అలా చేస్తే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందన్నారు. న్యాయమైన మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే ఛలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు జే.నాగరాజు, దమ్ము దర్గాబాబు, రవిబాబు,క్రిషోర్, కొండయ్య పాల్గొన్నారు.

● పోస్ట్‌కార్డు ఉద్యమం

కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి):ఆప్కాస్ రద్దు, ప్రైవేట్ ఏజెన్సీ వద్దంటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సీఐటియు ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రికి రాసిన పోస్ట్‌కార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సీఐటీయు గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచులయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, తురకా శీనయ్య, బాబు, మహేష్, రమేష్ రాజ్యలక్ష్మీ, జ్యోతి, పరుసు చిన్నమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్లలేని పేదలందరికీ పీఎంఏవై -2.0 పథకం ద్వారా గృహాలు అందజేసేందుకు అర్హుల సర్వేను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలు నుంచి సోమవారం హౌసింగ్, ఉపాధి హామీ, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల లేని పేదలు ఎవరూ ఉండకూడదనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున గృహాలు మంజూరు చేస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్హత ఉండి ఇల్లులేని పేదల ఎంపిక కోసం సర్వేను త్వరితగతిన పూర్తిచేసి నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే ఉపాధి పనులను వేగవంతం చేసి, రోజూ లక్ష పనిదినాలు కల్పించేలా ఎంపీడీవో,ఏపీవోలు ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీరోడ్లు, మినీ గోకులా లను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఆధార్ లేని గిరిజనులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందచేసి, ఆధార్‌కార్డులు వచ్చేలా చూడాలన్నారు. సోలార్ విద్యుత్‌పై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ కే. కార్తీక్, జడ్పీ సీఈవో విద్యారమ, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవానీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు విజయన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్



మల్లన్నకు మృగరాజ
వాహన సేవలు

కావలి టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతూరులోని రుద్రపాద క్షేత్రంలోని దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారికి సోమవారం మృగరాజ వాహన సేవలందించారు. శివాలయ ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. కుంభమాస తిరునాళ్లలో భాగంగా మల్లన్నకు ప్రత్యేక చేశారు. గ్రామోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమంలో రాజమండ్రి వాస్తవ్యులు బబూరావు బృందం సభ్యులు దక్షయజ్ఞం బుర్రకథ కాలక్షేపం చేపట్టారు.

ఐటీడీఏ పీవోగా మల్లికార్జున్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జున్‌రెడ్డి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు ఆఫీసర్ (పీవో)గా మల్లికార్జున్‌రెడ్డి సోమవారం నెల్లూరు నగరంలోని ఐటీడీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర కార్యాలయంలో జేడీగా పని చేశారు. ఏడీగా పదోన్నతి పొంది నెల్లూరులో ఐటీడీఏ పీవోగా నియమితులయ్యారు.

ఇంటర్ పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ!

● చీఫ్ సూపరింటెండెంట్ వాసు


ప్రశ్నపత్రాలను పెట్టెల్లో భద్రపరుస్తున్న అధికారులు

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 1 నుంచి 16వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులు అర్థగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించరని చీఫ్ సూపరింటెండెంట్ ఎం వాసు, డిపార్టుమెంట్ అధికారిణి జమున పేర్కొన్నారు. సోమవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 700 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. పరీక్షా కేంద్రంలో అన్ని వసతులు కల్పించామన్నారు. 14 గదులు ఏర్పాటు చేసి 15 మంది ఇన్విజిలేటర్లను నియమించా మన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కాగా, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. దీంతో పరీక్షల నిర్వహణాధికారులు వాటిని పరిశీలించి ప్రత్యేక పెట్టెల్లో ఉంచి సీల్ వేసి స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

సొసైటీల ద్వారా
ధాన్యం కొనుగోలు

● దామరమడుగు కేంద్రాన్ని పరిశీలించిన జేసీ కార్తీక్

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని జేసీ సీహెచ్ కార్తీక్ తెలిపారు. సోమవారం ఆయన దామరమడుగు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు, దాచుకునేందుకు గోడౌన్‌లు లేక, రోడ్లమీద ఆరబోసుకోలేని ఇబ్బందులు పడుతున్నామని రైతులు జేసీ ఎదుట ఏకరువుపెట్టారు. ఈ సమస్యలతోనే నష్టమైనా దళారులు, మిల్లర్లకు విక్రయించేందుకు మొగ్గు చూతున్నామని తెలిపారు. దీంతో జేసీ వెంటనే కొనుగోలు కేంద్రాల్లో గోతాలు, ఏర్పాటుతోపాటు తేమ పరికరాలు సిద్ధం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సొసైటీ అధికారులు, కేంద్రాల్లో సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీసీవో గుర్రప్ప, తహసీల్దారు వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, సివిల్ సప్లైస్ డీటీ మల్లికార్జున, సొసైటీ సీఈవో ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

తిరిగొద్దాం..
తెలుసుకుందాం!

- ఆటవిడుపుగా విహారయాత్రలు
- జిల్లాలో 249 మంది ప్రభుత్వ విద్యార్థులకు అవకాశం
- వారి భద్రత కోసం ఉపాధ్యాయులూ ఎంపిక
- నిధులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలకంటే, క్షేత్రస్థాయిలో విద్యార్థులు గమనించే అంశాలే వారిపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. అందుకే ప్రభుత్వం వారిని అప్పుడప్పుడూ విహార, విజ్ఞాన యాత్రలకు పంపుతూ ఉంటుంది. అయితే గత ఐదేళ్ల పాలనలో గాడితప్పిన ఈ ప్రక్రియ తిరిగి జీవం పోసుకుంటోంది. కూటమి ప్రభుత్వం ఈ యాత్రలను పట్టాలెక్కించేందుకు సంకల్పించడంతోపాటు విధివిధానాలను రూపొందించి, నిధులు సైతం విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా జిల్లాలో 249 మంది విద్యార్థులతోపాటు 56 మంది ఉపాధ్యాయులు విహార యాత్రకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

● ఆటవిడుపుగా..

ఈ యాత్రలతో తరగతి గదుల్లో చదువులకే పరిమితమైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కాస్తంత ఆటవిడుపు లభించనుంది. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షలు కూడా పర్యటనకు సన్నాహాలు చేస్తున్నాయి. జిల్లాలో ప్రాథమిక స్థాయిలో 146 మంది విద్యార్థులను ఎంపిక చేసి, వీరిని రాష్ట్రం లేదా ఇతర జిల్లాల్లో స్టడీ ట్రిప్ కోసం ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఒక్కో విద్యార్థికి రూ.200 చొప్పున 29,200 కేటాయించింది. ఒకవేళ ఇతర రాష్ట్రంలో పర్యటన కేటాయిస్తే వీరికి రూ.2,92,000 నిధులు కేటాయిస్తామని రాష్ట్రస్థాయి అధికారులు ప్రకటించారు. అలాగే సెకండరీ స్థాయిలో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నవారిలో 33 మంది బాలురు, 70 మంది బాలికలు మొత్తం 103 మందిని ఎంపిక చేయనున్నారు. వీరితోపాటు 33 మంది టీచర్లు, 21 మంది గైడ్ టీచర్లు, సమగ్రశిక్ష ఏఎంవో, జిల్లా సైన్స్ అధికారి కలిపి 159 మంది విహారయాత్రకు వెళ్లనున్నారు. ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున రాష్ట్ర పరిధిలో అయితే 3,18,000, ఇతర రాష్ట్రం అయితే రూ.6,36,000 కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 25వ తేదీలోపు విద్యార్థుల ఎంపికను పూర్తి చేసి నివేదికలు అందచేయాలని సూచించడంతో అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.



● ప్రతిపాదనలు సిద్ధం

ప్రాథమిక పాఠశాల పిల్లలను జిల్లాలోని ప్రసిద్ధి ప్రాంతాలకు తీసుకెళ్లడమా!? లేదా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడమా...? అనే అంశంపై సమీక్షలు నిర్వహి స్తున్నారు. అలాగే సెకండరీ స్థాయి లో విద్యార్థులను కూడా రాష్ట్రంలోని ఏయే ప్రాంతాలకు తీసుకెళ్లాలి, లేదా పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక లేదా తెలంగాణ ప్రాంతాల్లోని ప్రసిద్ధ ప్రాంతాలకు తీసుకెళ్లాలా? అనే విషయమై చర్చిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులతో విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ సరిపోయాలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ యాత్రలు విద్యార్థుల మదిలో స్థిరస్థాయిగా నిలిచిపోవాలని, వారిలో మరింత విజ్ఞానం పెరిగేలా పర్యటన ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలియచేశారు.


పడమటిపాళెంలో హెల్త్‌క్లీనిక్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

ప్రధానమంత్రి టీబీ ముక్త పంచాయతీలుగా పడమటిపాళెం, జంగాలకండ్రిక ఎంపిక

● అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

సంగం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి టీబీ ముక్త పంచాయతీలుగా మండలంలోని పడమటిపాళెం, జంగాలకండ్రిక ఎంపికయ్యాయని అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆ గ్రామాలను సందర్శించి హెల్త్ క్లీనిక్ రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన టీబీ పరీక్షలు, చికిత్స పూర్తి చేయడం, రోగులకు పోషకాహార నిమిత్తం వారి ఖాతాకు నెలకు రూ. 500 చొప్పున జమ చేయడం, క్రమం తప్పకుండా మందులు వాడడం, పోషకాహారంతో కూడిన ఫుడ్ బాస్కెట్లు ఇవ్వడం వంటి కార్యక్రమాలు నూరు శాతం పూర్తి చేసినందున ఈ రెండు పంచాయతీలు పధానమంత్రి టీబీ ముక్త పంచాయతీలుగా ఎంపికయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శ్రీశైలం తరలిన భక్తులు

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణంపల్లి గ్రామానికి చెందిన పలువురు శివమాల ధరించిన భక్తులు సోమవారం ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం తరలివెళ్లారు. మండలం రోజుల పాటు కఠోర దీక్షబూని వారు ఉదయగిరి పార్వతీ పరమేశ్వరాలయంలో విశేష పూజల అనంతరం ఇరుముడి ధరించి తరలివెళ్లారు.

సంసిద్ధత మేళా ప్రారంభం

కావలి టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో ఎంపీడీవో పాల్గొని పాఠశాల సంసిద్ధత మేళాను ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అంగన్‌వాడీలు తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 గోవిందయ్య, ఎంఈవో-2, వెంకటసుబ్బయ్య, రిసోర్స్‌పర్సన్లు మధుసూదన్‌రావు, సుహాసిని పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచన పెరగాలి

కావలి టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ ఆలోచన విధానాలు పెంచుకోవాలని మండల విద్యాధికారి గోవిందయ్య తెలిపారు. జేవీవీ ఆధ్వర్యంలో సోమవారం రెడ్‌క్రాస్ భవనంలో క్విజ్ పోటీలు సంఘం అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగాయి. ముఖ్యఅతిథిగా గోవిందయ్య పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో 20పాఠశాలల నుంచి 60మంది సీనియర్స్ విభాగంలో 19పాఠశాలల నుంచి 57మంది పాల్గొన్నారు. రామకృష్ణ, రమణయ్య, జిలాని, సత్యనారాయణలు మాస్టర్లుగా వ్యవహరించారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

అల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేటలోని షిర్డీసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ చేపట్టి 17ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు కార్తీక్ శర్మ, సుబ్బారావు శర్మల ఆధ్వర్యంలో చేపట్టిన పూజల్లో మహిళలు పూజ సామగ్రితో పాల్గొన్నారు. వ్రతం అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు.

రుణాలకు ఇంటర్వ్యూలు

కావలి రూరల్, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయంలో బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులకు సోమవారం బ్యాంకర్లతో ఇంటర్వ్యూలు చేపట్టారు. 629మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 356మంది దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలను బ్యాంకర్లు పరిశీలించినట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు.

అర్హులకు పింఛన్లు ఇవ్వాలి

బిట్రగుంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేయాలని వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు సోమవారం తహసీల్దారు సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ ఎం.సుజాత, జడ్పీటీసీ ఎం.కీర్తన, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్, శ్రీనివాసులు, ఎంపీటీసీలు పద్మ, సుందర్‌రాజ్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణంపై ఫిర్యాదు

సంగం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సంగం పంచాయతీలో ఓ వ్యక్తి వ్యవసాయ భూమిలో ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా ఇళ్ల నిర్మాణం చేశాడని పప్పూరి హజరత్తయ్య అనే వ్యక్తి సోమవారం గ్రీవెన్స్‌డేలో తహసీల్దారుకు ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా 252సర్వే నెంబరులోని 50అంకణాల ప్రభుత్వ భూమిని ఇతరులకు విక్రయించి వేరే పట్టా నెంబరుతో బుచ్చిరెడ్డిపాళెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరాడు.

రుణాలు చెల్లించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పొదుపు సంఘాల సభ్యులు వివిధ పథకాల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం ఖాజారంతుల్లా కోరారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో అప్పాజీతో కలిసి ఈసీ సమావేశం నిర్వహించారు. రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి నూరుశాతం రికవరీ సాధించాలన్నారు. గ్రామాల్లో జరిగే స్వచ్ఛత కార్యక్రమాల్లో పొదుపు సంఘాల సభ్యులు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కరీముల్లా, సీసీలు పాల్గొన్నారు.

పీ4 సర్వే చేపట్టాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేను సచివాలయ సిబ్బంది బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 22 నుంచి జరుగుతున్న ఈ సర్వేలో భాగంగా సిబ్బంది ప్రతి ఇంటికెళ్లి సమగ్ర వివరాలు సేకరించి నమోదు చేయాలన్నారు. మండలంలో 10206 గృహాలను సందర్శించి సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 6, 253గృహాల సర్వే పూర్తిచేశారన్నారు.

ఆర్థిక సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ మేరీ చర్చి వార్షికోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డిల సూచన మేరకు సోమవారం టీడీపీ, జనసేన నాయకులు అన్నప్రసాదానికి ఆర్థిక సాయం అందజేశారు.

'ఇటుక'ట్లు..

- అమ్మకాలు లేక నిలిచిన బట్టీల నిర్వహణ
- గతేడాది తయారు చేసిన ఇటుకలే నిలువ
- గిరాకీలేక వ్యాపారం చేయలేమంటున్న తయారీదారులు



వలేటివారిపాలెంలో అమ్మకాలు లేక నిలిచిపోయిన బట్టీలోని ఇటుకలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి, వలేటివారిపాలెం, కాకర్లవారిపాలెం, పోలినేనిచెరువు, అంకభూపాల పురం, పెదఅమ్మపాలెం, అయ్యవారిపల్లె గ్రామాల్లో ఇటుక బట్టీల యజమానులు తీవ్ర నష్టాల్లో కూరుకపోయారు. గతేడాది తీసిన ఇటుకలకు అమ్మకాలకు గిరాకీ లేకపోవడంతో వ్యాపారం చేయలేమని ఇటుక బట్టీల యజమానులు ఈ ఏడాది చేతులెత్తేశారు. దీనికితోడు బట్టీలు పెట్టేందుకు అవసరమైన పెట్టుబడులు (కూలీల రేట్లు, ఇటుకల తయారీకి అవసరమైన ముడిసరుకులు) అధికం అవడంతో ఇటుకల తయారీకి ఆసక్తి చూపడం లేదని బట్టీల యజమానులు వాపోతున్నారు. ఈ సమస్యలతో వందల కుటుబాలు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డాయి.

● ఎర్రమట్టి ఇటుకలే వినియోగం..

ఎర్ర మట్టితో తయారు చేసిన ఇటుకలను బట్టీలుగా పేర్చి కాల్చడం వల్ల ఎక్కువగా గట్టిదనం ఉంటుందని భావించి తరతరాలుగా ఈ ఇటుకలనే ఉపయోగిస్తున్నారు. పెట్టుబడులు అధికం కావడం..గిరాకీ లేక ఇటుక బట్టీల యజమానులు గతంలో వేసిన వాటిని అమ్ముకుంటే చాలు తరువాత చూద్దాం అన్న భావనలో ఉన్నారు. ఈ ఏడాది ఇటుకల బట్టీలు చేసే వారు లేరు. గతేడాది 25మంది బట్టీల యజమానులు 2కోట్ల ఇటుకలకు పైగా తయారు చేయించారు.

● తగ్గిన ధరలు..

గతంలో 2వేల ఇటుక రూ.18వేలకు అమ్మకాలు జరిపేవారు. కానీ గృహ నిర్మాణాలు చేసేవారు తగ్గిపోవడంతో ప్రస్తుతం వాటి ధర రూ.12 వేలకు పడిపోయింది. గతంలో ఇటుకలు తయారీ చేసేందుకు చీరాలు, ఒంగోలు, శింగరాయికొండ, టంగుటూరు, కందుకూరు తదితర చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వంద కుటుంబాలకు పైగా ఈ ప్రాంతానికి వచ్చేవారు. అంతేగాకుండా కాల్చిన ఇటుకలను అమ్మకాలు సమయంలో ట్రాక్టర్లలో ఇటుకలను వేసేందుకు కూలీలకు ఉపాధి దొరికేది.

● తయారీకి వాడే ముడిసరుకులు

లక్ష ఇటుకలు తయారీకి దాదాపు 80 ట్రాక్టర్లు మట్టి 20టన్నుల బొగ్గుతో పాటు కర్రలు కూడా అవసరం అవుతాయి. ఇటుకలు చేసిన తరువాత వాటిని శుద్ధి చేసి బట్టీలుగా ఏర్పరచి కాల్చిన వారం వరకూ బట్టీలకు కాపలా ఉంటారు. కూలీ రేట్లు కూడ పెరగడం పెట్టుబడులకు అప్పులు తెచ్చి పెట్టినా అసలు కూడా రాకపోవడంతో చాలా మంది ఇటుకల తయారీని నిలిపివేశారు. మూమూలుగా ప్రతి ఏడాది నవంబరు, డిసెంబరులోనే ఇటుకలు తయారీకి కూలీలు వచ్చేవారు. ఈ ఏడాది కూలీల చాయలే కనిపించలేదు.

● అమ్మకాలు తగ్గాయ్..

ఇటుకబట్టీల తయారీకి పెట్టుబడులు ఎక్కువ అవడంతో అమ్మకాలు తక్కువయ్యాయి. దీనికితోడు ప్రస్తుతం గృహ నిర్మాణాలు కట్టేవారు తక్కువ కావడంతో గతంలో వేసిన ఇటుక బట్టీలు అలాగే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న ఇటుకలు అమ్ముకుంటే చాలు. కూలీరేట్లు, పెట్టుబడులు కూడా పెరగడంతో గిట్టుబాటు కాక తీవ్ర నష్టాల్లో కూరుకపోయాం.

- పొట్టేళ పెదఅంజయ్య,
ఇటుకవ్యాపారి వలేటివారిపాలెం

పనిగట్టుకుని ఆరోపణలు చేయడం మానుకోండి

● మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

జలదంకి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కొందరు ఇతర పార్టీ నేతలు పనిగట్టుకుని టీడీపీ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచిది కాదని.. ఇప్పటికైనా ఇలాంటి ఆరోపణలు చేసేవారు ఇప్పటికైనా మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి హితవు పలికారు. సోమవారం ఆయన బ్రాహ్మణక్రాకలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై ఇటీవల కాలంలో వస్తున్న అవినీతి ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కాకర్ల సురేష్ ఎన్‌ఆర్‌ఐగా అమెరికాలో స్థిరపడిన కాకర్ల పేదలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రజల మద్దతు కూరగొని ఎమ్మెల్యే అయినట్లు చెప్పారు. మాఫియా సొమ్ముతో పార్టీ సభ్యత్వాలు చేయాల్సిన ఖర్మ టీడీపీకి ఇప్పుడు, ఎప్పుడూ లేదన్నారు. మేకపాటి రాజారెడ్డి ఎప్పటికీ ఉదయగిరి ఎమ్మెల్యే కాలేడని ఈ సందర్భంగా వంటేరు జోస్యం చెప్పారు. ఎంపీగా ఉన్న సమయంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి నడికుడి రైల్వేలైను వచ్చేస్తోందని చెప్పాడే తప్ప ఈ నాటికీ రైల్వేలైను అతీగతి లేదన్నారు. రాజమోహన్‌రెడ్డి, రాజారెడ్డి ఉదయగిరికి చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతన్నాయని చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి, కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కావ్య క్రిష్టారెడ్డి, కాకర్ల సురేష్‌లు ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చారన్నారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, బ్రాహ్మణక్రాక సర్పంచ్, ఉపసర్పంచులు ఇండ్ల సుధాకర్, డి.మాల్యాద్రిరెడ్డి, నాయకులు మధుసూదనరావు, తిరుమలరెడ్డి, రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు

లింగసముద్రం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరుగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని మొగిలిచెర్ల దత్తాత్రేయస్వామి ఆలయం, లింగసముద్రం తిరుమణిశెట్టి కోటయ్య మందిరం ముస్తాబవుతున్నాయి. ఆలయాలను నిర్వాహకులు భక్తుల కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను రంగురం గుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే లింగసముద్రం తిరుమణిశెట్టి కోటయ్యస్వామి మందిరంలో జరిగే ఉత్సవాలకు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుండే కాక దూర ప్రాంతాల నుంచి కూడా తరలివస్తారు. నిర్వాహకులు భక్తులకు పండుగ రోజు మధ్యాహ్నం, రాత్రి అన్నదానం ఏర్పాటు చేస్తామని ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. అలాగే రాత్రికి పండరి భజన, కోలాటం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఆలయాల వద్దకు వచ్చేందుకు భక్తుల కోసం కందుకూరు, కావలి డిపోల నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

● బిట్రగుంట(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని శైవ ఆలయాల్లో మంగళవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా సోమవా రం ఆలయశుద్ధి పనులు చేపట్టారు. విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి, అమ్మవార్లకు విశ్వనాథరావుపేట గోపిశెట్టి వేణుగోపాల్, పద్మావతి దంపతులు మకర తోరణాలను అందజేశారు.

● ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ డిపో పరిధిలోని ఆయా క్షేత్రాలకు 19బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఉదయగిరి-సిద్దేశ్వరం-7, ఉదయగిరి-భైరవకోన-7, సీతారామపురం-కోవిలంపాడు-3, సీతారామపురం-సిద్దేశ్వరం-2 చొప్పున బస్సులు నడుపుతున్నామన్నారు. భక్తుల రద్దీని బట్టి అదనపు సర్వీసులు సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బస్సుల్లో సాధారణ చార్జీలే వసూలు చేయడం జరుగుతుందని, భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

● అనంతసాగరం (ఆంధ్రజ్యోతి):సోమశిల సోమేశ్వరాలయం, కామిరెడ్డిపాడు అటవీ ప్రాంతంలో ఉన్న దుర్గ మ్మ ఆలయం, చిలకలమర్రి వద్ద మల్లెంకొండ శిలలు బుధవారం జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబ య్యాయి. ఈ సందర్భంగా జాగారం కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో కొనసాగాలి

● కందుకూరు న్యాయవాద సంఘం సభ్యుల డిమాండ్

కందుకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సివిల్ జడ్జి పరిధిలో ఉన్న పొన్నలూరు, సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి మండలాలను నూతనంగా సింగరాయకొండలో ఏర్పాటు చేయనున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కాకుండా యధావిధిగా కొనసాగించాలని కందుకూరు న్యాయవాద సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వివి సుబ్బారావు, పండిత్ సంపత్ కుమార్‌లు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒంగోలు జిల్లా కోర్టుకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిని నిర్ణయిస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఈనెల 14న ఉత్తర్వులు జారీ చేయడం శోచనీయం అని పేర్కొన్నారు.

అధికారుల గైర్హాజరుతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెలవెల

ఉదయగిరి, ఫిబ్రవరి 24: నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెలవెలబోయింది. ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి వివిధ శాఖలకు చెందిన సుమారు 18 మంది అధికారులు హాజరు కావాల్సి ఉంది. అయితే 11గంటల సమయంలో తహసీల్దారుతోపాటు కేవలం ఐదు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రతి వారం ఇదే పరిస్థితి ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమానికి హాజరైన కొందరు అధికారులు విలేఖరులు ఫోటోలు తీస్తున్నారు, రండంటూ కొన్ని శాఖల అధికారులకు ఫోన్‌లు చేస్తుం డడంతో వారో లేదా వారి సిబ్బందో హడావిడిగా వచ్చి కార్యక్రమాన్ని హాజరై మమ అనిపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శిక్షణ కార్యక్రమం పరిశీలన

సీతారామపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, ఈవోపీఆర్డీ భార్గవి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెహమాన్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలుచేయడం ద్వారా చక్కని ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈసందర్భంగా శిక్షణ కేంద్రంలో తయారుచేసిన బోధనోపకరణాలను పరిశీలించారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



కోటీశ్వరాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ తిరుమలరావు

చేజర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కోటితీర్థం గ్రామంలోని కోటీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సంగం సర్కిల్ సీఐ వేమారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆల య వద్ద ఏర్పాట్లను ఎస్‌ఐ తిరుమలరావుతో కలసి పరిశీలించారు. వారంరోజుల పాటు జరిగే ఉత్సవాలలో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక క్యూలైన్‌లలో భక్తులకు త్వరితగతిన దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ కొమ్మి పార్థసారధి, స్థానికులు పాల్గొన్నారు

భూసమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తమ రిజిస్ట్రేషన్, అసైన్‌మెంట్ భూములకు సంబంధించి 1బీ, అడంగల్ పత్రాలు ఆన్‌లైన్‌లో వచ్చేలా చర్యలు చేపట్టాలని సోమవారం బండగానిపల్లి పంచాయతీలోని పలు గ్రామాల రైతులు తహసీల్దారు సుభద్రకు విన తిపత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో తమ భూము లకు సంబంధించి 1బీ, అడంగల్ పత్రాలు రాకపో వడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని వాపోయారు.

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

● అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి



వైద్యశాలలో మందులు పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్ వలి

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో స్కానింగ్ ద్వారా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ, పలు ప్రైవేటు వైద్యశాలలను వైద్యఆరోగ్య సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. స్కానింగ్ సెంటర్‌లో ఎలాంటి దేవుళ్ల ఫోటోలు పెట్టరాదని, లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని సూచిస్తూ ప్రతి వైద్యశాలలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీ, గండిపాళెం పీహెచ్‌సీలో మందులను, ఫ్రిజ్‌లో ఉన్న టీకాలను పరిశీలించారు. అర్హులైన వారికి బీసీజీ టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శివకల్పన, ప్రశాంత్, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి తనిఖీ చేసి ల్యాబ్, ఫార్మసీ, డెలివరీ గదులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అయూబ్‌అఫ్సర్, వనజ, సిబ్బంది పాల్గొన్నారు.

సింహ వాహనంపై భీమేశ్వరుడు



సింహ వాహనంపై ఊరేగుతున్న భీమేశ్వరస్వామి

సంగం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వంగల్లులోని భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున భీమేశ్వరస్వామి సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భం గా స్వామివారి గ్రామోత్సవానికి భక్తులు స్వా గతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌కు పూలంగి సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యూపీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయండి

లింగసముద్రం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పెంట్రాల ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని టీడీపీ నాయకులు కిలారి కొండయ్య, జడ కొండయ్య, దార్ల మధుసూదనరావులు సోమవారం ఓ ప్రకటనలో ఉన్నతాధికారులను కోరారు. ప్రస్తుతం విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులలో భాగంగా తమ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాల గా మార్పు చేయాలని అధికారులు నిర్ణయించారని ఈ నిర్ణయంతో పాఠశాలలో చదివే 6,7,8 తరగతుల విద్యార్థులు 4కి.మీ దూరంలోని లింగసముద్రం హైస్కూల్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. కొందరు విద్యార్థులు స్కూల్ మానేసే అవకాశం ఉందన్నారు.

'రుణాలివ్వక పోవడం అన్యాయం'

అల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు రుణాలకు మంజూరు చేయకపోవడం అన్యాయం అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. సోమవారం ఆయన ఈ విషయంపై స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట దళితులు, గిరిజనులతో కలసి నిరసన చేపట్టి మాట్లాడారు. గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తలపించేలా కూటమి ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని విమర్శించారు. వెనుకబడిన గిరిజనులు బతుకుతులు మార్చేందుకు కార్పొరేషన్ లోన్లు మంజూరు చేయాలని డిమాండు చేశారు. కేంద్రం మంజూరు చేసే నిధులను దారిమళ్లించడం దారుణం అన్నారు. త్వరలో రుణాలను మంజూరు చేయాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చవుటూరి శ్రీనివాసులు, ఎన్.ఏడుకొండలు, శ్రీనివాసులు, జడ్డా వాసు, కత్తి విజయమ్మ, సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.

శ్రద్ధగా చదవి మంచి మార్కులు సాధించండి

కలిగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాల యంలో సోమవారం జరిగిన సరస్వతీపూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్‌ను అందజేయగా స్థానికులు మేడం నరసింహారెడ్డి, వెంకటశేషయ్య పరీక్షల విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, కేజీబీవీ ప్రిన్సిపల్ కే.సుప్రియ పాల్గొన్నారు. అలాగే సిద్దనకొండూరు జడ్పీ ఉన్నతపాఠశాల పదో విద్యార్థులు సరస్వతీదేవి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీకాంతం, ఎస్ఎంసీ చైర్మన్ అంబటి మాల్యాద్రి పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక వైద్య సేవలు

కలిగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీని సోమవారం జిల్లా అడిషనల్ వైద్యాధికారి, టీబీ లేప్రసీ నోడల్ అధికారి ఎస్‌కే.ఖాదర్‌వలి సందర్శించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్నిగ్రామాల్లో పీహెచ్‌సీ సిబ్బంది టీబీ, హెచ్ఐవీ అనుమానిత కేసులను గుర్తించాలని కోరారు. అలాంటి కేసులకు ప్రత్యేక మందులు మింగించే బాధ్యతను వైద్య సిబ్బంది తీసుకోవాలని సూచించారు. అనం తరం వైద్యులు రామనాథం స్మారక ప్రజావైద్యశాల, యుకే.స్పెషాలిటి వైద్యశాలను సందర్శిం చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శైవక్షేత్ర గర్భాలయ రాతి ద్వారబంధ ప్రతిష్ఠ

బిట్రగుంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బోగోలు మణికంఠనగర్‌లో నిర్మాణంలో ఉన్న శైవక్షేత్ర గర్భాలయ రాతి ద్వారబంద ప్రతిష్ఠ శ్రీరామగిరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం శాస్త్రోక్తంగా ని ర్వహించారు. ద్వారబంద దాత దేవరాల తిరుపతి తల్లితండ్రులు సుబ్బయ్య, రమణమ్మల జ్ఞాపకార్థం అందజేశారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోనే ప్రథమ శైవక్షేత్రంలో విఘ్నేశ్వర సు బ్రహ్మణ్య, అయ్యప్ప విశ్వేశ్వర అన్నపూర్ణ సమేత శివాలయ నిర్మాణ పనులు భక్తుల సహకారంతో జరుగుతునట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయలక్ష్మీ, కుంచల రుమ లరావు, మల్లికార్జునరావు, జాదవ్‌సుధాకర్‌రావు, లక్ష్మీనారాయణ, బచ్చువేణు ఉన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఎంపీపీపై ఫిర్యాదు



కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేస్తున్న రామారావు, మాల్యాద్రి తదితరులు

లింగసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండ లం లో చేసిన అభివృద్ధి పనులు, చేయబోయే పనులను ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అడ్డుకుంటున్నారని టీడీపీ నేతలు వంకాయలపాటి మాల్యాద్రి, మద్దెల రామారావుతో పాటు మరికొందరు టీడీపీ నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు పాల్గొని మాట్లాడారు. 2023-24లో గత ప్రభుత్వంలో జరిగిన కొన్ని పనుల్లో అవకతవకలు జరిగాయని, పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారని వినతిలో పేర్కొన్నారు. వీరి వెంట టీడీపీ నాయకులు ఉన్నం వీరాస్వామి, అడపా రంగయ్య, అంగుళూరి చినకొండయ్య, పోలిమేర నాగిరెడ్డి, రాజారపు మాలకొండయ్య తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● షాలెట్, ఎంపీడీవో, సంగం



సంగం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో షాలెట్ పేర్కొన్నారు.

? మొదటి విడత పల్లెపండుగలో మండలానికి ఎన్ని నిధులొచ్చాయి.

! ఉపాధిహామీ నిధుల నుంచి మండలానికి రూ. 1.5 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో 18 గ్రామాల్లో 30పనులు (సీసీ రోడ్డు నిర్మాణం) చేపట్టాం.

? రెండోవిడత ఎన్ని కోట్లు మంజూరయ్యాయి.

! ఉపాధిహామీ పథకంలో రెండోవిడతలో మరో రూ.2కోట్లు మంజూరయ్యాయి. రూ.86లక్షలకు ప్రతిపాదన పంపాం. అనుమతులొచ్చాయి. మిగతా పనుల ప్రతిపాదనలు పంపాల్సి ఉంది.

? కార్పొరేషన్ల వారీగా మండలానికి రాయితీ రుణాలెన్ని వచ్చాయి.

! బీసీ కార్పొరేషన్‌లో 31, కాపు -4, రెడ్డి -3,కమ్మ, ఈబీసీ కార్పొరేషన్‌లో రెండేసి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య కార్పొరేషన్‌లో ఒక్కొక్కటి చొప్పున రాయితీ రుణాలొచ్చాయి.

? మండలంలో ఎన్ని చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయి.

! 20 పంచాయతీలకు గాను 10పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలున్నాయి. ఆయా పంచాయతీ నిధుల నుంచి చెత్త సేకరణకు ట్రైసైకిల్‌తోపా టు గ్రీన్ అంబాసిడర్స్‌ను నియమించి 15వ తేదీ నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలిస్తున్నాం.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలి

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్ర కారం వడ్డించాలని మండల విద్యాధికారి-2 ఆనందరావు తెలిపారు. సత్యవోలు, కొమ్మి ఎస్సీ కాలనీ, బోయళ్లవారిపాలెం ప్రాథమిక పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలి చ్చారు. విద్యార్థుల సమగ్ర వివరాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలి



వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన సర్పంచి కొండయ్య, నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు మండలం పరకండ్లపాడు దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలని గ్రామ సర్పంచ్ కోలా కొండయ్య, గ్రామస్థులు సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లుతో కలిసి గ్రీవెన్స్‌లో సబ్‌కలెక్టర్ శ్రీపూజకు వితని పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాము, గారపాటి రామయ్య, శివ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

జీతాల కోసం ధర్నా

వింజమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చంద్రపడియ దగ్గర ఉన్న ఫ్యాక్టరీలో రెగ్యులర్ ఉద్యోగులకు రెండు నెలల నుంచి జీతాలు అందడంలేదని వారు సోమవారం ఫ్రాడ్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా నిర్వహించారు. జీతాలు చెల్లించిన అనంత రమే పనులకు వస్తామని నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఫ్యాక్టరీ హెచ్ఆర్ అజయ్ కుమార్ కార్మికుల దర్గరకు వచ్చి వారంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు